www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 217 | ఆదివారం | 27 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + 32 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00









70వ గణతంత్ర ఘన దృశ్యాలు

1. 70వ రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి భవన్ తేనీటి విందులో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ముఖ్యఅతిథి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ప్రధాని మోడీ
2. రాజ్‌పథ్ ఉత్సవాల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని
3. రిపబ్లిక్ డే పరేడ్‌లో దేశ రక్షణ బలాన్ని చాటుతున్న వజ్ర టి హోవిట్జర్లు
4. పురుష సైనిక దళానికి నాయకత్వం వహించిన మహిళా సైనిక అధికారి కస్తూరి

12



విరబూసిన నవ్వులు

రాజ్‌భవన్ ఎట్‌హోంలో గవర్నర్ నరసింహన్‌తో ముఖ్యమంత్రి కెసిఆర్ (జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా)

3

ప్రగతికి పట్టం కట్టిన పాలన



నాలుగున్నరేళ్లలో తెలంగాణ అపూర్వ ప్రగతి సాధించింది | సంక్షేమం, అభివృద్ధి ప్రజల మనసులను దోచుకున్నాయి | గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

3

జంగిల్ బచావో బఢావో

- కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం
- అడవి నుంచి పూచిక పుల్ల కూడా వెళ్లొద్దు
- సాయుధ పోలీసులతో ఫ్లైయింగ్ స్క్వాడ్లు
- అటవీ మార్గాలపై నిరంతర నిఘా
- అవసరమైతే చట్టాల్లో మార్పులు
- పచ్చదనం కోసం బహుముఖ వ్యూహం
- ప్రజా ప్రతినిధుల నుంచి ప్రతి నెలా విరాళాలు
- నిధుల కోసం పరిస్థితిని బట్టి 'గ్రీన్ సెస్' వసూలు
- సమైక్య రాష్ట్రంలో పాలకుల ప్రేక్షకపాత్ర
- అటవీ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష



మన తెలంగాణ/హైదరాబాద్

పచ్చదనాన్ని పరిరక్షించడానికి బహుముఖ వ్యూహాన్ని అనుసరించడంతో పాటు కలప స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పి.డి. చట్టం కింద కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. అడవులను కాపాడుకోకుండా ఎన్ని మొక్కలు నాటినా ప్రయోజనం లేదని, 'జంగిల్ బచావో... జంగిల్ బఢావో' నినాదంతో పట్టుదల, అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తే తప్ప మన లక్ష్యాన్ని సాధించలేమని అధికారులకు స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో అడవులు విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నా పాలకులు ప్రేక్షక పాత్ర వహించారని, ఇకపైన అది పునరావృతం కారాదని, ఒకవేళ టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే అందరి కన్నా ముందుగానే వారిపైనే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న అడవిని పూర్తి స్థాయిలో రక్షించడం, కోల్పోయిన చోట పచ్చదనాన్ని (చెట్లను) పునరుద్ధరించడం, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వనాలను పెంచడం, హైదరాబాద్, వరంగల్ లాంటి మహా నగరాలతో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించడానికి పచ్చదనాన్ని పెంచడం లాంటి బహుముఖ వ్యూహాన్ని అనుసరించాలని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో నిర్దిష్టంగా నిధుల్ని కేటాయిస్తామని, 'కాంపా' నిధుల్ని కూడా వినియోగించుకుంటామని, అప్పటికీ అవసరమనిపిస్తే 'గ్రీన్ సెస్' పేరుతో పన్ను వసూలు చేయాలని అధికారులకు సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. పచ్చదనం,

తరువాయి 6లో



పులిగోళ్లు స్వాధీనం

మంచిర్యాల జిల్లాలో చంపేసిన పులి గోళ్ల స్వాధీనం

7

టిఆర్‌ఎస్ ఆఫీస్‌లో వేడుకలు | కెటిఆర్ జెండా వందనం



మన తెలంగాణ/హైదరాబాద్

టిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్రదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్రదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జెండావందనానికి ముందు కెటిఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి,తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం నుంచి వందలాధిమంది కార్యకర్తలు

తరువాయి 6లో



దిగివచ్చిన ట్రంప్

- గోడ గొడవ పక్కనపెట్టి డెమోక్రాట్లతో రాజీ
- 3వారాల పాటు షట్‌డౌన్‌కు విరామం
- ప్రభుత్వ సిబ్బందికి తాత్కాలిక ఊరట

10

ఒసాకాదే ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: జపాన్ స్టార్ నవోమి ఒసాకా ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఒసాకాకు ఇది వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ కావడం విశేషం. శనివారం జరిగిన ఫైనల్లో ఒసాకా చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి పెట్రా క్విటోవాను ఓడించి ట్రోఫీని సాధించింది. అంతేగాక ఈ విజయంతో మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది.

11

కుంచెపోటు



ఈ బాబాలు సన్యాసంలో ఉన్నా సంసారుల గురించే ఆలోచిస్తుంటారేమో?!

ఫుడ్ ప్రోగ్రెసింగ్

- ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఉద్యానశాఖ ప్రాథమిక నివేదిక
- 7 జిల్లాల్లో మామిడి, మూడు చోట్ల టమాట ప్రాసెసింగ్ యూనిట్లు
- పసుపు, కారంపొడి తయారీతో పాటు ఉల్లి పేస్ట్



మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలో 7 జిల్లాల్లో మామిడికి సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలని రాష్ట్ర ఉద్యాన శాఖ ప్రతిపాదించింది. అలాగే మూడు చోట్ల టమాట పంటకు విలువ జోడించి ఉత్పత్తులను తయారు చేసేందుకు యూనిట్లు ఏర్పా టు చేస్తే బాగుంటుందని సూచించింది. ఈ మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ఉద్యాన శాఖ ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేసింది. 24 జిలాల్లోని 146 మండలాల్లో సాగవుతున్న 3.85 లక్షల ఎకరాల్లో పండుతున్న పం టలు అనుగుణంగా ఒక నివేదికను తయారు

తరువాయి 6లో



హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

జలమయమైన లోతట్టు ప్రాంతాలు | విద్యుత్ సరఫరా నిలిపివేత

2

కులరహిత సమాజమే లక్ష్యం

మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : కుల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కులనిర్మూలన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆదర్శ వివాహం చేసుకున్న వారు చట్టసభల్లోకి వస్తే వారి హక్కులు త్వరితగతిన అమలుకు నోచుకునే అవకాశాలున్నాయన్నారు. పరువు కోసం నేడు జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు కులనిర్మూలన సంఘం పనితీరును ప్రశంసించారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క, పిఒడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ సమాజం ఆధునికత వైపు పరుగులు తీస్తున్న క్రమంలో కులాల కుమ్ములాటలు చోటుచేసుకోవడం విచారకరమన్నారు. కులాలకు అతీతంగా వివాహాలు జరిగిన నాడే అన్ని వర్గాలు అభ్యున్నతి వైపు అడుగులు వేస్తాయన్నారు.కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రయ్య, తెలంగాణ వ్యాట్ అప్పీలేట్ ట్రిబ్యునర్ చైర్ పర్సన్ జి.రాధారాణి, మాజీ డిఐజి నాగన్న, దళితసేవ రాష్ట్ర అధ్యక్షులు జె.బి రాజు, బహుజన ప్రతిఘటన వేదిక నాయకులు ఊసా, కులనిర్మూలన సంఘం సలహాదారులు టి.వి దేవదత్, టిఇఎంజెయు అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్, మానవ వికాస వేదిక నాయకులు సాంబశివరావు, అరుణోదయ సాంస్కృతిక సమఖ్య విమలక్క, పిఒడబ్ల్యూ సంధ్యక్క, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీ, డిజిపి ఆఫీస్‌లో జెండావిష్కరణ



మన తెలంగాణ/హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీస్ అకాడమీ (ఆర్.బి.వి.ఆర్.ఆర్)లో అకాడమీ డైరెక్టర్ సీనియర్ ఐపిఎస్ అధికారి సంతోష్‌మిశ్ర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.అనంత శర్మ, జాయింట్ డైరెక్టర్ రమేష్‌నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఐపిఎస్ అధికారి(ట్రైగ్), డాక్టర్.బి.నవీన్‌కుమార్ డిప్యూటీడైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్), పి.ఆర్.ఆర్ మూర్తి ఎడి(ఒడి) తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర డిజిపి కార్యాలయంలో ఐజిపి స్వాతి లక్ర జెండావిష్కరణ గావించారు. కార్యక్రమంలో పలువురు ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు.



అమరవీరులకు సిఎం శ్రద్ధాంజలి

- సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురికి ట్రోఫీలు ప్రదానం
- పరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు





మన తెలంగాణ/హైదరాబాద్ : పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరయ్యే ముందు సికింద్రాబాద్‌లోని సైనిక అమరుల స్థూపం దగ్గర సిఎం కెసిఆర్ అంజలి ఘటించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత సాయుధ బలగాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకల్లో భాగంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను గవర్నర్ అందచేశారు. వివిధ విభాగాల్లో తమిళనాడు స్పెషల్‌ఫోర్స్ నుంచి ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్, నేత్ర విద్యాలయ నుంచి కుమారి వై.అంజమ్మలతో పలువురు గెలుపొందడంతో వారికి ట్రోఫీలను గవర్నర్ అందచేశారు. చివరగా అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ సంయుక్తంగా రూపొందించిన 18 అంతస్థుల క్రేన్‌పై నుంచి బెలూన్లను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, హోంమంత్రి మహమూద్‌అలీ, డిజిపి మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఎంపిలు దత్తాత్రేయ, జితేందర్‌రెడ్డి, సంతోష్, ఎమ్మెల్యే కెటిఆర్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌ల చైర్మన్లు, పలువురు ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో శిక్షణా తరగతులు?

- తొలుత సర్పంచ్‌లకు శిక్షణ
- యూనిట్‌గా జిల్లాలను చేసి టిఆర్‌ఎస్ శిక్షణా తరగతులు
- కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలపై కార్యకర్తలకు శిక్షణ

మనతెలంగాణ/హైదరాబాద్: పంచాయితీ ఎన్నికల అనంతరం కార్యకర్తలకు, నాయకులకు, పంచాయితీ సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించాలని టిఆర్‌ఎస్ నిర్ణయించింది. పార్లమెంట్ ఎన్నికలలోపు శిక్షణా తరగతులను పూర్తి చేసి కార్యకర్తలను ఎన్నికలకు సంసిద్ధం చేయాలని టిఆర్‌ఎస్ భావిస్తుంది. లక్షలాధి పార్టీశ్రేణులున్న ఉద్యమపార్టీ టిఆర్‌ఎస్. అయితే ఆనాడు తెలంగాణకోసం ఉద్యమించి సాధించినట్లే నేడు బంగారుతెలంగాణ లక్ష్యసాధనగా ఉద్యమించాలని టిఆర్‌ఎస్‌నిర్ణయించింది. గ్రామసీమల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోశించే సర్పంచ్‌లకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, నిధుల సమీకరణ పై స్థానిక సంస్థలకు సంపూర్ణ అవగాహన కల్పించి వారిద్వారా గాంధీ కలలు కన్న గ్రామాభివృద్ధిని సాకారం చేయాలని టిఆర్‌ఎస్ భావిస్తుంది. అలాగే పార్టీనాయకులకు శిక్షణ ఇచ్చి వారిద్వారా జిల్లాల్లోని పార్టీశ్రేణులకు శిక్షణ ఇప్పించాలని టిఆర్‌ఎస్ భావిస్తుంది. తొలుత జనవరి మాసంలో శిక్షణా తరగతులు ప్రారంభించాలని టిఆర్‌ఎస్ ఆలోచించినప్పటికీ జనవరిలో సర్పంచ్ ఎన్నికలు, యాగం ఉండటంతో ఫిబ్రవరిలో శిక్షణా తరగతులు నిర్వహించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈమేరకు సంబంధిత రంగాల్లో నైపుణ్యత ఉన్న టిఆర్‌ఎస్ నాయకులకు శిక్షకులుగా బాధ్యతలు ప్పగించాలని పార్టీ ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. దేశంలో ఏరాజకీయ పార్టీకి లేనివిధంగా పార్టీకార్యకర్తల కోసం బీమాను అమలుచేస్తున్న టిఆర్‌ఎస్ ఒక వైపు కార్యకర్తల సంక్షేమం, మరోవైపు శిక్షణ పై దృష్టి సారించింది. జనవరి నెల ముగింపు నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి కావస్తుండటంతో ఫిబ్రవరిలో సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని టిఆర్‌ఎస్ అధినాయకత్వం నిర్ణయించింది. ఈ మేరకు శిక్షణా తరగతుల స్వరూపం, శిక్షణ ఇవ్వాల్సిన అంశాలు, తరగతులకు ఆహ్వానించే ప్రతినిధులతో టిఆర్‌ఎస్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సుమారు ఐదు జిల్లాలను ఒక యూనిట్‌గా చేసి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పార్టీ నాయకులు కార్యక్రమాలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిసింది. సర్పంచులతో పాటు జిల్లాలోని ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఇన్‌చార్జిలను శిక్షణ తరగతులకు ఆహ్వానించనున్నారు. పార్లమెంట్ ఎన్నికలలోపు తరగతులు నిర్వహించి పార్టీ శ్రేణులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పార్టీ అధిష్టానం సిద్ధమైంది. సర్పంచుల శిక్షణా తరగతులు పూర్తి కాగానే పార్టీ శ్రేణులకు శిక్షణ ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. తాజాగా జరిగిన శాసన సభ ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించిన టిఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాల్లో భారీ మెజారిటీని కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతుంది. అయితే అనేక కారణాలతో పాటు ట్రాక్టర్ గుర్తుతో కొంతవరకు మెజారిటీ తగ్గిన ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలకు సంసిద్ధం చేసేందుకు తొలుత ఖమ్మం జిల్లా నుంచే శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయని సమాచారం. కెటిఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన అనంతరం జిల్లాలవారిగా కార్యకర్తలను ప్రోత్సహించే అవకాశం కూడా శిక్షణా తరగతుల ద్వారా లభించనున్నట్లు నాయకులు చెప్పారు. ఫిబ్రవరిలో నిర్వహించే శిక్షణా తరగతులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. బంగారు తెలంగాణ లక్ష్యసాధనలో భాగంగా కార్యకర్తలను తీర్చిదిదేందుకు రూపుదిద్దుకుంటున్న శిక్షణా తరగతలు తెలంగాణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయనుందనే ఆశాభావం నాయకుల్లో వ్యక్తం అవుతుంది.

గుర్తుల గందరగోళం.. జల్లపల్లి సర్పంచ్ ఎన్నిక వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: కేటాయించిన గుర్తులు బ్యాలెట్ పేపర్‌పై సరిగ్గా ముద్రించకపోవడంతో నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి మండలం జల్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్‌ల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. మూడో విడత పోలింగ్ 30న జరగనున్న మూడవ విడత పోలింగ్‌తో పాటు చేటపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే జల్లపల్లి గ్రామానికి రెండో విడతలో ఈ నెల 25న ఎన్నిక నిర్వహించాల్సి ఉంది.

సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వారికి రిటర్నింగ్ అధికారి రింగ్, కత్తెర, కప్ సాసర్‌తో కూడిన గుర్తులను కేటాయించారు. వాస్తవానికి సీరియల్ నెంబర్ ప్రకారం మూడో అభ్యర్థికి మూడో సీరియల్ గుర్తుగా బ్యాట్ రావాల్సి ఉంది. అయితే కప్పు సాసర్ గుర్తును ఎన్నికల సిబ్బంది కేటాయించారు. అలాగే బ్యాలెట్ పేపర్‌పై కూడా గుర్తులు సరైన క్రమంలో ముద్రించలేదు. పోలింగ్ రోజున ఈ విషయాన్ని గమనించిన అధికారులు జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ సర్పంచ్ ఎన్నికతో పాటు వార్డు మెంబర్‌ల ఎన్నికను కూడా వాయిదా వేశారు. ఈ నెల 30వ తేదీన మూడు నుంచి 8 వార్డులకు, సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించాలని ఆదేశించారు. ఒకటి , రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

శివ్వారం పంచాయతీ ఫలితాలు 28న

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని శివ్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ఫలితాలను ఈ నెల 28వ తేదీన వెల్లడించాలని ఆదేశించింది. అలాగే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా అదే రోజున నిర్వహించాలని స్పష్టం చేసింది. అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆ జిల్లా ఎస్‌పిని ఆదేశించింది.

మహిళ రిజర్వ్‌డ్ స్థానానికి పురుషుల నామినేషన్

నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ మండలం, ముల్కలకల్వ గ్రామ పంచాయతీలోని 5వ వార్డును జనరల్ మహిళకు రిజర్వ్ చేసినట్లు రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ వార్డుకు ఇద్దరు మహిళలు నామినేషన్లు వేశారు. మరో ఇద్దరు పురుష అభ్యర్థుల నుంచి కూడా నామినేషన్లను స్వీకరించి, బరిలో ఉండే అభ్యర్థుల జాబితాలో వారి పేర్లను కూడా ఎన్నికల సిబ్బంది ప్రకటించారు. బ్యాలట్ పేపర్‌పై వారికి గుర్తులను కూడా కేటాయించారు. ఆ తరువాత గుర్తించిన అధికారులు ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆ వార్డును రీ నోటిఫై చేసి కొత్తగా మళ్లీ ఎన్నిక నిర్వహించాలని సంబంధిత జిల్లా అధికారులను అశోక్‌కుమార్ ఆదేశించారు. ఇద్దరి మహిళా అభ్యర్థుల నామినేషన్ల పరిశీలనా ప్రక్రియను ఈ నెల 28న చేపట్టనున్నారు. వచ్చే నెల 8న ఆ వార్డుకు ప్రత్యేకంగా పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

లోతట్టు ప్రాంతాలు జలమయం • పలుచోట్ల నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



మన తెలంగాణ / హైదరాబాద్ : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల విద్యుత్ శాఖ అధికారులు ముందుజాగ్రత్త చర్యగా కరెంటు సరఫరాను నిలిపివేయగా మరికొన్ని చోట్ల నిలిచిపోయింది. అనేక ప్రధాన రోడ్లపై వాహనాల రాకపోకలు స్థంభించిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటకుపైగా కురిసిన వర్షం కారణంగా ముషీరాబాద్, ఆర్‌టిసి క్రాస్ రోడ్డు, విద్యానగర్, నల్లకుంట, ఫీవర్ హాస్పిటల్, కాచిగూడ, సోమాజీగూడ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై జన జీవనం స్థంభించిపోయింది. హైదరాబాద్ నగరంలోని మైత్రీవనం దగ్గర 5.5 సెం.మీ వర్షపాతం నమోదు కాగా షేక్‌పేటలో 4.5, గోల్కొండలో 2.5, ఖైరతాబాద్ 2.5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలవు దినం కావడంతో చాలా మంది నాంపల్లిలోని ఎగ్జిబిషన్ చూడడానికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో వర్షం కారణంగా దారిలోనే చిక్కుకుపోయారు. అకాల వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ అధికారులు రెండు రోజుల ముందే హెచ్చరించారు. కొన్నిచోట్ల వడగళ్ళ వానలు పడతాయని, అప్రమత్తంగా ఉండాలని కూడా హెచ్చరించారు. వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించినట్లుగానే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీగా వాన కురిసింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంగాధర మండలంలో జొన్న పంటకు భారీగా నష్టం వాటిల్లింది. రామడుగు, చొప్పదండి మండలాల్లోను వాన ఎక్కువగానే కురిసింది. కుండపోత వర్షానికి హుజురాబాద్‌లో షాపులు, ఇళ్లల్లోకి నీరు చేరింది. కరీంనగర్ నగరంలో వర్షంలోనే గణతంత్ర వేడుకలు జరిగాయి. వేములవాడ ఆలయ పరిసరాల్లో నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వేములవాడ, చందుర్తి, కొనరావుపేట కుండపోత వర్షం కురిసింది. అటు పెద్దపల్లి జిల్లాలోని పలుచోట్ల కుండపోత వర్షం నమోదైంది. సిద్ధిపేట జిల్లాలోని నంగనూర్‌లో 10 సెంటిమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. రాజన్న సిరిసిల్లలో 8 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. వరంగల్, హన్మకొండ, కాజీపేట లాంటి పలు చోట్ల వర్షం కారణంగా విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని జిహెచ్‌ఎంసి సిబ్బందిని కమిషనర్ దాన కిషోర్ ఆదేశించారు. సిఎం కెసిఆర్ ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో 5రోజుల పాటు ఛండియాగాన్ని నిర్వహించిన మరుసటి రోజే రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడం విశేషం.



ప్రగతికి పట్టంకట్టిన పాలన

సిఎం కెసిఆర్ పాలనలో రాష్ట్రం ప్రగతి ● రాజ్యాంగ నిర్మాతలను, మహనీయులను స్మరించుకోవాలి ● నాలుగేళ్లలో తెలంగాణ ప్రగతిని సాధించింది ● సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల మనస్సులను దోచుకున్నాయి ● గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్





సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ నరసింహన్

మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ పాలనలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జాతీయ పతకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఆయన హృదయపూర్వకంగా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ నిర్మాతలను, మహనీయులను స్మరించుకోవడం మన విధి అని, వారి త్యాగాల ఫలితంగా ఈ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాలుగేళ్లలోనే తెలంగాణ ప్రగతిని సాధించిందని నరసింహన్ స్పష్టం చేశారు. వినూత్న ఆలోచనలతో సిఎం కెసిఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా రాష్ట్ర పునర్నిర్మాణ చర్యలు చేపట్టారని, బలమైన నాయకత్వం వలన దానికి సానుకూలత చేకూరిందని గవర్నర్ పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలంగాణ ప్రజల మనసులు గెలుచుకున్నాయని అందుకే సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు భారీ మెజార్టీతో మరోసారి కెసిఆర్ ప్రభుత్వాన్ని గెలిపించారని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 40 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. బంగారు తెలంగాణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వృద్ధాప్య పింఛన్ల వయో పరిమితిని 57 ఏళ్లకు తగ్గించారని, పింఛన్లను రెండింతలు చేశారని ఆయన తెలిపారు.



సస్యశ్యామల తెలంగాణ ఆకృతి దాల్చే విధంగా..

కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ఈ రబీ నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలు తెలంగాణ ప్రజలకు అందేలా వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. మిషన్ కాకతీయ పథకం కారణంగా వేలాది చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, డిండి ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. సస్యశ్యామలం తెలంగాణ ఆకృతి దాల్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణకు ప్రయోజనాలను చేకూర్చే పథకం మిషన్ కాకతీయ అని దీనివలన భూగర్భజలాలు పెరిగాయన్నారు. ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరితగతిన పూర్తి చేస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులను కేంద్ర ద్వారా మంజూరు చేయించుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్నారు. పొరుగు రాష్ట్రాలతో ఉన్న సమస్యలను పరిష్కరించి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ఈ ఏడాది మార్చినాటికి అన్ని ఇళ్లకు మంచినీరు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.99,643లు ఖర్చు చేసిందన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం లక్షా 7 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. రాబోయే కాలంలో మరో లక్షా 17 వేల కోట్ల అంచనాతో పనులు జరగనున్నాయన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలో తెలంగాణ రాష్ట్రానికున్నా 1,300 టిఎంసిల నీటి వాటాను వాడుకోవడానికి రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులను పూర్తి చేసి కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.

24 గంటలు కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం

24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, వ్యవసాయ రంగానికి 24 గంటలు కరెంట్ ఇస్తుంది తెలంగాణ అని ఆయన తెలిపారు. పవర్ ప్లాంట్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కరెంట్ కోతల నుంచి రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ దిశగా ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. 800 మెగావాట్ల కెటిపిఎస్ 7వ దశ ప్లాంట్ ఇటీవలనే ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. 1,800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన భద్రాద్రి ప్లాంట్ నిర్మాణాన్ని కూడా శరవేగంగా పూర్తిచేసి ఈ ఏడాది నుంచే విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం ప్రారంభించబోతుందన్నారు. 4,000 మెగావాట్ల యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణం కూడా శరవేగంగా సాగుతుందన్నారు. నేడు 16,503 మెగావాట్ల విద్యుత్ ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో అగ్రస్థానం సాధించిందన్నారు. రైతుబంధు పథకాన్ని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, రైతుబంధు, రైతుబీమా పథకాల వలన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకాల వలన దేశవ్యాప్తంగా రాష్ట్రానికి పేరు వచ్చిందన్నారు. ధరణి వెబ్‌సైట్ వలన భూముల వివరాలు అందుబాటులోకి వస్తాయని, త్వరలో దీనిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. భూ రికార్డుల సమగ్ర పక్షాళనతో 94 శాతం భూములకు సంబంధించి పాస్‌బుక్‌లను అందించినట్టు ఆయన తెలిపారు. కులవృత్తులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ, బెస్త, ముదిరాజుల కోసం చెరువుల్లో చేప విత్తనాన్ని ఉచితంగా పంపిణీ చేయడం, చేనేత కార్మికులకు నూలు రసాయనాలపై 50 శాతం సబ్సిడీ, నాయీ బ్రాహ్మణులు, రజకులు, గౌడ సోదరులు, విశ్వకర్మలకు తదితర కులాల వారికి వివిధ ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. చేనేత, పవర్‌లూం కార్మికుల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధికి ఎంబిసి కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు.



31 జిల్లాలకు తోడుగా మరో రెండు జిల్లాలు..

కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. కేజీ టు పీజీలో భాగంగా 524 గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. 31 జిల్లాలకు తోడుగా మరో రెండు జిల్లాలు నారాయణపేట, ములుగులను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిందన్నారు. దీంతో 3 వేల మంది గిరిజనులు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు. టిఎస్ ఐపాస్ సింగిల్‌విండో విధానం ద్వారా రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వచ్చాయని, లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఐటి రంగంలో తెలంగాణ బలమైన శక్తిగా ఎదిగిందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రసవ సమయంలో మాతా, శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందన్నారు. దేశంలో అత్యుత్తమ ప్రజావైద్యం అందుతున్న తొలి మూడు రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటని నీతి ఆయోగ్ 2018లో ఈ విషయాన్ని ప్రకటించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేడు 5,677 కిలోమీటర్ల జాతీయ రహదారులు సమకూరాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామాలకు కచ్చితంగా బిటి రోడ్డు ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాలుగు సంవత్సరాల్లో వృద్ధి రేటు 17.17 శాతం సాధించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నవంబర్ నాటికి 29.93 శాతం సాధించి దేశంలోనే ప్రథమంగా నిలిచిందన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

దేశంలో పేద, ధనిక అంతరం తగ్గాలి : పోచారం

మన తెలంగాణ / హైదరాబాద్ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేతిలో ఓటు చాలా బలమైన ఆయుధమని, వారు ఎంతగా ఓటు హక్కు వినియోగించుకుంటే ప్రజాస్వామ్యం అంత గొప్పగా వర్ధిల్లుతుందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ దేశంలో కుల, మత, ప్రాంత, పేద, ధనిక అనే భేదాలకు అతీతంగా జరుపుకునే పండుగ గణతంత్ర దినోత్సవమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిని ఇంకా మన దేశంలో పేద, ధనిక తారతమ్యం ఉందని, ఈ రెండు వర్గాల మధ్య అంతరం ఉందని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో పాటు పలువురు శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న మనకు దిశానిర్దేశం చేయడానికి రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, ఇది అత్యంత విలువైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మన రాజ్యాంగమే మూలమన్నారు. భిన్నత్వంలో ఏకత్వమనే విభిన్న సంప్రదాయం కలిగిన మన దేశంలో వివిధ వర్గాలవారు వారివారి విశ్వాసాలకు అనుగుణంగా భగవద్గీత, ఖురాన్, బైబిల్‌ను గౌరవిస్తున్నారని గుర్తుచేశారు. కానీ దేశంలోని అన్ని వర్గాల ప్రజలు గౌరవించేది మాత్రం దేశ రాజ్యాంగాన్నే అని వివరించారు. దేశం అభివృద్ధి పథంలో నడవడానికి అందరూ కృషి చేయాలని, ప్రకృతి, ఆర్థిక సంపదలకు మానవ వనరులు తోడయితే అద్భుతాలు చేయవచ్చని, పేదరికాన్ని తొలగించవచ్చనని అన్నారు. దేశంలో పేద, ధనికులు మధ్య అంతరాలు పెరుగుతున్నాయని, కేవలం 30 శాతం మంది దగ్గర మాత్రమే మొత్తం సంపద కేంద్రీకృతమై ఉన్నదని, ఈ వ్యత్యాసం తొలగిపోవాలని, అందరం సమిష్టిగా ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరుగుతున్నాయని, అన్నింటికి డబ్బే అవసరం కాదని, సంకల్ప బలం ఉండాలని అన్నారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌ను ఇటీవలే పరిశీలించానని, పనులు అద్భుతమైన రీతిలో వేగంగా జరుగుతున్నాయని, కేవలం ఆరు నెలలలోనే 3.78 కోట్ల ఘనపు మీటర్ల మట్టి పని జరిగిందని వివరించారు.







రాజ్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోం

● అతిథులకు ఆత్మీయంగా స్వాగతం పలికిన గవర్నర్ దంపతులు
● కెటిఆర్, కెసిఆర్‌తో పవన్‌కళ్యాణ్ చర్చలు
● రాజకీయ వర్గాల్లో ఆసక్తి
● ఉత్తమ్, రమణ, లక్ష్మణ్‌లతో సిఎం సరదా సంభాషణ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాజ్‌భవన్‌లో శనివారం సాయంత్రం జరిగిన 'ఎట్ హోం' కార్యక్రమంలో పవన్ కల్యాణ్‌తో ముఖ్యమంత్రి కెసిఆర్, టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేర్వేరుగా జరిపిన సంభాషణలు, చర్చలు అందరిలో ఆసక్తి పుట్టించాయి. పవన్ కల్యాణ్‌తో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించడం చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబునాయుడికి రిటన్ గిఫ్ట్ తప్పదంటూ కెసిఆర్ వ్యాఖ్యానించిన తర్వాత 'ఎట్ హోం' సందర్భంగా చాలా సేపు వీరిద్దరూ మాట్లాడుకోవడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా పవన్ కల్యాణ్‌తో మాట్లాడడంపై అక్కడ చాలా మందిలో గుసగుసలకు కారణమైంది. ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్‌లు మాట్లాడుతున్న సమయంలో రెండు సీట్ల అవతలే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ఉండడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రముఖులకు గవర్నర్ నరసింహన్ ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమానికి చాలా మంది ప్రముఖులు హాజరయ్యారు. గవర్నర్ దంపతులు వారందరినీ ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులతో ముఖ్యమంత్రి కెసిఆర్, టిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ వేర్వేరుగా మాట్లాడారు. వచ్చే నెలలో కెసిఆర్ అమరావతి పర్యటన, వైఎస్‌ఆర్‌సిపి కార్యాలయం గృహప్రవేశం తదితర అంశాలు ఈ సందర్భంగా వీరి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని సిఎం కెసిఆర్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టిటిడిపి అధ్యక్షుడు ఎల్.రమణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌లతో కెసిఆర్ సరదాగా సంభాషించారు. కెసిఆర్ తనకు ప్రొటెక్షన్ అంటూ మీడియాతో గవర్నర్ నరసింహన్ పేర్కొనడంతో అక్కడ నవ్వులు పూశాయి. ఈ కార్యక్రమంలో సిఎం కెసిఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్‌అలీ, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్, ఎంపి కేశవరావు, ఏపి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, తమిళనాడు మాజీ గవర్నర్ కె.రోశయ్య, సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఎంపి దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌తో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.





ప్రగతి భవన్‌లో జెండా వందనం





మన తెలంగాణ/ హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రగతి భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి పార్లమెంటు సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, శాసన మండలి సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శంభీపూర్ రాజు, శాసనసభ్యులు కెటిఆర్, బాల్క సుమన్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు భూపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, శ్రీధర్ దేశ్‌పాండే, టిఆర్‌ఎస్ రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరో కార్పొరేట్ దివాలా!

సంపాదకీయం

మరో కార్పొరేట్ దిగ్గజం కళ్లు తేలవేసింది. జి టివి సంస్థ వ్యవస్థాపకుడు, ఎస్సెల్ గ్రూపు చైర్మన్ సుభాష్ చంద్ర తన కాళ్ల కింద నేల కదిలిపోయిన సంగతిని తానే బయటపెట్టారు. తన కార్పొరేట్ వ్యాపార సంస్థలు కూలిపోయినట్టు షాకింగ్ సమాచారాన్ని స్వయంగా వెల్లడించారు. అప్పులిచ్చిన బ్యాంకులకు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు క్షమాపణ చెబుతూ లేఖ రాశారు. ఎస్సెల్ గ్రూపులోని ఎనిమిది కంపెనీల షేర్ల విలువ ఏకబిగిన రూ. 14,000 కోట్ల మేరకు ఆవిరికావడంతో ఈ దుస్థితి తల ఎత్తినట్లు స్పష్టపడుతున్నది. 2016 నాటి పెద్ద నోట్ల రద్దు అక్రమాలతో సంబంధమున్నట్లు వార్తలు రావడంతో ఎస్సెల్ వాటాల విలువ షేర్ మార్కెట్‌లో భారీ పతనాన్ని చవిచూసింది. ఒకరు చేసిన ద్రోహంవల్ల, ఆ వ్యక్తి రాసిన ఆకాశ రామన్న ఉత్తరాల కారణంగానూ స్వయంకృతాపరాధాల మూలంగానూ తన సంస్థలు ఈ దయనీయ స్థితికి చేరుకున్నాయని ఆయన చెప్పుకున్నారు. కంపెనీల డబ్బుతో తన కుటుంబ సభ్యులందరి ఆర్థిక భారాన్ని మోయడం కూడా ఇందుకు ఒక కారణమని ఆయన చెప్పిన దానిని బట్టి చూస్తే కార్పొరేట్ యాజమాన్యాలు ప్రజల సొమ్ముతో ఇష్టావిలాసంగా ఖర్చులు పెట్టడం, ఆడుకోడం జరుగుతున్నదని బోధపడుతున్నది. జి ఎంటర్‌టైన్‌మెంట్‌లోని సగ భాగాన్ని అమ్మివేసి అప్పులన్నీ తీరుస్తానని సుభాష్ చంద్ర హామీ ఇచ్చారు. ఎస్సెల్ కంపెనీల షేర్లు ఇంకా పడిపోతే ఈ సంస్థ అమ్మకపు విలువ కూడా దిగజారిపోయి అనుకున్నది అసాధ్యమయ్యే ప్రమాదం లేకపోలేదు.

దేశంలో కార్పొరేట్ సంస్థలు మునిగిపోయి బ్యాంకులను, ఇతర రుణదాతలను దారుణంగా దెబ్బ తీసిన ఉదంతాలు కొత్త కాదు. ఇటీవలి కాలంలో అవి తరచుగా సంభవిస్తున్నాయి. ఈ వరుసకు ఎప్పటికీ అడ్డుకట్టపడడం లేదు. అంతేకాదు బ్యాంకులకు టోపీ పెట్టి విదేశాలకు తరలిపోతున్న వారి సంఖ్య కూడా ఎన్‌డిఎ పాలనలో పెరుగుతున్నది. బ్యాంకులతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల డబ్బు కూడా మోసగాళ్లపరమైపోతున్నది. వివిధ బ్యాంకులకు రూ. 700 కోట్ల మేరకు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా ఉదంతం, నీరవ్ మోడీ బాగోతం తెలిసినవే. మరో దివాలా సంస్థ సహారా గ్రూపు చైర్మన్ సుబ్రతా రాయ్‌కి, విజయ్ మాల్యాకి ఆటల పిచ్చి అపారం. వీరు ఐపిఎల్ క్రికెట్ బృందాలకు, ఫార్ములా వన్ టీంకు విశేష ధనాన్ని వెచ్చించి షేర్ హోల్డర్లకు మొండి చేయి చూపించారు. సుబ్రతా రాయ్ సెబి నిబంధనలు కూడా ఉల్లంఘించి భారీగా నిధులు మళ్లించారని తేలడంతో స్వయంగా సుప్రీంకోర్టు రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది. సత్యం కంప్యూటర్స్ కుంభకోణంలో కంచే చేను మేసిన వైనం కళ్లకు కట్టింది. బెంగాల్‌లో శారదా చిట్‌ఫండ్స్ శ్కాం వంటివి ఎరుకే. ఇవికాక వెయ్యి రూపాయలు కడితే లక్ష ఇస్తామని, ఉద్యోగాలిప్పిస్తామని, వేరు సెనగ గానుగలిచ్చి ఉన్న పళంగా ఐశ్వర్యవంతులను చేస్తామని పేరాశ చూపి కోట్లాది రూపాయలతో ఉడాయిస్తున్న టోపీ రాయుళ్లు, టోకరాగాళ్లు వీధివీధినా అడుగడుగునా అనునిత్యం తేలుతున్నారు.

గత ఏడాది బయటపడిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్‌అండ్ ఎఫ్‌ఎస్) అనే, మౌలిక సదుపాయాల రంగానికి భారీ రుణాలిస్తూ వచ్చిన అతిపెద్ద ప్రైవేటు సంస్థ దివాలా దేశంలో పెరిగిపేట్రేగిపోతున్న కార్పొరేట్ స్వాహాకాండకు నిలువుటద్దం పట్టింది. ఢిల్లీ – నోయిడా టోల్ బ్రిడ్జి వంటి అనేక భారీ ప్రాజెక్టులకు పెట్టుబడి పెట్టిన ఈ సంస్థలో ఎల్ఐసి, ఎస్‌బిఐ సహా ప్రభుత్వ రంగ సంస్థల వాటా 40 శాతం మేరకు ఉన్నది. ఇది రూ. 91 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. దీని దివాలా ఇతర అనేక ప్రైవేటు పారిశ్రామిక, వ్యాపార సంస్థల మీద వ్యతిరేక ప్రభావం చూపింది. అమెరికాలో లేమన్ బ్రదర్స్, జనరల్ మోటార్స్ వంటి సంస్థలు యాజమాన్య లోపాల కారణంగా కుప్పకూలిపోయిన మాదిరిగానే మన దేశంలో ప్రైవేటు కార్పొరేట్‌లు బ్యాంకుల నిధులను కాజేసి బోర్డులు తిప్పేయడం పెరిగిపోయింది. ఇలా ప్రజాధనాన్ని ప్రైవేటు రంగం బలిపీఠం మీద అర్పించడం దేశానికి ఎంతమాత్రం శ్రేయోదాయకం కాదు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల ధనాన్ని స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెట్టడం, ఆయా కంపెనీల పునాది బలాలను సరిగా అంచనా వేయకుండా బ్యాంకుల ఉన్నతాధికారులు చేతికి ఎముకలేనంతగా రుణ వితరణకు తొందరపడడం మంచిది కాదు. జి టెలివిజన్, ఎస్సెల్ గ్రూపు దివాలా చివరకు ఎన్ని వేల కోట్ల రూపాయల వద్ద తేలుతుందో ముందుముందుగాని బయటపడదు. ముప్పును గమనించి బహిరంగ క్షమాపణ చెప్పడమే సుభాష్ చంద్ర తీసుకున్న తెలివైన ఆత్మరక్షణ చర్య.

డొల్లబారుతున్న న్యాయ వ్యవస్థ

కొత్త సంవత్సరం, ముఖ్యంగా జనవరి నెల న్యాయ వ్యవస్థకు కలిసి వస్తున్నట్టు లేదు. 2018 జనవరిలో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై ధ్వజమెత్తి తిరుగుబాటు చేసినంత పని చేశారు. ఆ నలుగురు న్యాయమూర్తుల్లో ఒకరు, ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ఈ జనవరిలో వివాదాల్లో చిక్కుకున్నారు. ఈ వివాదాలు ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బ తీయడంతో పాటు న్యాయ వ్యవస్థ గౌరవానికి కూడా భంగం కలిగించాయి.

> *కొలీజియం వ్యవస్థను సమర్థిస్తూ అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు చేసిన సమర్థనలను గొగోయ్ నాయకత్వంలోని కొలీజియం అపహాస్యం పాలు చేస్తోంది. నియామకాల్లో కొలీజియం వ్యవస్థే ఉత్తమమైనది, స్వతంత్రతను పరిరక్షించేదని సుప్రీంకోర్టు చెప్పింది. జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ చట్టం చెల్లదని 2015లో సుప్రీంకోర్టు ఆ రాజ్యాంగ సవరణను తోసిపుచ్చినప్పుడు మెజారిటీ న్యాయమూర్తులు కొలీజియం వ్యవస్థ స్వతంత్రతకు పూచీ పడుతుందని చెప్పారు. న్యాయమూర్తి మదన్ లోకూర్ రాసిన తీర్పు చదివితే కొలీజియం వ్యవస్థ మాత్రమే రాజ్యాంగ విహితమైందన్న అభిప్రాయం కలుగుతుంది.*



సి.బి.ఐ. డైరెక్టర్ ఆలోక్ వర్మను పదవి నుంచి తొలగించిన ఉన్నతాధికార కమిటీలో సభ్యుడిగా ఉన్న న్యాయమూర్తి ఎ.కె.సిక్రీ ప్రభుత్వంపట్ల పక్షపాత దృష్టితో వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉన్న త్రిసభ్య ఉన్నతాధికార సంఘం లో సిక్రీ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో ఇద్దరు సభ్యులు వర్మను తోలగించాలని భావిస్తే ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాత్రమే ఈ అభిప్రాయంతో విభేదించారు. కామన్వెల్త్ మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్ సెక్రటేరియట్ సభ్యుడిగా తనను నియమించాలన్న ప్రభుత్వ ప్రయత్నంతో సంబంధం లేకుండానే సిక్రీ త్రిసభ్య సంఘంలో మోదీ పక్షం వహించి ఉండవచ్చు. ఉన్నతాధికార సంఘాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినో ఆయన ప్రతినిధినో నియమించడం అంటే ఆ కమిటీలు తటస్థంగా, నిష్పక్షపాతంగా ఉండాలనే. తటస్థతకు, నిష్పాక్షికతకు భంగం కలిగే చిన్న అవకాశం వచ్చినా అది అనుమానాలకు తావిస్తుంది. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ వ్యవహార సరళి ఈ అనుమానాలను రేకెత్తించేట్టుగానే ఉంది. న్యాయవ్యవస్థ నిష్పాక్షికతకూ భంగం కలిగింది.

ఆ తర్వాత వెంటనే న్యాయమూర్తి రాజేంద్ర మీనన్‌ను, దీపక్ మహేశ్వరిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని తీసుకున్న నిర్ణయాన్ని తర్వాత గొగోయ్ నాయకత్వంలోని కొలీజియం తిరగదోడడంతో మరో వివాదం చెలరేగింది. న్యాయవ్యవస్థ ఘనతను కొనియాడే వారు కూడా ఈ చర్యతో అవాక్కై పోయారు. ఈ ఇద్దరు న్యాయమూర్తులకు బదులు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపక్ మహేశ్వరిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం నిర్ణయించింది. కాని మొదట ఎంపిక చేసిన వారిని ఒద్దని, తర్వాత ఇద్దరిని ఎంపిక చేయడానికి కారణం ఏమిటో కొలీజియం చెప్పనే లేదు. మొదట సిఫార్సు చేసిన వారి విషయాన్ని పునఃపరిశీలించవలసి వచ్చిందన్న మాట నమ్మశక్యంగా లేదు. అందువల్ల అనుమానాలకు అవకాశం కలిగింది. నెలరోజుల తేడాతో మనసు మార్చుకున్న కొలీజియం దానికి కారణం ఏమిటో చెప్పనందువల్ల ఊహాగానాలు చెలరేగాయి.

ఈ విషయంలో కొలీజియం వైఫల్యాలు బహిరంగమైనాయి. ఖన్నాకు, మహేశ్వరికి పదోన్నతి కల్పించడానికి అనుసరించిన ఒక్క నియమాన్ని కూడా వివరించలేదు. పైగా 'ప్రతిభ' అన్న కారణం మాత్రమే చూపారు. అయితే మీనన్ ను, నంద్ రాజోగ్ ను ఎందుకు తిరస్కరించారో మాత్రం చెప్పలేదు. వీరద్దరినీ సిఫార్సు చేస్తూ మొదట ఆమోదించిన తీర్మానాన్ని సుప్రీంకోర్టు వెబ్ సైట్లో ఉంచలేదు. పునఃపరిశీలించడానికి కారణం ఏమిటో ఎక్కడా విడమర్చలేదు. ఈ అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరు, కొందరు మాజీ న్యాయమూర్తులు, భారత న్యాయవాదుల సంఘం, పౌరులు ఆదోళన వ్యక్తం చేసినా సుప్రీంకోర్టు నుంచి కానీ ప్రధాన న్యాయమూర్తినుంచి గానీ చిన్న వివరణ అయినా రాలేదు. మొత్తం ప్రక్రియవల్ల రుజువైంది ఏమిటంటే ఏకపక్షంగా, దాపరికంతో, బాధ్యతా రహితంగా మాత్రం వ్యవహరించినట్టు అర్థం అయింది. గత ఏడాది జనవరి 12న రంజన్ గొగోయ్ తో సహా నలుగురు న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అభ్యంతరం వ్యక్తం చేసింది ఈ అంశాల గురించే. ఆ సందర్భం భిన్నమైంది కావచ్చు.

2019 జనవరిలో ఖన్నా, మహేశ్వరి నియామకంపై మాత్రమే వివాదం చెలరేగ లేదు. ఆ తర్వాత వారం రోజులకే వివిధ హైకోర్టులకు న్యాయమూర్తులను నియమిస్తూ కొలీజియం తీసుకున్న నిర్ణయం కూడా దుమారం రేపింది. కొలీజియం స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న అనుమానాలు కలిగాయి. ఈ నియామకాలలో చాలా వాటిని పునఃపరిశీలించాలని కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ కొలీజియం ను కోరింది. కొందరి నియామకం విషయంలో ఒక సారి కన్నా ఎక్కువ సార్లు ఇదే మాట కోరింది. న్యాయమూర్తుల నియామక ప్రక్రియకు కట్టుబడి తాము ఎంపిక చేసిన న్యాయమూర్తులనే నియమించాలని, లేదా వారిని ఎంపిక చేయడానికి కారణాలు ఏమిటో; లేదా ఎందుకు పునఃపరిశీలించవలసి వచ్చిందో, కొలీజియం సిఫార్సు చేసిన 11 పేర్లలో పది మంది నియామకాన్ని కేంద్రం ఎందుకు అభ్యంతర పెట్టిందో, కొలీజియం ఆ అభ్యంతరాలకు ఎందుకు తలొగ్గిందో వివరించనే లేదు.

కొలీజియం వ్యవస్థను సమర్థిస్తూ అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు చేసిన సమర్థనలను గొగోయ్ నాయకత్వంలోని కొలీజియం అపహాస్యం పాలు చేస్తోంది. నియామకాల్లో కొలీజియం వ్యవస్థే ఉత్తమమైనది, స్వతంత్రతను పరిరక్షించేదని సుప్రీంకోర్టు చెప్పింది. జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ చట్టం చెల్లదని 2015లో సుప్రీంకోర్టు ఆ రాజ్యాంగ సవరణను తోసిపుచ్చినప్పుడు మెజారిటీ న్యాయమూర్తులు కొలీజియం వ్యవస్థ స్వతంత్రతకు పూచీ పడుతుందని చెప్పారు. న్యాయమూర్తి మదన్ లోకూర్ రాసిన తీర్పు చదివితే కొలీజియం వ్యవస్థ మాత్రమే రాజ్యాంగ విహితమైందన్న అభిప్రాయం కలుగుతుంది. చేయదలచుకున్న మార్పులన్నీ చిన్నవని అనిపిస్తుంది. గత రెండేళ్ల కాలంలో న్యాయమూర్తుల నియామకంలో, బదిలీల్లో జరిగిన అవకతవకల్లో ఇంకా నాశనం చేయవలసింది ఏమన్నా ఉంటే గొగోయ్ నాయకత్వంలోని బృందం కొలీజియం వ్యవస్థను సమర్థించడానికి ఏ అవకాశమూ లేకుండా చేసింది.

ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నందువల్ల, ప్రభుత్వ ఒత్తిడివల్ల న్యాయవ్యవస్థలోని లోపాలు బహిర్గతం అవుతున్నాయి. ఈ అభిప్రాయం ఏదో ఒక వ్యక్తిది కాదు, లేదా కొన్ని తప్పుడు తీర్పులవల్ల ఏర్పడిందీ కాదు. ఇది వ్యవస్థలో ఉన్న లొసుగులను అంగీకరించడానికి నిరాకరించినందువల్ల ఏర్పడిన పరిస్థితి. ఈ లోపాల గురించి తెలిసిన, వాటిని సరిదిద్దుతానని చెప్పిన వ్యక్తి ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండి దానికి విరుద్ధంగా ప్రవర్తించడం అదనంగా నిరాశ కలిగించే అంశం.

** (ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)*

పార్టీల గుట్టు, విరాళాల కనికట్టు



పి.వెంకటేశం
9985725591

రాజకీయ పార్టీలకు విరాళాల ద్వారా వచ్చిన ఆదాయమే ప్రధాన ఆర్థిక వనరు అన్న సంగతి సాధారణంగా తెలిసిందే. 20 వేల రూపాయల కంటే తక్కువ మొత్తం విరాళంగా వస్తే ఆ మొత్తాన్ని అజ్ఞాత వ్యక్తుల ఖాతాలో చేరుస్తారు. ఈ విధంగా విరాళం ఇచ్చే దాత పేరు బయటపెట్టవలసిన అవసరం లేదు. ఈ అవకాశమే పార్టీల కోశాగారాన్ని దండిగా నింపుకోడానికి దోహదపడుతోంది. స్వచ్ఛంద విరాళాలు, సమావేశాలకు విరాళాలు, సహాయనిధి, కూపన్ల అమ్మకాలు ఇటువంటివి అన్నీ అజ్ఞాత విరాళాల ఖాతాలోకే వస్తాయి. ఇపుడు జాతీయ పార్టీలు 'అజ్ఞాత' విరాళాల కోశాగారాలతో ఖుషీగా ఉన్నాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్ (ఎడిఆర్) పార్టీల విరాళాలపై అందించిన విశ్లేషణను పరిశీలిస్తే ఒక్క ఏడాది కాలంలోనే విరాళాల స్థాయి బాగా పెరిగినట్టు స్పష్టమవుతోంది.

ఆయా దాతలు ఎవరో బయట పడకుండా గుట్టుగా ఉంచడంలో పరమార్థం లొసుగులకు ముసుగులు వేయడం తప్ప ఇంకేమీ కాదు. ఏ పార్టీ తీరు అయినా ఒకే తాను ముక్కలే అన్న లోకధర్మం సజావుగా సజీవంగా సాగుతోంది. విరాళాల పారదర్శకత కోసం ఎన్నో నిబంధనలతో చట్టం ఉన్నా ఆ నిబంధనలకు నీళ్లు వదిలారు. తమ అవసరాల మేరకు మార్పులు చేశారు. విరాళాల గుట్టు అంతా కనికట్టు. దండిగా విరాళాలు పరోక్షంగా ముట్టచెప్పే ప్రబుద్ధులకు దొడ్డి దారిన మేలు చేయకుండా ఉంటారా ఉండరా అన్న సందేహానికి తావు లేదు. ప్రజాస్వామ్య విలువలు అన్న పలుకుల్లో డొల్లతనం ఆయా పార్టీలకే తెలియాలి.

తాజాగా 'ఎడిఆర్' బయటపెట్టిన విశ్లేషణను పరిశీలిస్తే 2015–16 ఆర్థిక సంవత్సరంలో 7 జాతీయ పార్టీలకు కలిపి 1033.18 కోట్ల రూపాయల ఆదాయం రాగా ఇప్పుడు అంటే 2017–18 లో బిజెపి, కాంగ్రెస్, బిఎస్‌పి, టిఎంసి, ఎన్‌సిపిల మొత్తం ఆదాయమే రూ. 1293.05 కోట్ల వరకు చేరడం గమనించవలసి ఉంది. కాంగ్రెస్, బిజెపిలకు 2015–16 లో వచ్చిన విరాళాల ఆదాయంలో 77 శాతం అజ్ఞాత దాతల నుంచి వచ్చినదేనని ఆనాడు తేటతెల్లం అయింది. ఇపుడు బిజెపి, కాంగ్రెస్, బిఎస్‌పి, టిఎంసి, ఎన్‌సిపిలకు అజ్ఞాత నిధులు మొత్తం 689.44కోట్లు అని తేలింది. ఈ మొత్తంలో బిజెపికి అజ్ఞాత వర్గాల ద్వారా రూ. 553.38 కోట్లు ఆదాయం వచ్చినట్టు విశ్లేషణ పేర్కొంది. ఇది జాతీయ పార్టీల అజ్ఞాత నిధుల మొత్తంలో 80 శాతం. ఆ 689.44 కోట్ల రూపాయల్లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందింది రూ. 2015 కోట్లు. తెలిసిన దాతల నుంచి రూ. 467.13 కోట్లు అందాయి. ఆరు జాతీయ పార్టీలకు అందిన రూ. 689.44 కోట్ల ఆదాయంలో బిజెపి భాగమే రూ. 553.38 కోట్లు అంటే 80 శాతం వరకు ఉండడం ఆలోచించవలసిందే.

2015–16 ఆర్థిక సంవత్సరంలో 7 జాతీయ పార్టీలకు మొత్తం వచ్చిన రూ. 1033.18 కోట్ల ఆదాయంలో రూ. 754.45 కోట్లు ఖర్చయిందని, 278.73 కోట్లు (26.98 శాతం) ఖర్చు కాలేదని పార్టీలు తెలిపాయి.

> *ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29 సి కింద 20 వేల రూపాయలకు మించి విరాళాలు అందించే వారి పేర్లను తప్పకుండా ప్రకటించవలసి ఉంటుంది. అయితే దాతల వివరాలు నమోదు చేయవలసిన అవసరం లేకుండా పార్టీలు నగదు రూపంలో స్వీకరించగల మొత్తాన్ని రూ. 20 వేలు నుంచి రూ. 2 వేలకు పరిమితం చేశారు. అంతేకాదు, ఆర్‌బిఐ చట్టానికి అదనపు సవరణ చేసి ఎలెక్టోరల్ బాండ్ల విధానాన్ని అమలులోకి తెచ్చారు. గత ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఎలెక్టోరల్ బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఎలెక్టోరల్ బాండ్ల ద్వారానే వచ్చిన 31 శాతం ఆదాయం రూ. 215 కోట్లలో బిజెపి భాగమే 97.67 శాతం కావడం గమనించదగింది.*

చట్టం ఉన్నా ఏం ప్రయోజనం?

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29 సి కింద 20 వేల రూపాయలకు మించి విరాళాలు అందించే వారి పేర్లను తప్పకుండా ప్రకటించవలసి ఉంటుంది. అయితే దాతల వివరాలు నమోదు చేయవలసిన అవసరం లేకుండా పార్టీలు నగదు రూపంలో స్వీకరించగల మొత్తాన్ని రూ. 20 వేలు నుంచి రూ. 2 వేలకు పరిమితం చేశారు. అంతేకాదు, ఆర్‌బిఐ చట్టానికి అదనపు సవరణ చేసి ఎలెక్టోరల్ బాండ్ల విధానాన్ని అమలులోకి తెచ్చారు. గత ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఎలెక్టోరల్ బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఎలెక్టోరల్ బాండ్ల ద్వారానే వచ్చిన 31 శాతం ఆదాయం రూ. 215 కోట్లలో బిజెపి భాగమే 97.67 శాతం కావడం గమనించదగింది.

కాంగ్రెస్‌కు రూ. 5 కోట్లు దక్కాయి. రూ. 20 వేల కంటే తక్కువ వచ్చిన విరాళాల ద్వారా పార్టీలకు రూ. 354.22 నిధులు పోగు పడ్డాయి. ఈ ఎలెక్టోరల్ బాండ్ల వల్ల బ్యాంకుల ద్వారా స్వచ్ఛమైన నగదు మొత్తాలే అందుతాయని నల్లడబ్బు వ్యవహారాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం గత ఏడాది గొప్పలు చెప్పుకొంది. కానీ 2 వేల రూపాయలు, ఆపై మొత్తాల్లో సేకరించే గుప్త విరాళాలపై వేటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రెండేళ్ల క్రితమే ప్రతిపాదించినా మోడీ ప్రభుత్వం కిమ్మన లేదు. అభ్యర్థి తరపున పార్టీ భరించిన ఖర్చును కూడా అభ్యర్థి ఎన్నికల వ్యయంలో కలపాల్సిందేనని గతంలో సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టం చేసినా మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కార్పొరేట్ సంస్థలు తమ మూడేళ్ల నికర లాభంలో 7.5 శాతం వరకు రాజకీయ విరాళాలు అందించగల వీలున్నా చట్టాన్ని సవరించి ఆ పరిమితి తొలగించారు.

తాము ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చిందీ ఆర్థిక సంవత్సరంలో స్పష్టం చేయాలన్న నిబంధనలను సవరించారు. అసలు పార్టీ పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేకుండా చేశారు. ఒక వ్యక్తి నుంచి లేదా సంస్థ నుంచి రూ. 20 వేలలోపు విరాళాన్ని పార్టీలు తీసుకున్నప్పుడు ఆ మొత్తాలకు సంబంధించిన పాత 500, 1000 నోట్లకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రకటించడం విరాళాల దాతలకు, పార్టీలకు కొంత వెసులుబాటు కల్పించినట్టయింది. ఇదే సమయంలో ఎన్నికల పోటీలో సీట్లను పొందే పార్టీలకు మాత్రమే ఆదాయం పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది. ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 13 ఎ ప్రకారం రాజకీయ పార్టీలకు వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయానికి మాత్రమే పన్ను నుంచి మినహాయింపు లభిస్తుంది. దీన్ని సాకుగా తీసుకుని పుట్టగొడుగు పార్టీలు పుట్టుకొస్తున్నాయని ఎన్నికల కమిషన్ కొన్ని దాఖలాలు చూపించి వాదిస్తోంది. ఎవరైనా భారీగా పార్టీలకు విరాళాలు సమకూర్చితే ఆ పార్టీలు అధికారంలోకి వస్తే విరాళాలు అందించే వారి ప్రభావం ఆయా ప్రభుత్వాలపై పని చేస్తుందని తమకు అనుకూలంగా చట్టాలను మార్పించుకోడానికి ప్రయత్నిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆనాడు అంబేద్కర్ ఈ విరాళాల ప్రభావానికి దూరంగా ఉండాలన్న అభిప్రాయం వెలిబుచ్చారు. దాతలయిన సంపన్న వర్గాలు అధికార పార్టీలపై ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ నేపథ్యంలో రూ. 2 వేలకు మించి విరాళాలు అందించే వ్యక్తుల వివరాలు తెలియాలని నిర్దేశిస్తున్నప్పుడు కోట్ల కొద్దీ నిధులు అందించే కార్పొరేట్ల వివరాలు ఎందుకు గుట్టుగా ఉంచవలసి వస్తుందో అర్థం కావడం లేదు. 2004–2005 నుంచి పదకొండేళ్ల కాలంలో జాతీయ, ప్రాంతీయ పార్టీల మొత్తం రాబడి 11,367 కోట్ల రూపాయలుగా తేలింది. దాతల్లో 69 శాతం గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి ఈ మొత్తాలు అందాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ విరాళాల పరిమితి పదో వంతుకు కుదించినా, చిన్న మొత్తాల వరకే అందుతున్నా, దీని వెనుక భారీ ఎత్తున లావాదేవీల తతంగం నడుస్తోంది. పార్టీలకు చేరే ప్రతి రూపాయి ఎలా ఎక్కడ నుంచి వచ్చిందో కచ్చితంగా నమోదయ్యేలా పారదర్శకంగా ఉండేలా ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్ దేశాల్లో చట్టబద్ధ ప్రక్రియ సాగుతున్నప్పుడు మనం ఎందుకు ఆ విధంగా కచ్చితంగా వ్యవహరించలేకపోతున్నాం.

కోచింగ్ సెంటర్ల దోపిడీ!



రావుల రాజేశం
7780185674

మీ అబ్బాయిని, అమ్మాయిని డాక్టర్ చేయాలా! ఇంజనీర్ చేయాలా! మమ్మల్ని కలవండి. మేమే తయారు చేస్తాం అంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యావ్యాపారులు, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు చెవులు అదిరిపోయే విధంగా పబ్లిసిటీ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పది వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారం అక్రమంగా నిరాటంకంగా సాగుతున్నది. డాక్టర్, ఇంజనీరు, చార్టెర్డ్ అకౌంటెంట్ కావాలని సర్కారు కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఎంతో శ్రద్ధ, పట్టుదల ఉన్నా సర్కారు లెక్చరర్లు ప్రైవేట్ కాలేజీలకు దీటుగా చదువు చెప్పే స్థాయిని మరిచి పోయారు. తెలుగు రాష్ట్రాల్లో నెలకు 60 వేల మంది రూ. లక్షన్నరదాక నెలసరి జీతం పొందుతున్న ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు తమ కాలేజీ పిల్లల్ని ఎంసెట్, నీట్, మెడికల్, అగ్రికల్చర్, ఫార్మసీ కోచింగ్ ఇచ్చి సీట్లు సాధించటంలో ఎందుకు విఫలం చెందుతున్నారు?

సర్కారు జూనియర్ కాలేజీలో ఇంటర్ పాసు కావటం గగనం. ప్రథమ శ్రేణిలో పాసుకావటం 'గొప్పవిషయం'. కొందరు సర్కారు జూనియర్ లెక్చరర్లు ''లాంగ్‌లీవ్'' పెట్టి ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీల్లో 'విద్యను' అమ్ముకుంటున్నారు. సర్కారు కాలేజీలు అన్నా, సర్కారు లెక్చరర్లు అన్నా విశ్వాసం లేదు. నమ్మకం లేదు. పూటకు లేని పేరెంట్స్ కూడ సర్కారు జూనియర్ కాలేజీల్లో చదివించటానికి ముందుకు రావటం లేదంటే లోపాలు ఎక్కడ ఉన్నాయో ఇంటర్ అధికారులు, విద్యావేత్తలు శోధించాలి. కోట్లకు పడగలెత్తిన కార్పొరేట్ విద్యాసంస్థలు, ధనార్జనే ధ్యేయంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. మెడికల్, ఇంజనీరింగ్ విద్యా వ్యాపారం 3 కోచింగ్ సెంటర్లు 6 కోట్ల వ్యాపారం వలే తయారైంది. సీటు రిజర్వేషన్ కోసం రూ. 5 వేల నుండి 20 వేల వరకు తీసుకుంటున్నారు. తెల్లకాగితాన్ని అడ్మిషన్ ఫారంగా భావించి రూ. 5 వందలు వసూలు చేస్తున్నారు. 2 వందలకు దొరికే ఇంటర్ మెటీరియల్ కోసం రూ. 3 వేల నుండి 5 వేల దాకా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి రకరకాల పేర్లు పెట్టి ప్యాకేజీలు పెట్టి ఏటా లక్షన్నర నుంచి రెండున్నర లక్షలు 'జబర్దస్త్' గా వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ సమయంలో చెప్పిన మాటలు అడ్మిషన్ పొందిన 2 నెలల తర్వాత యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. ఒక్కొక్క కార్పొరేట్ కాలేజీ ఇంటర్ బోర్డు నుంచి ఇంటర్ సెక్షన్ల కోసం ఎలాంటి అనుమతులు పొందటం లేదు. ఒక్కొక్క కార్పొరేట్ కాలేజీ హైదరాబాద్‌లో 5 నుండి 25 దాకా బ్రాంచీలను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా, పుట్ట గొడుగులవలే స్థాపిస్తున్నాయి. లక్షలు ఆర్జించేవారు విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు కొత్తకొత్త పేర్లతో 'కత్తెర' పెడుతున్నారు. 'దోభీ' పేరిట రూ. 3 వేలు దాక నొక్కేస్తున్నారు. యూనిఫారం ధర మార్కెట్లో ఐదు వందలు దాటక పోయినా తమ కాలేజీలో తయారు చేసిన యూనిఫారమే కొనాలని ఒక్కొక్క దానికి రూ. 2 వేల దాక వసూలు చేస్తున్నారు. 20 ఏళ్ల అనుభవజ్ఞులతో పాఠాలు చెప్పిస్తామని, వందలోపు మెడికల్, ఇంజనీర్ సీట్లు పొందేటట్లు కోచింగ్ ఇప్పిస్తామని ఆశల పల్లకిలో ఊరేగిస్తారు. కాని ఫీజు తీసుకుంటున్నప్పుడు ఉన్న 'మాటల గారడి' బోధనలో ఉండదు. ఇంటర్ సిలబస్‌కు సమాంతరంగా JEE, NEET, AIMS, JIPMER, CPT వంటి కోర్సులకు అడ్వాన్సుడు టెక్నాలజీతో కోచింగ్ ఇప్పిస్తామని ముందు ప్రగల్భాలు పలుకుతారు. ఆ తర్వాత యాజమాన్యం పట్టించుకోదు. అనుభవజ్ఞులైన లెక్చరర్లు అనే పేరు చెప్పి, కొత్తవారితో తక్కువ వేతనానికి పనిచేసే వారితో పాఠాలు చెప్పిస్తారు. ఎసి క్యాంపస్ పేరు చెప్పి రూ. 50 వేలు ఎక్కువ వసూలు చేస్తారు. కాని ఎసి క్లాసులు జరుగవు. పేరెంట్స్ అడుగుదామంటే ఏవోకుంటి సాకులు చెబుతారు.



క్లాసులు, ల్యాబులు డైనింగ్ హాలు, పెద్ద భవనాల్లో ఉంటాయి. ర్యాంకులు రావాలి 'బట్టిపట్టండి' అని పిల్లలను 'ఒత్తిడికి' గురి చేస్తారు. ఆటపాటలు ఉండవు. యోగా, ధ్యానం, ఫిజికల్ ఎక్సర్‌సైజ్, పేపర్ రీడింగ్ కనబడదు. క్లాసులు లేకపోతే స్టడీ అవర్సు తప్ప వేరే ఎక్స్‌ట్రా కర్రికులర్ ఆక్టివిటీస్ ఉండవు. హాస్టల్ గదుల్లో పశువుల మంద వలే ఇరుకుగా బెడ్స్, బల్లలు వేస్తారు. బాగా డబ్బులు కట్టినా ఇరుకైన బల్లలే గతి. మొదట్లో గదికి 5 గురినే వేస్తాం అంటారు. కొద్దికాలం గడిచాక, డబ్బులు ముట్టాక గదికి కిక్కిరిసి పోయేటంత మంది విద్యార్థులను అలాట్ చేస్తారు. హాస్టల్ విజిట్‌కి మొదట్లో పోయినపుడు చక్కని రుచికరమైన భోజనం ఏర్పాటు చేస్తారు. నెల రోజులు గడిచాక, రుచి లేని తినటానికి ఇష్టపడని భోజనం వడ్డిస్తారు. పేరెంట్స్ మీటింగ్స్ ఉండవు. డబ్బులు ముడితే విద్యార్థుల పేరెంట్స్‌తో పని ఉండదు. అకాడమిక్ సౌకర్యాలు ఉండవు.

నాణ్యమైన బోధన ఉండవు. ల్యాబులు, లైబ్రరీలు పెద్దగా ఉండవు. అయినా జిల్లా కేంద్రాల నుండి మొదలుకొని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల్లో విద్యా వ్యాపారం కోట్లలో సాగుతుంది. ఇంటర్ అడ్మిషన్లు 'ఆన్‌లైన్'లో చేస్తే మంచిది. తెలుగు రాష్ట్రాల్లో 80% అడ్మిషన్లు ప్రైవేట్ కాలేజీల్లో ఉంటున్నాయి. హైస్కూల్‌లో ఫీజుల నియంత్రణ కమిటీ వేసినట్లే ఇంటర్, ఎంసెట్, నీట్ కోచింగ్ సెంటర్ల మీద ప్రభుత్వాలే ఫీజు నియంత్రణ చేయాలి. మోసం దోపిడీ చేస్తున్న కార్పొరేట్ సంస్థల మీద జూన్ నెలలో తనిఖీలు చేయాలి.

బీరప్ప కథను కళాకారులు తమ తమ కట్టడి గ్రామాల్లో బీరప్ప గుడి దగ్గర ప్రదర్శిస్తారు. ఈ కళాకారులకు కట్టడి గ్రామాలు రాగి శాసనం మీద రాసి ఉంటాయి. వీరి దగ్గర ఉండే రాగి శాసనం మీద లిపిని బట్టి చూస్తే అవి చాలా పురాతనమైనవిగా కనిపిస్తాయి. వీటి మీద బీరప్ప పండుగ చేసినందుకు కురుమలు ఇచ్చే దానాలు, వారి వారి కట్టడి గ్రామాల పేర్లు ఉంటాయి. ఈ శాసనాన్ని ఆధారం చేసుకొని కళాకారులు గ్రామాలకు వెళ్తారు. బీరప్ప పండుగ చేసే సందర్భంలో కళాకారులు పగలు అనుష్ఠానాలు జరిపిస్తూ రాత్రి సమయంలో కథను చెబుతారు. కథ చెప్పేటప్పుడు కళాకారులు ఏడుగురు ఉంటారు. ఇందులో ఒకరు ప్రధాన కథకుడు, ఇద్దరు వంతలు ఉంటారు. మిగతావారు డోలు, తాళాలు ,నపేరా వాయిస్తూ, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కథ చెప్తారు. కథలోని స్త్రీ పాత్రలను మగవారే ధరించి ప్రదర్శిస్తారు. వీరు చెప్పే కథలో తెలంగాణ యాస నుడికారం జాతీయాలు పొడుపు కథలు సామెతలు అనేకం ప్రయోగిస్తూ, హాస్యం, భయానకం, యుద్ధం, కరుణ వంటి సన్నివేశాలను రసాత్మకంగా పదర్శిస్తారు.

కురుమ బీరన్నల కళావైభవం



బీరప్ప పండుగ విధానం

వీరభద్రుని ప్రతిరూపమైన బీరప్ప దేవునికి కురుమలు వీలునుబట్టి ఐదు సంవత్సరాలకు ఒకసారి బీరన్న లను పిలిచి ఏడు రోజులు సామూహికంగా పండుగ జరిపిస్తారు. మొదట బీరన్నల దగ్గరికి కురుమ పెద్దలు వెళ్లి పండుగ కట్టు మాట్లాడుకొని ముహూర్తం నిర్ణయించుకుంటారు. ముహూర్త నిర్ణయం తర్వాత గ్రా మంలోని కురుమలు ఇంటిని శుద్ధి చేసుకుని పండుగకు సిద్ధమవుతారు.



తెలంగాణలో ఆశ్రిత కళారూపాలు విభిన్న మైన సంస్కృతిని కలిగి, సాంస్కృతిక వైవిధ్యానికి, గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ కళాకారులు భిక్షుక గాయకులు, వృత్తి గాయకులు, సంప్రదాయ కళాకారులు, గురువులు, పూజారులుగా పిలువబడుతున్నప్పటికీ, వీరికి ఏ కులమైతే వంశపారంపర్యంగా దాత కులం లేదా పోషక కులం సంక్రమించిందో,ఆ కులం మూల సంస్కృతిని పరిరక్షిస్తూ దానిని భవిష్యత్ తరాలకు అందించే వాహకులుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని కళారూపాలు ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోగా మరికొన్ని కొనఊపిరితో మనుగడ సాగిస్తున్నాయి. ఒకప్పుడు కళలు గ్రామా ల ప్రజలకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందిస్తూ గౌరవమైన స్థా నాన్ని నిలుపుకున్నాయి. కానీ నేటి కాలంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొని ఉంది. దీనికి అనేక అంశాలు కారణాలుగా ఉన్నాయి. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఇవి తమ సాం స్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాయి. అటువంటి కళారూపాల్లో బీరన్నలు ఒకరు. వీరు కురుమలలో ఒకరైనప్పటికీ, కురుమల దేవుడైన బీరప్ప ను కొలుస్తూ,గురువు లు గా పూజారులుగా వ్యవహరిస్తారు. వీరికే బీరన్నలు, బీరప్పలు, బీర్లోళ్లు అనే పేర్లున్నాయి. బ్రహ్మదేవుడు కుంటి అవతారమెత్తి ఒక కుండను తీసుకొని గంగ ఒడ్డుకు ఒక చెట్టు కింద నిలుస్తాడు. అతన్ని చూసిన నారదుడు ఎవరు నీవు అని ప్రశ్నించగా నేను అనాథనని, ఆయుషు కూడా అంతంతమాత్రమే అని చెప్తాడు. ఆ మాటలు విన్న నారదుడు, ఇతనే నా చెల్లి కి సరైన భర్త అని అతనికిసూరమ్మ తల్లి కి పెళ్లి చేస్తాడు. ఆ తర్వాత దంపతులిద్దరి తో నారదుడు పెళ్లి తరువాత తిరుపతి కి మొక్కు చెల్లించాలని చెప్పి అందరూ కలిసి బయలుదేరుతారు. దారి మధ్యలో రాత్రి కాగానే ఈ రాత్రి ఇక్కడ నిద్ర చేసి ఉదయం వెళ్దామని చెప్పి, మధ్యరాత్రి నారదుడు లేచి వారి మధ్యన ఒకతుంటను పెట్టి అక్కడి నుండి తిరిగి పట్నం బయలుదేరుతాడు. ఉదయం సూరమ్మ తల్లి ఏదో జంతువు తన అన్నను తిన్నదని రోదిస్తూ దేవతలను వేడుకుంటుంది. అప్పటికే బ్రహ్మదేవుడు అక్కడి నుండి వెళ్ళిపోతాడు. దేవతలు సూరమ్మ తల్లి పవిత్రురాలని ఆమె పేరుమీద శంకు నాయని పట్నం పొందించి,ఆమెకు దేవతలంతా కలిసి ఈ నారదుని గర్వమనుచాలంటే వీరభద్రుడే సరైన వాడని, బీరప్ప అవతారంగా సూరమ్మతల్లి గర్భంలో జన్మించాలని కోరుకొంటారు. ఇదే సమయంలో సూరమ్మ తల్లి కూడా తనకు సంతానం కావాలని కుంపటి గోళం తీసుకొని దేవలోకం మీద పోయడానికి బయలుదేరుతుంది. ఈ విషయం గమనించిన శివుడు మారువేషంలో ఎదురై ఆమెకు సంతానాన్ని ప్రసాదిస్తాడు. ఆమె గర్భం దాల్చిందని తన చెల్లెళ్ల ద్వారా తెలుసుకున్న నారదుడు గర్భంలోనే ఆ శిశువును చంపాలనుకుంటాడు. గర్భంలో ఉన్న బీరప్ప నారదుని దుష్ట బుద్ధిని కనిపెట్టి అతన్ని ఇంట్లోకి రానీయకుండా నే పంపించివేస్తాడు.

నారదుడి పన్నాగం పండగ పోయేసరికి తిరిగి వెళ్ళిపోతాడు. సూరమ్మ తల్లి తొమ్మిది నెలల తర్వాత బీరన్న కు జన్మనిస్తుంది. ఎలాగైనా బీరప్పను చంపాలని సంకల్పించిన నారదుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి బీరప్ప మేనమామ గండాన పుట్టాడని, మాయమాటలు చెప్పి నారదుని పట్నం పంపించాలని ఆదేశిస్తాడు. అప్పటికే నారదుడు ఏడుగురు కటిక వారిని బీరప్పను దారిలోనే చంపమని పంపిస్తాడు. పల్లకిలో తీసుకెళుతున్న బీరప్ప ఈ విషయం గమనించి జనపాల గుండు వరకు రాగానే ఆ గుండు మీద నిజరూపం దాల్చి తనను చంపడానికి వచ్చిన వారిలో ఐదుగురుని చంపుతాడు. ఇద్దరు మాత్రం తమను చంపవద్దని వేడుకోగా వారిని కూడా వదలక సంహరించి ,రానున్నది కలియుగమని, తనకు కురుమలు నాగుళ్ళు కట్టి పండుగ చేసేదుందని, ఆ గుడి ముందర మీరిద్దరూ తగురాళ్లై నిలువాలని దీవిస్తాడు.

ఇదే సమయంలో అక్క మహంకాళి చెల్లె చంద్రావతి మంద కాచుకుంటూ గంగ ఒడ్డుకు రాగా బీరప్ప మర్రిచెట్టు మీద ఏడుస్తూ కనిపిస్తాడు. మహంకాళి బీరన్నను చూసి నిన్ను నా కన్నబిడ్డలాగా చూసుకుంటానని కొంగు చాపగా అందులో కటారి జగ్గు వేసి దూకుతాడు. అప్పుడు మహంకాళి తన తమ్ముడే బీరప్ప అని సాదుతుంది. అతను పెద్దయ్యాక ఒక రోజున అక్క మహంకాళితో మంద మేపడానికి వస్తానంటాడు. కానీ అక్క నువ్వు రాజ్యమేలాలి గాని మందలు కాయకూడదంటూ వారిస్తుంది. అయినప్పటికీ వినకపోయేసరికి సరే అంటుంది. అతను రోజూ మందను కాస్తుంటే ఒక్కసారిగా ఏడేళ్ల ఎద్దడి వస్తుంది. ఈ మంద మేపడానికి నాగుల కొండ పట్నంలో మేత బాగుందని తెలుసుకొని, అక్కడికి మంద మేపడానికి వెళ్తానని అక్క దగ్గర సెలవు తీసుకుంటాడు. అక్కడ నారదుడు తన అల్లుడే బీరప్ప అని గుర్తిస్తాడు. ఒకరోజున బీరప్ప మంద దగ్గర దానం చేస్తుంటే త్రిమూర్తులు బీరన్న పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో మారు వేషంలో వచ్చి,పెళ్లి కాని వారు దానం చేస్తే తీసుకున్న వారికి ఇచ్చిన వాడికి మంచిది కాదని తెలిపి, అతనికి పెళ్లి చేసుకోవాలనే కోరికను కలిగిస్తారు. అతను అక్క దగ్గరికి వెళ్లి విషయం చెప్పి తనకు మేన మరదలు ఉంటే చెప్పమంటాడు. అప్పుడు అక్క నీ మేనమామ దుర్మార్గుడని వాడితో గెలవలేమని చెబుతుంది. అయినప్పటికీ అతను వినకపోయేసరికి కొన్ని పందాలను పెట్టగా, అతను వాటిని కూడా నెగ్గుతాడు. అప్పుడు ఆమె బీ రప్పను పసుపు బట్టలతో తిరిగి రావాలని దీవిస్తుంది. అలాగే అక్క రేణుక ఎల్లమ్మ సహాయం తీసుకోమని చెప్పి పంపుతుంది. బీరప్పగంగ ఒడ్డుకు వెళ్లి రేణుక ఎల్లమ్మ ను కలిసి, తన మరదలు తో పెళ్లి చేసుకోవడానికి సహాయం చేయాలని వేడుకుంటాడు. ఆమె తమ్ముని కోరికను కాదనలేక ఎరుకలి వేషం ధరించి నాగులకొండ పట్నం వెళ్లి నారదుని ఏడుగురు కుమార్తెల్లో ఎవరు నీకు సరైన వారో తెలుసుకొని చెప్తానని బయలుదేరుతుంది. నాగులకొండ పట్నం వెళ్ళిన రేణుక ఎల్లమ్మ నారదునితో నీ కుమార్తెల పెళ్లిళ్లు కావాలంటే మీ తాతలు చేసిన పాపాలు పోవాలని,ఆ పాపాలు పోవాలంటే మీ తాతలు తవ్విన బావిలో స్నానాలు చేయమని అప్పుడు పెళ్లిళ్లు జరుగుతాయని చెబుతుంది. వారంతా స్నానాలకు బయలుదేరగా రేణుక ఎల్లమ్మ బీరప్పతో నీ యొక్క ఏడుగురు మరదళ్లలో చిన్న మరదలు కామరతి నీకు సరైన జోడి అని ఆమెను అడ్డగించి తెచ్చుకోమంటుంది. అక్క చెప్పిన ప్రకారం బీరప్ప కామరతిని గుర్తించి ఆమెను తన అక్క ల నుండి తప్పించాలని ఆమె బంగారు పెట్టను దాచిపెడతాడు.

అప్పుడు కామరావతి ఒంటరిగా చిక్కగా ఆమెకు తను నీ బావని అంటూ విషయం చెప్పగా ఆమె కూడా అతన్ని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంటుంది. అయితే మా తండ్రి దగ్గర తాతల ముత్తాతల నాటినుండి దాచిన బంగారం ఉందని అంతా తీసుకొని వస్తానని చెప్పి ఇంటికి వెళ్తుంది. ఆమె ఎంతకీ రాక పోయేసరికి బీరప్ప శివున్ని వేడుకోగా, ఆ శివుడు నువ్వు గారడి వేషం కట్టి తెచ్చుకోమంటాడు. అప్పుడు గారడి వేషం కట్టుకొని పోయి గొంగట్లో కామరతిని తీసుకొని వస్తాడు. బీరప్ప పెళ్లి పీటల మీద ఉండగా గొర్రెల మంద మీద దొంగలు పడ్డారని బోయన్న చెబుతాడు. బీరప్పపెళ్లి పీటల మీద కత్తిని నిలిపి వెళ్తాడు. మంద మీది దొంగల్ని పట్టుకొని తిరిగి వచ్చేసరికి ముహూర్తం గడియ మించిపోతుందని బ్రాహ్మణులు కత్తికి కంకణం కట్టి కామరతికి పెళ్లి చేస్తారు . ఆ తర్వాత బీరప్ప దగ్గరికి తప్పయింది క్షమించుమని నారదుడు వచ్చి శరణు వేడుకోవడంతో కథ ముగుస్తుంది. ఈ ముగింపు సన్నివేశాన్ని కొందరు కళాకారులు మరొక రకంగా ప్రదర్శిస్తారు .కామ రతిని ఎత్తుకుపోయిన విషయం తెలుసుకున్న నారదుడు బీరప్ప పైకి సైన్యాన్ని పంపుతాడు. బీరప్పకు అక్క మహంకాళి అందుబాటులో లేక పోయేసరికి మంద కాసే బోయన్న సహాయం తీసుకుంటాడు. అతను ఒక్కడే సైన్యాన్ని ఎదురించలేకపోయే సరికి బీరప్ప పెళ్లి పీటల మీద కత్తిని నిలిపి యుద్ధానికి బయలుదేరుతాడు. అయితే బ్రాహ్మణులు



ముహూర్తం గడిచిపోతుందని కత్తికి కంకణం కట్టి పెళ్లి చేస్తారు.ఆ తర్వాత బీరప్ప యుద్ధం నుండి తిరిగి వచ్చి బాధపడతాడు. ఎడలగ్గానికైనా అక్క మహంకాళి ఉండాలని బోయన్న చేత కబురు పంపించగా ఆమె నారదుణ్ణి సంహరించి బీరప్ప కు దగ్గరుండి ఘనంగా ఎడ లగ్గం జరిపిస్తుంది. ఈ రకంగా కళాకారులు కొద్దిపాటి తేడాతో చెప్తారు.

బీరన్నలకు కురుమలు పూజారులుగా గురువులుగాఉండే వారసత్వం ఎట్లా సంక్రమించిందో కూడా ,ఒక మౌఖిక కథను కళాకారులు చెప్తారు. బీరన్న చిన్నతనంలో తుంటరి చేష్టలతో ఒక రాజు కోపానికి గురవుతాడు. ఆ కారణం చేత అతను భయపడి నాగ లోకం లోని నాగ గుండం ప్రవేశించి అక్కడ నాగ కన్నెలకు పూజ చేస్తూ ఉంటాడు. ఒకరోజు నాగ గుండం దగ్గరకు గొర్రెలమంద కాచుకుంటూ కురుమలు రాగా,బీరన్న పూజ మల్కరాయున్ని పిలిపించి కురుమలకు పూజ చేసే గురువును అవుతానని ,వారికి బొట్టు పెట్టి చెప్పమంటాడు. కురుమలు నమ్మక పోయేసరికి వారిని భయపెట్టినా సరే గురువును కావాలని అందుకు గొర్రెలకు రోగం తెప్పించి ఆ రోగం నయం కావడానికి కూడా బొట్టు పంపించి వాటికి పెట్టమని పంపిస్తాడు. ఆ గొర్రెల రోగాలు నయం కాగానే కురుమలు బీరన్నకు హారతిచ్చి గురువు గా ఉండమని వేడుకుంటారు. అప్పటినుండి బీరన్న కథ చెప్పుతూ పండుగ చేస్తున్నామంటారు. శుక్రవారం రోజు పండగ ప్రారంభమవుతుంది ఈరోజు బీరప్ప దేవున్ని జలధికి పంపుతారు. ఇందులో భాగంగా కురుమలంతాకలిసి పెద్ద కురుమ ఇంటికి గొర్రె పాలు తీసుకొచ్చి ఒక కుండలో పోస్తారు. ఆ తర్వాత ఇంటికి ఒక నీళ్ళబిందె, పూజా సామాగ్రి తీసుకొని డోలు వాద్యాలతో గుడికి చేరుకుంటారు. అంతకు ముందు రోజే బీరన్నలు గుడిని శుద్ధి చేసి ఉంచుతారు. మొదట పెద్ద కురుమ ,సార కురుమ ఒక కుడకతోటి కురుమలంతా కలిసి తెచ్చిన పాలను లింగాల మీద పోయగా మిగతా వారు ఇంటికి ఒకరు చొప్పున పాలు పోస్తారు. అంతా కలిసి పండుగ ప్రారంభమవుతుందని ప్ర మాణం చేస్తారు. దీనికంటే ముందు గురువారం రోజున కురుమలంతా పోచమ్మ బోనాలు చేస్తారు. ఈ బోనాల లో ఈర బోనం, గంగ బోనం ప్రత్యేకంగా ఉంటాయి. డోలు వా ద్యాలతో ఊరేగింపుగా పోచమ్మ తల్లి కి బోనాలు సమర్పిస్తారు. శనివారం రోజున బీరన్న లు లింగాలను జలధికి తీసుకువెళ్లేటప్పుడు ఊరేగింపుగా వెళ్తూ కటార్లు వేస్తారు. ఈ కటార్లు వేయడానికి కారణం కూడా బీరప్పకథలో కనిపిస్తుంది. బీరప్ప కామరతి జాడ కోసం వెళ్ళినప్పుడు దారిలో గంగ తల్లి ఉప్పొంగుతుంది .అప్పుడు బీరప్పకటారు పైకి ఎగురవేసి ముంచేవు గంగా, నీ చెవులు కోస్తా ముక్కు కోస్తా అంటూ కటారు తో పొట్ట మీద కాట్లు వేసుకొని తన రక్తాన్ని దోసిలి పట్టి గంగ మీద భలో భలో అని చల్లితే గంగ శాంతిస్తుంది. ఇట్లా కళాకారులు కథకు అనుగుణంగా నడుచుకుంటూ తమ పుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ సందర్భంలో కళాకారులు నడుముకు నాగబంధం, గజ్జల లాగు, గంటలు కట్టుకొని ,బండారి ఒళ్లంతా పూసుకొని కటార్లు పైకెత్తి పొట్ట మీద చేతుల మీద అలుగులు వేసుకుంటూ ఊరేగింపుగా వెళ్తారు. ఇక ఆదివారం ఇంటికి ఒక బోనం చొప్పున బీరప్ప దేవునికి లగ్గం బోనం బయలుదేరుతుంది. ఈరోజు గుడి ముందర పట్నం వేయడం, గావు పట్టడం జరుగుతుంది. అలాగే మం దలు బాగుండాలని అర్ధరాత్రి మంద మీద గావు పట్టి బలి చ ల్లుతారు. సోమవారం కథలో భాగంగా ఎరుకలి వేషం ధరి ంచి గుడి దగ్గర కథ చెప్తారు. ఇదే రోజు సందు బోనం, మంగళవారం దేవునికి నాగ బెల్లి బోనం బయలుదేరుతుంది. బుధవారం అక్క మహంకాళి మరియు కామరతి బీరప్ప బోయన్న వేషాలను పెద్ద కురుమ ఇంటి దగ్గర కట్టి గుడి దగ్గర కథ చెప్పి, కామరతికి, మహంకాళికి ఒడి బాల బియ్యం కడతారు. గురువారం బీరప్ప కథ లో బీరప్ప గారడి వేషం కట్టినట్టుగానే కళాకారులు గజ్జల లాగు తోపుకుల్ల ధరించి గారడి విద్యలు ప్రదర్శిస్తారు. ఇందులో భాగంగా మామిడి పిక్క నాటి చెట్టు




పుట్టించి కాత కాపియ్యటం, గొంగట్లో పేలాలు వేయించటం, లెంకలు పెట్టి కట్టేయ్యడం, ఒకరి దగ్గర ఉండే డబ్బులు మరొకరి దగ్గర చూపించడం, చెంపలకు సూదులు దింపుకోవడం ,ఒకరు చూపించిన రాయిని కళ్లకు గంతలు కట్టుకొని,అదే రాయిని చూపించటం వంటి గారడీ విద్యలను ,ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా ప్రదర్శిస్తారు. ఈ రకంగా బీరన్నలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని అనుసరిస్తూ కురుమల సంస్కృతి పరిరక్షణలో భాగమవుతూ జీవిస్తున్నారు .వీరిని బీరప్ప దేవుని పేరు మీదనే పిలువడం విశేషంగా చెప్పుకోవచ్చు. బీరన్నలు ప్రత్యేకంగా ఇంటిలో సావార దేవున్ని పూజిస్తారు. ఈ దేవునికి శ్రావణ మాసంలోనూ, దసరా ఉగాదికి పూజ చేస్తారు. వీరి సంస్కృతిని కాపాడుకుంటూనే బీరప్ప మల్లన్న ఎల్లమ్మ కథలను చెప్పుతూ, ఇంద్రజాల విద్యలు ప్రదర్శిస్తూ పట్నాలు వేస్తూ బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఈ కళాకారులను ప్రస్తుతించవచ్చు.



బీరప్ప చరిత్ర

వీరభద్రుని అవతారమైన బీరప్ప కురుమల దైవం గా పూ జింపబడుతూ వస్తున్నాడు. ఈ బీరప్ప చరిత్రకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా పంథిని గ్రామానికి చెందిన బీరన్న కళాకారుడైన పొన్న రవి చెప్పిన కథనం ప్రకారం బీరప్ప తండ్రి బ్రహ్మదేవుడు, తల్లి సూరమ్మ దేవి, నారదుని తోడ సూరమ్మ దేవి పుడుతుంది. పుట్టిన కొద్ది గడియల కే ఆమె తల్లిదండ్రులు చనిపోతారు. అన్న నారదుడు తల్లిదండ్రుల గండాన పుట్టావని తీసుకెళ్ళి అడవిలో వదిలి పెడతాడు. పాప అడవిలో ఏడుస్తుంటే శివుడు విని పార్వతి లక్ష్మి సరస్వతికి చెప్పి పాపను పెంచమంటాడు.12 ఏళ్లు పెంచిన తర్వాత ఆమె వారిని నా తల్లిదండ్రులు నా పట్నం గురించి చెప్పమని అడుగుతుంది. అప్పుడు వారు నీ పట్టణం నాగులకొండ అని, నీకు నారదుడు అనే అన్న ఉన్నాడని చెప్తారు. ఈ విషయం తెలుసుకున్న సూరమ్మ తల్లి అన్న దగ్గరకి వెళ్తుంది. అక్కడ సూరమ్మ తల్లిని చూసిన బంటు ఎవరు నీవు అంటూ ప్రశ్నించగా, ఆమె నారదుడు నాకు అన్న కావాలంటూ బదులిస్తుంది. ఆ మాటకు బంటు మా రాజుకు చెల్లెలు ఎవరూ లేరని, మా రాజు పట్నం చూసి, ఆస్తి చూసి అన్న అని పిలుస్తున్నావా అంటూ దూషిస్తాడు. నారదుడు కూడా ఆమె మాటలు విని నాకు చెల్లెలు ఎవరూ లేరని చెప్పి ఆమెను చెల్లిగా ఒప్పుకోక తిడతాడు. అప్పుడు బంటు బాగా ఆలోచించి నీకు తల్లిదండ్రులు ఎవరు లేరని నేను నీకు గత 12 సంవత్సరాలుగా సేవ చేస్తూ వస్తున్నానని, ఆమె నీకు చెల్లి అని చెప్తుంది కాబట్టి నీకు సేవ చేయడానికి పనికి వస్తుందని ఒప్పిస్తాడు.అప్పటి నుండి ఆమె ఇంట్లో పనులు చేస్తూ ఉంటుంది. కొన్ని రోజులకు నారదుడు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని బయలుదేరగా శంకరుడు మారు వేషంలో ప్రత్యక్షమై నీకు చెల్లెలు ఉందని, ఆమెకు పెళ్లి చేయకుండా నువ్వు పెళ్లి చేసుకోవడం మంచిది కాదని చెప్తా డు. అందుకు సరేనంటూ నారదుడు బాగా ఆలోచించి ఒకవేళ నాకు బిడ్డ పుడితే నా చెల్లెలి కొడిక్కే ఇవ్వాల్సి ఉంటుందని పున్నమికి పుచ్చుపోయేవాడికి,అమావాస్యకు అయిపోయేవాడికిచ్చి పెళ్లిచేయాలనుకుంటాడు. ఇదే సమయంలో శంకరుడు బ్రహ్మ తో నువ్వు సూరమ్మ తల్లిని పెళ్లి చేసుకోవాలని కోరుతాడు.



డా.బాసని సురేష్
తెలుగు విశ్వవిద్యాలయం
99894 17299

రెండేళ్లుగా వృద్ధి రేటు భేష్: ప్రణబ్



న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక వ్యవస్థ సవ్యంగా ఉందని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చెప్పారు. గత రెండేళ్లుగా భారత్ అత్యధిక వృద్ధి రేటును సాధిస్తోందని ప్రణబ్ తెలిపారు. దేశ ప్రజలకు గణతంత్ర శుభాకాంక్షలు తెలియచేస్తూ ప్రణబ్ శనివారం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రిపబ్లిక్ డే నేపథ్యంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని భారత రత్నగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అవార్డును తాను సవినయంగా స్వీకరిస్తున్నట్లు తెలిపిన ప్రణబ్ రెండేళ్ల వృద్ధిరేటు బాగుందని, అయితే ఇది ఏ ఒక్కరి ఘనతనో కాదని దీనిలో అంతా భాగస్వాములే అని తేల్చిచెప్పారు. భారతరత్న పురస్కారం తనకు దక్కడం గౌరవంగా భావిస్తున్నట్లు, ఈ పురస్కారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని మాజీ రాష్ట్రపతి తెలిపారు. అన్ని స్థాయిల్లోనూ పాలన పారదర్శకంగా ఉండాలని ఇందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ ప్రజానీకం రాజ్యాంగంలోని ప్రాదేశిక సూత్రాలపరిరక్షణకు పాటుపడాలని మాజీ రాష్ట్రపతి పిలుపు నిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థాపక నైతిక సూత్రాలకు కట్టుబడాలని కోరారు. భారతరత్నగా ఎంపికైన ప్రణబ్ శనివారం దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెంట్రల్ ఢిల్లీలోని స్వగృహంలో జాతీయ జెండాను ఎగురవేసిన తరువాత మాజీ రాష్ట్రపతి మాట్లాడారు. అందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత, సౌభాతృత్వం రాజ్యాంగంలోని కీలక అంశాలని , ఇవి ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకుండా పౌరులు తమ బాధ్యతలను పాటించాల్సి ఉందన్నారు. అత్యున్నత పురస్కారం తనకు ప్రజల ఆదరాభిమానాలతోనే దక్కిందని, తాను ప్రజలకు చేసిందాని కన్నా ప్రజలు తనకు ఇచ్చిందే ఎక్కువ అని, ఇది ఎప్పుడూ తాను చెప్పే మాట అని ప్రణబ్ గుర్తు చేశారు. ఈ అవార్డు తనకు ఒక్కడికే చెందదని, ఆ మాటకు వస్తే ఇది వ్యక్తిగత గౌరవం కాదని, భారతీయ పౌరుడిగా సగర్వంగా స్వీకరించే పురస్కారంగా తాను విశ్లేషిస్తానని తెలిపారు. మన కలలకు అనుగుణంగా మన దేశాన్ని తీర్చిదిద్దుకునేందుకు మనమంతా కలిసి నడవాల్సి ఉందని పిలుపు నిచ్చారు. ఈ ఘనమైన దేశం సర్వదా తన వైవిధ్యాన్ని ఘనంగా చాటుకుంది. బహుళత్వాన్ని సగర్వంగా తెలియచేసుకుంది. వివిధ ప్రాంతాలలో పలు భాషలు యాసలు మాట్లాడే వారు వివిధ ఆచార వ్యవహారాలతో సాగే వారు ఒకే జాతీయ జెండా, సమున్నత రాజ్యాంగ పరిధిలో ఒక్కటిగా సాగుతారని తెలిపారు. ఇది దేశ ఘనమైన ఘనత అని కితాబు ఇచ్చారు.

రిజర్వేషన్లను వాడుకుంటున్న కాంగ్రెస్

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ధ్వజం

మన తెలంగాణ/హైదరాబాద్ : 70సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంకా ఓటు బ్యాంకుగానే పరిగణిస్తుండడం విచారకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. గణతంత్ర్య దినోత్సవంలో భాగంగా శనివారంనాడు నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దేశ పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, సబ్‌కాసాత్.. సబ్‌కా వికాస్ అనే లక్ష్యంతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు. ఈబిసి 10శాతం రిజర్వేషన్లను కెసిఆర్ ఎందుకు తెలంగాణలో అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఓటుబ్యాంకు రాజకీయాలు మానుకుని టిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధితో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్లోబల్ ఇండియన్ ఇన్‌స్పిరేషనల్ బ్రాండ్‌గా 'నారాయణ'

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ కన్సల్టింగ్ రీసెర్చ్ కార్పొరేషన్ 2019 అవార్డును నారాయణ విద్యాసంస్థ కైవసం చేసుకుంది. 2018–2019 సంవత్సరానికి గాను గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్‌గా నారాయణ ఎంపికైందని, ఇండియన్ ఇన్స్పిరేషనల్ లీడర్స్‌గా కె.పునిత్, డాక్టర్ సింధూర నారాయణ ఎంపికచేయడం జరిగింది. ప్రపంచ మార్కెట్‌పై, సమాజంపై నారాయణ బ్రాండ్ చూపుతున్న ప్రభావాన్ని లెక్కగట్టిన సంస్థ గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్ అవార్డను ప్రకటించింది. దేశ వ్యాప్తంగా దాదాపు 500 బ్రాండ్ల ప్రభావాలను విశ్లేషించిన వరల్డ్ కన్సల్టింగ్ రీసెర్చ్ కార్పొరేషన్ విస్తృతంగా పరిశోధించి ఈ అవార్డులను ప్రకటించింది. సమర్థవంతంగా నారాయణ సంస్థను నడిపిస్తున్నందుకు గాను గ్లోబల్ లీడర్స్‌గా సంస్థ చైర్మన్ కె.పునిత్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ ఎంపికచేసింది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల చైర్మన్ కె.పునీత్ మాట్లాడుతూ నారాయణ గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ నారాయణ మా అందరికీ స్ఫూర్తి ప్రదాతగా అభివర్ణించారు.

మేఘాలయ గనిలో మరో మృతదేహం లభ్యం

న్యూఢిల్లీ: మేఘాలయ తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని ఇరుకైన బొగ్గు గనిలో శనివారంనాడు నౌకాదళ డైవర్లు మరో మృతదేహాన్ని కనుగొన్నారు. గనిలో 280 అడుగుల లోతులో ఈ మృతదేహం కనిపించింది. గత ఏడాది డిసెంబర్ 13న ఈ బొగ్గుగనిలో వరద నీరు ప్రవేశించడంతో బయటపడలేక 15 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఈ గనిలో మరో మృతదేహం కనిపించిందని సహాయక బృందం అధికారి తెలిపారని తూర్పు జైంతియా హిల్స్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎఫ్‌ఎం డోప్త్ వెల్లడించారు.

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు


టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: చట్ట సభలలో వివక్షకు గురవుతున్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌లకు కేంద్రం సానుకూలతగా స్పందించాల్సిన అవసరముందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్‌లను తీసుకొచ్చిన విధంగా చేయాలన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం 70వ గణతంత్ర దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండా పతాకాన్ని ఎల్. రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది చేతులలోనే, దేశంలో పెరిగిన సంపద ఉండడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజ్యాంగం అమలునకు కృషి చేయడంలో టిడిపి ముందుంటుందన్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బుచ్చిలింగం పాల్గొన్నారు.

స్నోమెన్ ఉన్నాడు?

నాసా వ్యోమనౌక అన్వేషణలో మరో ముందడుగు

వాషింగ్టన్ : అమెరికా అంతరిక్ష సంస్థ నాసా కోటానుకోట్ల దూరంలో అంతరిక్షంలో కనుగొన్న స్నోమెన్ అల్టిమా థులే రూపురేఖలు స్పష్టం అయ్యాయి. నాసాకు చెందిన న్యూహారిజన్ వ్యోమనౌక అంతరిక్ష అన్వేషణలో సాగుతూ ఈ ఏడాది ఆరంభం రోజునే ప్లూటో గ్రహానికి ఆవల ఒక తల, చిన్నపాటి మొండెం కలిపినట్లుగా ఉండే విచిత్రాకృతిని గుర్తించింది. ఖగోళాంతరంలో ఇంతకు ముందెన్నడూ వెళ్లని బహుదూరంలో ఈ వస్తువును కనుగొన్నారు. అయితే గ్రహాల మరుగుజ్జు గ్రహాల మధ్య తిరుగుతూ ఉండటం ఓ విధంగా తెల్లటి కలిసిన రాళ్లను, ఓ విధంగా చిన్నపాటి మనిషిని పోలి ఉండటంతో దీనికి స్నోమెన్‌గా అల్టిమా థులేగా పేరు పెట్టారు. దాదాపు 25 రోజుల తరువాత నాసా వ్యోమనౌక ఈ గ్రహాంతరపు వస్తువు గురించి స్పష్టమైన ఛాయాచిత్రాలను నాసా కేంద్రానికి పంపించింది.



జంగిల్ బచావో, బఢావో



(మొదటిపేజీ తరువాయి)

అడవులు తదితర అంశాలపై ప్రగతిభవన్‌లో శనివారం అటవీ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి పై విధంగా స్పష్టత ఇచ్చారు. అవసరమైతే ప్రస్తుతం ఉన్న చట్టాల్లో మార్పులు చేయడం లేదా కొత్త చట్టాలను తీసుకురావాలని సూచించారు.

అడవుల్ని ధ్వంసం చేస్తే కఠిన చర్యలు :

రాష్ట్రంలో అడవులు కాపాడే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, కలప స్మగ్లర్లపై పి.డి. యాక్టు నమోదు చేసి శిక్షిస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ హెచ్చరించారు. అడవులు నరికి, కలపను స్మగ్లింగ్ చేసేవారిని గుర్తించే పనిలో ఇప్పటికే ఇంటెలిజెన్స్ వర్గాలు నిమగ్నమయ్యాయన్నారు. అడవులను రక్షించే విషయంలో చిత్తశుద్ధి, దృఢచిత్తం, అంకితభావం కలిగిన అటవీశాఖ అధికారులను ముఖ్యమైన అటవీ ప్రాంతాల్లో నియమించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని, అడవి నుంచి పూచిక పుల్ల కూడా బయటకు పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయుధ పోలీసులు, అటవీ శాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ బృందాలు అడవిలో నిరంతర తనిఖీలు నిర్వహించడంతో పాటు, అడవి నుంచి వెళ్లే మార్గాలపై నిఘా పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి, జిల్లా అటవీ అధికారులు కలిసి ఆయా జిల్లా పరిధిలోని అడవుల సంరక్షణకు కావాల్సిన కార్యాచరణను రూపొందించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అడవులను రక్షించే బాధ్యత జరగాలని స్పష్టం చేశారు. ఇప్పుడున్న అటవీ చట్టాలను నిశితంగా సమీక్షించాలని, అడవులను రక్షించడానికి, ఆక్రమణదారులను, స్మగ్లర్లను కఠినంగా శిక్షించడానికి అవసరమైన కొత్త చట్టాలు తేవాలని, అవసరమైన మేర ఇప్పుడున్నచట్టంలో మార్పులు తేవాలని సిఎం చెప్పారు.

అటవీ పరిరక్షణకు బహుముఖ వ్యూహం

రాష్ట్రంలో పచ్చదనం పెంచడానికి బహుముఖ వ్యూహాన్ని రూపొందించి అమలు చేయాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రధానంగా నాలుగు విధాల చర్యలు ఉండాలని అన్నారు. ప్రస్తుతమున్న అడవిని పూర్తిస్థాయిలో రక్షించడం; అడవుల్లో కోల్పోయిన పచ్చదనాన్ని (చెట్లను) పునరుద్ధరించడం; గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వనాలను పెంచడం; హైదరాబాద్, వరంగల్ లాంటి మహా నగరాలతో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించడానికి పచ్చదనాన్ని పెంచడం వ్యూహాలుగా ఉండాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

'జంగిల్ బచావో, జంగిల్ బడావో (ఉన్న అడవిని కాపాడాలి, పోయిన అడవిని పునరుద్ధరించాలి)' అనే నినాదంతో అధికార యంత్రాంగం కృషి చేయాలని స్పష్టం చేశారు. ఓ వైపు చెట్లు పెంచడం కోసం హరితహారం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరోవైపు అడవులు అంతరించిపోతూ ఉంటే చూస్తూ కూర్చోవడం వల్ల లాభం లేదని, అడవిని కాపాడకపోతే హరితహారం లాంటి ఎన్ని కార్యక్రమాలు అమలు చేసినా, ఫలితం రాదని అన్నారు. అడవిని కాపాడే విషయంలో అన్ని స్థాయిల్లోనూ కఠినంగానే వ్యవహరించాలని, ఇందుకోసం పోలీసులు, అటవీశాఖ అధికారులు కలిసి పనిచేయాలని, అటవీశాఖకు సాయుధ పోలీసులు అండగా నిలుస్తారని తెలిపారు. అడవులను నరికేవారిని, స్మగ్లింగ్ చేసేవారిని గుర్తించే పనిలో ఇంటెలిజెన్స్ నిమగ్నమైందని, వారిని గుర్తించగానే చర్యలు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్మగ్లింగ్ జీరో సైజుకు రావాలని, స్మగ్లింగుకు పాల్పడేవారిపై పి.డి.యాక్టు కింద కేసుల్ని నమోదు చేయాలన్నారు.

టిఆర్‌ఎస్ నేతలయినా వదలొద్దు

మనకు ప్రజలే ముఖ్యమని, వారి భవిష్యత్తే కీలకమని, అంతకు మించిన ప్రాధాన్యత మరొకటి లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రాజకీయ ప్రలోభాలకు లొంగవద్దని వివరించారు. భావి తరాలు బాగుండాలనే ఉద్దేశంతోనే అడవుల పరిరక్షణ, పచ్చదనాన్ని పెంచడం తదితర కార్యక్రమాలను ప్రాధాన్యతాంశాలుగా తీసుకున్నామని పేర్కొన్నారు. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని, కలప స్మగ్లింగుకు పాల్పడేవారు ఎంతటివారైనా చర్య తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. టిఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు స్మగ్లింగుకు పాల్పడినట్లు తేలితే అందరి కన్నా ముందు వారినే అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. అడవులను ధ్వంసం చేసే దగ్గర తన, మన అనే బేధాలే వద్దని, ఎంతటి వారైనా శిక్షకు అర్హులేనని అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఇంకా అడవి ఉందని, ఆ జిల్లాల్లోనే స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోందని, అడవులు ఎక్కువగా నరికివేతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అడవిలో ఒక్క చెట్టు కూడా పోకుండా జాగ్రత్త పడాలన్నారు. అడవులను రక్షించే విషయంలో చిత్తశుద్ధి, పట్టుదల, అంకితభావం కలిగిన అధికారులను ఆయా ప్రాంతాల్లో నియమించాలని, వారికి సాయుధ పోలీసులు కూడా తగిన భద్రత కల్పిస్తారని స్పష్టం చేశారు. పోలీసులు, అటవీశాఖ అధికారుల సంయుక్త నిర్వహణలో అడవికి వెళ్లే అన్ని మార్గాల్లోనూ భారీ సంఖ్యలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి సాయుధ పోలీసుల పహారా ఏర్పాటుచేయాలని సూచించారు. మొత్తంగా అడవిలో ఒక్క చెట్టు కూడా నరికివేతకు గురికాకుండా, అంగుళం కూడా ఆక్రమణకు లోనుకాకుండా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సమైక్య పాలకుల ప్రేక్షకపాత్ర

రాష్ట్ర భూభాగంలో 33 శాతం పచ్చదనం ఉంటేనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని, కానీ తెలంగాణలో 24 శాతం మాత్రమే అటవీభూమి ఉందని, అది కూడా అధికారిక లెక్కల్లో మాత్రమేనని సిఎం వ్యాఖ్యానించారు. వాస్తవానికి రాష్ట్ర భూభాగంలో 12 శాతం మేర కూడా పచ్చదనం లేదని, ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. అటవీ ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత విషాదకరంగా ఉందని గుర్తుచేశారు. సమైక్య రాష్ట్రంలో పెద్ద ఎత్తున అడవుల నరికివేత జరిగిందని, లక్షల ఎకరాల్లో అడవి నాశనమైపోతున్నా అప్పటి పాలకులు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. అటవీ భూమి అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోలేదని, ఇప్పటికైనా మనం మేల్కొనాలన్నారు. పర్యావరణం సమతుల్యంగా లేకుంటే మానవ మనుగడకు ఆస్కారమే లేదని, అటవీ భూభాగంలో ఇప్పటివరకూ కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఆదేశించారు. పెద్ద ఎత్తున అటవీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టాలని, అటవీ భూభాగమంతా పచ్చని చెట్లతో నిండి ఉండాలన్నారు. అటవీ భూములపై సాగు హక్కులు కలిగినవారితో కూడా ఉభయ తారకంగా ఉండే చెట్ల పెంపకాన్ని చేయించాలని, వారికి ఆదాయం రావడంతోపాటు అడవి కూడా పెరగాలన్నారు. అలాంటి చెట్లను ఎంపిక చేయాలని, దీనికి అటవీ శాఖ చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇంటింటికీ చెట్టు ఉండాలి

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని, ఖాళీ ప్రదేశాలన్నింటిలోనూ చెట్లను పెంచాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ ఇంటిలో చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ఇందుకోసమే గ్రామాల్లో చెట్ల పెంపకాన్ని విధిగా చేపట్టడం కోసం పంచాయితీ రాజ్ చట్టంలో మార్పులు తెచ్చామని గుర్తుచేశారు. ప్రతీ గ్రామంలో ఖచ్చితంగా నర్సరీలను ఏర్పాటు చేయాలని, విరివిగా మొక్కలు నాటి, వాటిని రక్షించే బాధ్యతను స్థానిక సంస్థలు స్వీకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరాలన్నీ కాలుష్యంతో నిండిపోయాయని, దేశ రాజధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం వల్ల అనేక రకాల రోగాలొస్తున్నాయని, చాలా నగరాల పరిస్థితి కూడా అలాగే ఉందని సిఎం వివరించారు. హైదరాబాద్‌లో ఉండడం ఇప్పటివరకు మన అదృష్టమని భావిస్తున్నామని, కానీ జాగ్రత్తగా ఉండకపోతే అది దురదృష్టంగా మారుతుందని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో పెరిగే వాహనాలు, జన సాంద్రత, జనాభా పెరుగుదల వల్ల కాలుష్యం పెరుగుతోందని, దానికి తగ్గట్టుగా పచ్చదనం పెంచకుంటే భావి తరాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. అందువల్ల హైదరాబాద్, వరంగల్ లాంటి మహానగరాలతో పాటు అన్ని నగరాలు, పట్టణాల్లో విరివిగా చెట్లను పెంచాలని, ఆయా నగర ప్రాంతాల్లో ఉన్న అటవీ బ్లాకులను గుర్తించి వాటిని పార్కులుగా మార్చాలన్నారు. ఆ పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లను, వాకర్స్ క్లబ్బులను ఏర్పాటు చేసి ఫారెస్టు బ్లాకుల సంరక్షణ బాధ్యలను వారికే అప్పగించాలని సూచించారు. నగరాలు, పట్టణాల్లో చెట్ల పెంపకానికి ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రస్తుత చట్టాలను సమీక్షించాలి

అడవుల సంరక్షణ కోసం ప్రస్తుతమున్న అటవీ చట్టాలను పూర్తి స్థాయిలో సమీక్షించాలని అటవీ అధికారులను సిఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనం పెంచడం, అడవులను రక్షించడం, స్మగ్లర్లను శిక్షించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్యానికి అనుగుణంగా పర్యావరణ రక్షణ కోసం అవసరమైతే కొత్త చట్టాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంచే కార్యక్రమానికి నిధుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 'కాంపా' నిధులను వినియోగించుకోవడంతో పాటు, బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని, అవసరమైతే గ్రీన్ సెస్ వసూలు చేస్తామని, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధుల నుంచి నెలకు కొంత మొత్తంలో విరాళం రూపంలో స్వీకరిస్తామని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను కూడా ఈ కార్యక్రమం కోసమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిధుల కొరత రాకుండా 'గ్రీన్ ఫండ్'ను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డిజిపి మహేందర్ రెడ్డి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.కె ఝా, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ జితేందర్, ఐజిలు నవీన్ చంద్, స్టీఫెన్ రవీంద్ర, నాగిరెడ్డి, సిసిఎఫ్ రఘువీర్, సిఎంఒ అధికారులు భూపాల్ రెడ్డి, ప్రియాంక వర్గీస్, శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, బాల్క సుమన్, శాసనమండలి సభ్యులు కర్నె ప్రభాకర్, శంభీపూర్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు శేరి సుభాష్ రెడ్డి, గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలుకు ప్రతిన బూనాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిలుపు



మన తెలంగాణ/ హైదరాబాద్: రాజ్యాంగం నిర్దేశించిన మేరకు విధులు నిర్వహిస్తే దేశం పురోగతి వైపునకు పయనిస్తుంది. భారత పౌరులంతా చేతిలో చేయి వేసుకుని మన విధుల్ని రాజ్యాంగం ద్వారా అమల్లోకి వచ్చిన న్యాయబద్ధంగా విధులు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయాలి. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మనమంతా రాజ్యాంగానికి అనుగుణంగా అడుగులు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలి.. అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని శనివారం హైకోర్టు ప్రధాన భవనంపై ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ ప్రజలకు రాష్ట్ర న్యాయ వ్యవస్థ తరఫున గణతంత్ర వేడుకల శుభాకాంక్షలను తెలియజేశారు. న్యాయవాదులంతా రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని, నేటి తరానికి రాజ్యాంగ విలువల్ని తెలియజేయాలన్నారు.'రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చిన ఘనమైన గణతంత్ర దినోత్సవం నేడు. రాజ్యాంగం ప్రజలకు సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటివి కల్పించింది.దేశంలో సెక్యులర్, సోషలిస్ట్, డెమొక్రటిక్, రిపబ్లిక్ వంటిని నేటికీ దేశంలో ఉన్నాయంటే రాజ్యాంగ రూపకర్తల దూరదృష్టి, వారి లోతైన అధ్యయనమే కారణం. ఇవన్నీ సమర్థంగా నిలిచేందుకు రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో ప్రజల పాత్ర ఎంతో కీలకమైనది. అన్ని కోణాల్లో పూర్తి సమతుల్యత కొనసాగించేందుకు, దేశ సమగ్రత, సమైక్యతకు కూడా రాజ్యాంగం ఎంతగానో దోహదపడేలా చేస్తోంది. మన దేశ బౌగోళిక సంస్కృతులు విభిన్నంగా ఉన్నాయి. అందుకు అనుగుణమైన సాంస్కృతిక మార్పులను కూడా రాజ్యాంగ రూపకర్తలు పూర్తి స్థాయిలో అధ్యయనం చేశారు. దీని వల్ల దేశ పౌరుల్లో ఆత్మవిశ్వాసం నింపింది. ప్రతి వ్యక్తి స్నేహపూర్వకంగా, మరొకరికి చేయూతనిచ్చేలా ఉన్నప్పుడే ఏ సమాజమైనా భద్రతంగా, రక్షణగా, సంతోషంగా ఉంటుంది. ప్రభుత్వాల్లోని వివిధ విభాగాల్లో లోతుగా పరిశీలన చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా మన రాజ్యాంగం ఉంది. దీని వల్ల ఎవరైతే చట్టం, న్యాయపరంగా విధులు నిర్వహించే వారి చిత్తశుద్ధి బలపడుతుంది.రాజ్యాంగ అమలుకు ప్రజలందరూ ప్రతిజ్ఞ చేయాలి.. ' అని జస్టిస్ రాధాకృష్ణన్ తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సి.దామోదర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తులు, న్యాయనిపుణులు తమ కుటుంబసభ్యులతో హాజరయ్యారు

స్వీట్లు పంచిన చీఫ్ జస్టిస్

స్వయంగా మిఠాయిల ప్లేటు పట్టుకుని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ తన ఇంట్లో పనిచేసే సిబ్బందికి, పోలీస్‌లకే కాకుండా రోడ్లను ఊడ్చే కార్మికులకు పంచిపెట్టారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శనివారం బంజారాహిల్స్‌లోని అధికారిక నివాస గృహంలో జస్టిస్ రాధాకృష్ణనే అందరికీ మిఠాయిలు పంచిపెట్టడం విశేషం.

ఫుడ్ ప్రోగ్రెసింగ్

(మొదటిపేజీ తరువాయి)

చేసి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి సమర్పించింది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై వ్యవసాయ, ఉద్యాన శాఖలతో పాటు విశ్వవిద్యాలయాలు కూడా తగిన అధ్యయనం చేసి ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఏయే ప్రాంతాల్లో ఏయే ఉద్యాన పంటలు పండుతున్నాయో వాటి ఆధారంగా ప్రాసెసింగ్ యూనిట్లపై ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను రూపొందించారు. తద్వారా రైతులకు గిట్టుబాటు అవుతుందని పేర్కొంటున్నారు.దీని ప్రకారం మంచిర్యాల్‌లో 64 వేల మెట్రిక్ టన్నులు, కరీంనగర్‌లో 20 వేలు, జనగాంలో 40 వేలు, రంగారెడ్డిలో 27,200 మెట్రిక్ టన్నులు, వికారాబాద్‌లో 45 వేలు, మహబూబ్‌నగర్ 50 వేల మెట్రిక్ టన్నులు, వనపర్తిలో 80 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 64,500 మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండటంతో అక్కడ ఈ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రతిపాదించారు. అలాగే మూడు జిల్లాల్లో టమాట ప్రాసెసింగ్ యూనిట్లను ప్రతిపాదించారు. ఆదిలాబాద్ జిల్లాలో మూడు మండలాల్లో 41,336 మెట్రిక్ టన్నులు, సంగారెడ్డి జిల్లాలో గుమ్మిడాల, జిన్నారం, పటాన్‌చెరు మండలాల్లో 40 వేలు, సిద్ధిపేటలో చిన్నకోడూర్, నంగనూర్ మండలాల్లో 48 వేల మెట్రిక్ టన్నుల టమాట పంట ఉత్పత్తి అవుతుంది. టమాటలతో పచ్చడి తయారీ చేయడంతో పాటు, సాస్, కెచాప్ వంటి ఉత్పత్తులు తీసుకువస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని అందులో పేర్కొన్నారు. అలాగే 5 జిల్లాల్లో పసుపు అధికంగా సాగవుతున్నందున అక్కడ పసుపు పౌడర్, ఓలియోరెసిన్, కుర్కుమిన్ వంటి ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించింది.

5 చోట్ల కారంపొడి.. 3 చోట్ల ఉల్లిపేస్ట్

వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో మిర్చి పంటకు సంబంధించిన విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ వ్యవసాయ వర్సిటీకి సూచించింది. దీంతో కారంపొడి తయారీ చేయడంతో పాటు ఓలియోరెసిన్ పదార్థం కూడా తీయాలని పేర్కొంది. అలాగే వరంగల్ అర్బన్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉల్లిగడ్డ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించాలని తెలిపింది. ఈ మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 9 వేల మెట్రిక్ టన్నుల ఉల్లిగడ్డ ఉత్పత్తి అవుతోంది. ఉల్లిపేస్ట్, డీహైడ్రేడ్ స్లైసెస్, పేస్ట్, పౌడర్ ఉత్పత్తులు తయారు చేయవచ్చునని ప్రతిపాదించింది. ఇప్పటికే వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలను సందర్శించామని, మరింత అధ్యయనం చేసి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని ఉద్యాన శాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్‌రెడ్డి "మన తెలంగాణ"కు వివరించారు.

టిఆర్‌ఎస్ ఆఫీస్‌లో వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. రాష్ట్రనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కెటిఆర్ కంటే ముందుగా రాష్ట్ర హోంశాఖమంత్రి మహ్మద్ మహ్మూద్ ఆలీ, తాజామాజీ మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే శాసనమండలి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, శంబీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కెటిఆర్ అందుబాటులో ఉన్నముఖ్యనాయకులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. బారులుతీరిన టిఆర్‌ఎస్ కార్యకర్తలను కలిసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. కాప్రాకు చెందిన రెండేళ్ల చిన్నారి మిథిల్ కాలేయవ్యాధితో బాధపడుతున్నాడని మిథిల్ బంధువులు కెటిఆర్‌కు వినతి పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా టిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ రూపొందించిన 2019 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కెటి.రామారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హోంశాఖమంత్రి మహమూద్ అలీ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, శాసన సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ట్విట్టర్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు దేశ విదేశాల్లోని తెలంగాణ ప్రజలందరికీ గణతంత్ర శుభాకాంక్షలను కెటిఆర్ తెలిపారు.

డోర్నకల్ నియోజకవర్గంలో పర్యటించనున్న కెటిఆర్

నేడు టిఆర్‌ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డోర్నకల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా నేడు ఉదయం 9. గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గం ద్వారా బయలు దేరి మధ్యాహ్నం 12. గంటలకు మరిపెడ మండలం చేరుకుంటారు. మరిపెడ మండలంలోని పురిశోథ గూడెంలో టిఆర్‌ఎస్ పార్టీ నూకల నరేష్ రెడ్డి తల్లి పెద్దకర్మకు హాజరవుతారు. ఆతర్వాత డోర్నకల్ లో అందుబాటులో ఉన్న ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. ఆతర్వాత హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



హైదరాబాద్‌లోని పాతబస్తీలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



తలకిందులుగా జెండా ఎగరవేసిన తహసీల్దార్

మన తెలంగాణ/బోయిన్‌పల్లి : సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంపైన 70వ గణతంత్ర వేడుకల్లో భాగంగా తహసీల్దార్ ప్రసాద్ జాతీయ పతకాన్ని తలకిందులుగా ఎగరవేశారు. మండల కేంద్రంలో మరెవరైనా ఇలా చేశారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు కానీ స్వయంగా మండలం మేజిస్ట్రేట్ అయినా తహసీల్దార్ ఇలా చేయడం పట్ల పలువురు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. కింది స్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యం వలన ఇలా జరిగింది. ఇప్పటికైనా అధికారులు కనీసం స్వాతంత్ర, గణతంత్ర వేడుకలనైనా నిర్లక్ష్యం చేయకుండా జెండా వందనం జరిగేలా చూసుకోవాలిన మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతిని కాపాడే బాధ్యత అటవీశాఖదే..



మన తెలంగాణ / హైదరాబాద్ : పకృతిని నిత్యం కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించే గురుతర బాధ్యత ఆటవీశాఖపై ఉందని తెలంగాణ అట వీ సంరక్ష ణ ప్రధాన అధికారి ప్రశాంత్‌కు మార్ ఝా అన్నారు. ఆ దిశగా అటవీశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇతర శాఖలతో పోలిస్తే అటవీశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ బాధ్యతలు ప్రత్యేకంగా ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తతతో బాధ్యతలను నిర్వర్తించా లని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అటవీశాఖ కేంద్ర కార్యాలయం ఆరణ్య భవన్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి పిసిసిఎఫ్ పి.కె.ఝా మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనలో అటవీ శాఖ పాత్ర కీలకమన్నారు. తాజాగా పాలమూరు ప్రాజెక్టుకు తుది అనుమతులు సాధించిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దే ఉత్సాహంతో అటవీ సంపదను దోచుకుంటున్న దొంగల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో విధుల నిర్వహణలో అటవీ సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా మంచి పనితీరు కనబర్చిన సిబ్బంది ప్రశంసాపత్రాలతో పాటు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖకు సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య



మన తెలంగాణ/ఘట్‌కేసర్ : మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం. నగరంలోని ఓల్డ్ అల్వాల్‌కు చెందిన మల్లేష్(26), పార్వతి(40)లు గత కొన్ని రోజులుగా అన్నోజిగూడ రాజీవ్ గృహ కల్ప కాలనీలో బ్లాక్ నెంబర్ 78/4లో ఉండి సహజీవనం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారంలో ఉదయం వారు ఉంటున్న ఇంట్లో నుండి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా ఇద్దరు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతికి సంబంధించిన కారణాలు తెలియ రాలేవని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో నవవధువు మృతి

మనతెలంగాణ, సిటీబ్యూరో : విద్యుదాఘాతంతో నవ వధువు మృతిచెందిన సంఘటన నగరంలోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని కలాసీగూడకు చెందిన మనీషకు నాంపల్లికి చెందిన ఓ యువకుడితో ఈ నెల 22వ తేదీన వివాహం జరిగింది. తల్లిగారి ఇంటిలో నిద్ర చేసేందుకు రాగా స్నానం చేసేందుకు బాత్రూంలో హీటర్ వేసింది. స్విచ్ ఆఫ్ చేయకుండానే తీయడంతో హీటర్ మనీష నడుముకు తగలడంతో కిందపడిపోయింది. వెంటనే తల్లిదండ్రులు కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిందిA. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహంకాళి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయిలో ఆర్‌టిసికి మరింత గుర్తింపునకు కృషి చేయాలి : ఎండి



మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకున్న గుర్తింపును చాటుకోవడానికి మరింత కృషి చేయాల్సిన అవసరముందని రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, టిఎస్ ఆర్‌టిసి ఎండి సునీల్‌శర్మ తెలిపారు. ఇందుకు ఉద్యోగులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడు కల సందర్భంగా శనివారం బస్‌భవన్‌లో ఆయన మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌శర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలను భావి తరాల వారికి పదిలంగా అందించడంతో పాటు జాతి ఔసత్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశం ఎప్పుడు మరవలేని విధంగా అహింసా ద్వారా మహాత్మగాంధీ స్వాతంత్ర్యాన్ని తీసుసుకువస్తే పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌లాంటి త్యాగమూర్తుల జీవితాశయం, ఆలోచన విధానాలు నేటి తరానికి మరిం త స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాసేవే పరమావధిగా సేవలు అందిస్తున్న ఆర్‌టిసి పురోగతి కోసం ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. సమిష్టి కృషితో ప్రయాణికుల ఆదరణ ను పెంచుకునే దిశగా ప్రయత్నాలు మరింత ముమ్మరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు ఎ.పురుషోత్తం, కొమురయ్య, రవిందర్‌తో పాటు ఇతర అధికారులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ వైభోగమే..

- నాలుగున్నర లక్షలు దాటిన లబ్ధిదారులు
- షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులను ఆదుకున్న పథకం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల అవసరాల్లోంచి పుట్టుకొచ్చిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు ఇప్పటివరకు రాష్ట్రం మొత్తంమీద నాలుగున్నర లక్షల మంది లబ్ధిదారులకు చేరుకుంది. ముఖ్యమంత్రి మానస పుత్రికగా చెప్పుకునే కల్యాణలక్ష్మి పథకం ద్వారా షెడ్యూల్డు కులాలకు చెందిన సుమారు 1.04 లక్షల మంది యువతులు ప్రభుత్వం నుంచి వివాహం నిమిత్తం ఆర్థిక సాయం పొందారు. కేవలం షెడ్యూల్డు కులాల యువతలకే ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో దాదాపు రూ. 625 కోట్లను ఖర్చుచేసింది. ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో మొత్తం 6.12 లక్షల మంది వధువులు ఈ పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా సుమారు నాలుగున్నర లక్షల మందికి సాయం చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 4.41 లక్షల మందికి పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం చేసింది. ఇందులో గరిష్టంగా వెనకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారులే ఉన్నారు. ప్రభుత్వం దాదాపు మూడున్నర వేల కోట్ల రూపాయలను ఇందుకోసం ఖర్చు చేసింది. గతేడాది సెప్టెంబరు మొదలు డిసెంబరు వరకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ పథకం అమలులో కొంత జాప్యం జరిగినా ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్ళీ ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో వివిధ గ్రామాల్లోని యువతుల వివాహ సమస్యను దృష్టిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కల్యాణలక్ష్మి పేరుతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ముస్లిం యువతుల కోసం షాదీ ముబారక్‌ను ప్రవేశపెట్టారు. ఆడపిల్లల పెళ్ళి చేయడానికి తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బంది, సామాజిక సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వమే పెళ్ళి పెద్దగా ఆర్థికంగా ఆదుకునే ఉద్దేశంతో కెసిఆర్ ఈ పథకాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఎస్‌సి, ఎస్‌టి యువతులకు మాత్రమే వివాహం నిమిత్తం రూ. 51 వేలను ఆర్థిక సాయంగా అందించినా ఆ తర్వాత ఆచరణాత్మక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ సాయాన్ని రూ. 75 వేలకు పెంచడంతో పాటు వెనకబడిన తరగతుల యువతులకు సైతం లబ్ధి చేకూర్చేలా విస్తరింపజేశారు. ఆ తర్వాత ఆర్థిక సాయాన్ని గతేడాది నుంచి లక్షా నూట పదహారు రూపాయలకు పెంచడంతో పాటు అగ్రకులాల్లోని పేదలకు కూడా పెళ్లి కోసం ప్రభుత్వమే సాయం చేయాలన్న ఉద్దేశంతో ఇబిసిలకు కూడా వర్తింపజేశారు. ఆ విధంగా ఇప్పుడు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, ముస్లిం మైనారిటీలకు ఈ పథకాలు వర్తిస్తున్నాయి.

ఐదు వేల నుంచి లక్ష దాకా

కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తొలి నాళ్ళలో ఎస్‌సి యువతులు కవలం 5,412 మంది మాత్రమే 2014–15 ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,159 మందికి ఆ సంవత్సరమే ప్రభుత్వం రూ. 51 వేల చొప్పున ఆర్థిక సాయం చేసింది. ఆ తర్వాతి సంవత్సరం ఈ పథకం పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాన్ని గురించి తెలుసుకోవడంతో ఎస్‌సి యువతులు ఏకంగా 32,420 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 30,614 మందికి ఆ సంవత్సరమే ఆర్థిక సాయం అందించింది. ఆ విధంగా నాలుగున్నరేళ్ల వ్యవధిలో (2014 నుంచి 2018 డిసెంబరు వరకు) మొత్తం 1.32 లక్షల మంది ఎస్‌సి యువతులు దరఖాస్తు చేసుకోగా 1.05 లక్షల మందికి ఆర్థిక సాయం అందించింది. మరో రెండున్నర వేల దరఖాస్తులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. 2015 నుంచి ప్రతీ ఏటా ఎస్‌సి యువతులు సగటున 33 వేల మంది చొప్పున దరఖాస్తు చేసుకుంటున్నారు. ముస్లిం మైనారిటీ యువతులు సైతం ఈ నాలుగున్నరేళ్ళలో 1.43 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 1.07 లక్షల మందికి ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది. మరో నాలుగున్నరవేల మందికి అనుమతి మంజూరైనా ఆర్థిక సాయం త్వరలో అందనుంది. ఈ రెండు పథకాల అమలుద్వారా ఆడపిల్లల పెళ్ళి కోసం ఇబ్బంది పడే తల్లిదండ్రులకు చాలా ఉపశమనం కలుగుతోందని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.

లబ్ధిదారుల్లో బి.సి. యువతులే అధికం

పథకాన్ని ప్రారంభంలో ఎస్‌సి, ఎస్‌టి యువతుల కోసం ఉద్దేశించి ప్రభుత్వం అమలులోకి తెచ్చినప్పటికీ 2016 నుంచి బి.సి., ఇ.బి.సి. యువతులకు కూడా వర్తించే విధంగా విస్తరింపజేసింది. 2016లో కవలం 39,695 మంది బి.సి. యువతులు, 1,482 మంది ఇ.బి.సి. యువతులు మాత్రమే ఈ పథకం కింద పెళ్ళి కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందేలా దరఖాస్తు చేసుకోగా ఆ తర్వాతి సంవత్సరం ఏకంగా 95,937 (బిసి)కు, 11,781 (ఇబిసి)కు చేరుకుంది. ఆ రకంగా ఇప్పటివరకు మొత్తం 2.50 లక్షల మంది బి.సి. యువతులు, 19 వేల మంది ఇ.బి.సి. యువతులు దరఖాస్తు చేసుకోగా 1.65 లక్షల మంది బి.సి. యువతులు, పది వేల మంది ఇ.బి.సి. యువతులు ఆర్థిక సాయం అందుకున్నారు. మొత్తం లబ్ధిదారులను పరిశీలిస్తే...

కులాలు	లబ్ధిదారులు
ఎస్‌సి	1,04,931
ఎస్‌టి	63,353
బిసి	1,65,943
ఇబిసి	10,091
మైనారిటీలు	1,07,298



గెలుపు, ఓటములు కొత్తకాదు

- పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మాదే : ఉత్తమ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం తథ్యమని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. శనివారం గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి గెలుపు, ఓటమలు కొత్త కాదన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించాల్సిందేనన్నారు. ఎక్కడ పొగొట్టుకుంటామో....అక్కడే వెతుక్కోవాలి అన్న సామెతను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ఓడిన చోటనే తిరిగి విజయం సాధించాల్సిన అవసరముందన్నారు. వందేళ్ళపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి గెలుపు, ఓటమిలాంటి ఎత్తుపల్లాలను ఎన్నో చూసిందన్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల సమయం శరవేగంగా వస్తోందని, అందుకు తగ్గట్టుగా పార్టీ నేతలు కూడా పనిచేయాల్సిన అవరసముందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీని రాహుల్‌గాంధీ పట్టాలెక్కిస్తున్నారని, ఆయనకు తోడుగా ఇప్పుడు ప్రియాంక గాంధీ కూడా తోడయ్యారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పదిహేను పార్లమెంట్ స్థానాల్లో కనీసం పదికిపైగా గెలుచుకుని రాహుల్‌గాంధీకి కానుకగా ఇద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో పోరాటం చేసి నిర్మించిన ప్రజాస్వామ్య సంస్థలను ప్రస్తుతం కాపాడుకోవాల్సిన దుస్థితి తలెత్తిందని విమర్శించారు. ఇందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే ప్రధాన కారణమన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో స్వయం ప్రతిపత్తి గల సంస్థలను కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్‌ఎస్ పార్టీలు మంటగలిపాయన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం అన్నది ఏ ఒక రాజకీయ పార్టీకి శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని ఉత్తమ్డ్ హెచ్చరించారు.



జాతీయ గీతం ప్రతిపౌరుడిలో ప్రేమను పెంచుతుంది : వి.హెచ్

జాతీయగీతం ప్రతి పౌరుడిలో దేశంపై ప్రేమను పెంచుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. భావితరాలకు జాతీయగీతం రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి మహోన్నత వ్యక్తి గురించి తెలియాల్సిన అవసరముందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొన్ని లక్షల మంది ఓట్లు గల్లంతు అయినప్పటికీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరి రక్షించాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరగకుండా, ఓటర్లను ప్రలోభ పెట్టకుండా తగు చర్యలు తీసుకున్నప్పుడే నిజమైన తీర్పు వెలువడుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్ ప్రజల పక్షాన కాకుండా దురుదృష్టవసాత్తు కెసిఆర్‌కు భజన చేసే కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారని వ్యాఖ్యానించారు. ఇది మంచి పరిణామం కాదన్నారు.

దేశం కోసం త్యాగాలు చేసిన వారికి రెడ్ సెల్యూట్ చేయాలి : సురవరం

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశం కోసం త్యాగాలు చేసిన వారికి రెడ్ సెల్యూట్ చేస్తూ మరిన్ని ఉద్యమాలు చేయాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం గణతంత్ర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సురవరం సుధాకర్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఇతర సిపిఐ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు పేదలకు చేరడం లేదన్నారు. మానవ అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని ఆయన పేర్కొన్నారు. 2019 సంవత్సరంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తారని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చట్టసభలకు నూటికి 70 శాతం కార్పొరేట్‌లు వెళుతున్నారన్నారు. ప్రజల హక్కులు కాలరాస్తున్నారన్నారు. రాజ్యంగ పరిరక్షణకు, సెక్యులరిజం కాపాడటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు.

పెద్దపులి గోళ్ల స్వాధీనం

చెట్ల పొదల్లో కనుగొన్న పోలీసులు



మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : రాష్ట్రంలోనే సంచలం సృష్టించిన పెద్దపులి చర్మం కేసులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అటవీ అధికారుల ఆపరేషన్ సక్సెస్ కాగా శనివారం పెద్దపులి గోర్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు పులి గోర్లను సైతం కనుగొన్నారు. రామగుండం కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిఐ సాగర్ తన సిబ్బందితో పాటు అటవీశాఖ అధికారులతో సంయుక్తంగా దర్యాప్తును కొనసాగించి పెద్దపులిని హతమార్చిన ప్రాంతానికి వెళ్లి కళేబరానికి చెందిన అవయవాలను సేకరించారు. అంతేకాకుండా కళేబరానికి చెందిన కొని అవయవాలను అటవీ అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అత్యంత కీలకంగా మారిని కేసులో ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి బాబాన్ కూడా శనివారం సంఘటన స్థలానికి చేరుకొని పులి మృత్యువాత పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కీలకమైన పులిని హతమార్చిన ప్రాంతానికి రెండు కిలోమీర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో పులిగోర్లను కూడా స్వాధీనం పర్చుకున్నారు.పులికి చెందిన అన్ని అవయవాలు లభ్యం కావడంతో నిందితులను సైతం అదుపులోకి తీసుకొని కేసు విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్‌కమీషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడే వేటగాళ్లపై పీడియాక్టును ప్రయోగిస్తున్నామన్నారు. అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్‌లో అడవుల్లోకి స్మగ్లర్లు వెళ్లాలంటేనే భయబ్రాంతులకు గురయ్యే విధంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. సిపి వెంట ఎఫ్‌డిఓ వెంకటరమణరావును, ఎఫ్‌డిఐ రామలింగయ్య, ఎఫ్ఆర్ఓ మానయ్య, తదితరులు ఉన్నారు.

రెండు వారాల్లో 8 మందిపై వేటు

- నలుగురు అధికారుల అరెస్టు
- తాజాగా నిజామాబాద్‌లో ముగ్గురిపై వేటు
- అటవీశాఖ దాడులు, తనిఖీలు ముమ్మరం

మన తెలంగాణ / హైదరాబాద్ : అటవీశాఖ అధికారుల నిర్వక్ష్యంపై సస్పెషన్ల పరంపర కొనసాగుతూనే ఉంది. విధుల నిర్లక్ష్యం వహించడంతో పాటు అక్రమ కలప రవాణాతో పాటు వ్యాపారులకు సహకరిస్తున్న ఇప్పటి వరకు ఎనిమిది అధికారులపై చర్యలు చేపట్టాలరు. ఇందులో తాజాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికారులను విధుల నుంచి తప్పించారు. తొలిసారిగా డివిజనల్ స్థాయి అధికారిపై వేటు వేయడం మొదటిసారని అటవీశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. కలప స్మగ్లింగ్ ర్యాకేట్‌కు సంబంధించి కేసును ఛేధించిన పోలీసులు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఎనిమిది మందిపై వేటు వేశారు. అటవీ నేరాలకు పాల్పడుతూ అటవీ సంపదను దోచుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా అటవీ నేరాలపై పాల్పడే వారు ఏ స్థాయిలో ఉన్న సహించలేదని హెచ్చరించారు. అటవీ అధికారులతో పాటు పోలీసులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన కూడా చర్యలు తప్పవన్నారు. దీనికి స్పందించి అటవీశాఖ ఈ మేరకు చర్యలు తీసుకుంది. సిఎం ఆదేశాల మేరకు అటవీశాఖ దాడులు, తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు శాఖాపరంగా విధుల్లో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఎనిమిది అధికారులను విధుల నుంచి తప్పించి నలుగురిని అరెస్టుకు గురైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. అధికారుల కథనం మేరకు.. ఆదిలాబాద్‌లోని అటవీ ప్రాంతంలో కొందరు కలప స్మగ్లర్లు నిజామాబాద్ జిల్లాలోని నాలుగు సా మిల్లులకు రవాణా చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై నిఘా వేసిన పోలీసులు అక్రమంగా కలపను రవాణా చేస్తున్న వాహనాలతో పాటు ఆరుగురు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇందులో పోలీసులు, అటవీ సిబ్బందితో పాటు నిజామాబాద్ డిప్యూటి మేయర్ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసుల విచారణ వెల్లడైంది. ఈ స్మగ్లింగ్‌కు సంబంధించిన సమాచారం నిజామాబాద్ అటవీశాఖ అధికారులకు గత ఏడాది మే నెలలోనే సమాచారమందింది. అయినా సదరు అధికారులు విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. తాజాగా చేపట్టిన విచారణలో ఆదిలాబాద్ జిల్లాలో నరికివేతకు గురవు తున్న కలపను పూర్తిగా నిజామాబాద్ జిల్లాలోని సా మిల్లులకు చేరవేస్తున్నారని, ఈ విషయంలో స్థానిక అటవీ శాఖ అధికారుల దృష్టికి కూడా వెళ్లిందని పోలీసులు విచారణలో స్పష్టమైనట్లు తేలింది. సంబంధిత అధికారులు అప్పుడే స్పందించి ఉంటే ఇంతకాలం అటవీ సంపదపై జరిగిన దోపిడిని ఆరికట్టి ఉండే అవకాశముందని వెల్లడించారు. మొత్తం సంఘటనపై విచారణ చేపట్టిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఘనటకు నిజామాబాద్‌లో పనిచేస్తున్న ముగ్గురిపై వేటు వేశారు. ఈ విషయాన్ని అటవీ శాఖ ఉన్నతాధికారులు గురువారం వెల్లడించారు. ఇందులో నిజామాబాద్ జిల్లా ఫారెస్టు డివిజనల్ అధికారి టి. వేణుబాబు, ఫారెస్టు రేంజ్ అధికారి బి.రాంమోహన్, డిప్యూటి రేంజ్ అధికారి. శ్రీనివాస్‌లను విధుల నుంచి తప్పించారు.

సర్పంచ్ ఫలితంపై ఫైట్



మన తెలంగాణ/ముస్తాబాద్ : ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీకి రెండవ విడత గ్రామ పోరులో నిన్న వచ్చిన ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ధర్నా చేపట్టారు. సర్పంచ్ అభ్యర్థి యొక్క ఫ్లెక్సీలను తొలగించి తగలబెట్టారు.పెద్ద ఎతున నిరసన తెలిపారు. బరిలో 12 మంది అభ్యర్థులు ఉండగా కొబ్బరికాయ గుర్తుకు చెందిన అభ్యర్థి గెలిచారని ప్రకటించిన అధికారులు కొద్దిసేపటికే బ్యాట్ గుర్తుకి చెందిన టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. అని ప్రకటించారు. దీంతో మిగతా అభ్యర్థులు తీవ్ర ఆగ్రహంతో రోడ్డుపై బైటాయించారు.ఒక అభ్యర్థి గెలిచాడని ప్రకటించి మళ్లీ ఇంకో అభ్యర్థిని విజేతగా ప్రకటించడం అధికారుల అవినీతికి అద్దం పట్టేలా ఉందని అన్నారు.వెంటనే మళ్లీ రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు.లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'మణికర్ణిక'లో తన అద్భుతమైన నటనతో కంగనారనౌత్ నన్ను ఎంతో మెప్పించింది. ఇంత ప్రతిభను నేను చివరిసారిగా బ్రూస్‌లీ 'ఎంటర్ ది డ్రాగన్'లో చూశాను. కంగనతో యాక్షన్ హీరోలను పోలిస్తే వారంతా హీరోయిన్లలా కనిపిస్తున్నారు.

– ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

ఆ కండిషన్‌తోనే చర్చలు


ప్రభాస్

బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ 'బాహుబలి' తర్వాత ఎవరికీ అంత సులభంగా అందలేనంత ఎత్తుకు చేరుకున్న ప్రభాస్ నెక్ట్స్ సినిమా కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత అతని తదుపరి చిత్రం 'సాహో' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 200 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై అంచనాలు మామూలుగా లేవు. అయితే దీని నిర్మాణ సంస్థ యువితో ప్రభాస్‌కున్న సత్సంబంధాలు అందరికీ తెలిసిందే. తన ప్రాణ స్నేహితులు సారథులుగా ఉన్న ఈ నిర్మాణ సంస్థలో ప్రభాస్‌కు కూడా పార్టనర్‌షిప్ ఉందనే టాక్ ఎప్పటినుంచో ఉంది. అందుకే తన బెస్ట్ ఫ్రెండ్స్ అయిన గోపీచంద్‌కు 'జిల్', శర్వానంద్‌కు 'రన్ రాజా రాన్' చిత్రాలను అదే బ్యానర్‌లో తీయించి వారికి మంచి బ్రేక్ వచ్చేలా చేశారు. అందుకే యువి అంటే ప్రభాస్ హోం బ్యానర్‌లాగే ఫీలవుతారు అభిమానులు. ఇదిలా ఉండగా 'బాహుబలి' తర్వాత తనతో నిర్మించే ఏ సినిమాకైనా యువి క్రియేషన్స్‌తో భాగస్వామ్యం ఉండాలన్న కండిషన్ మీదే తన దగ్గరకు వచ్చిన దర్శకనిర్మాతలతో ఈ స్టార్ హీరో చర్చలు జరుపుతున్నారట. 'సాహో' తర్వాత రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు పెదనాన్న కృష్ణంరాజు బ్యానర్ గోపీకృష్ణ మూవీస్‌తో పాటు యువిని కూడా పార్టనర్‌గా చేర్చిన సంగతి తెలిసిందే.

మార్చి నుండి సెట్స్‌పైకి..


Sharwanand


Samantha

సంక్రాంతికి 'ఎఫ్ 2' చిత్రంతో బిగ్గెస్ట్ హిట్‌ను అందుకున్నారు నిర్మాత దిల్ రాజు. ఈ అగ్ర నిర్మాత శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో 34వ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శర్వానంద్, సమంత హీరోహీరోయిన్లుగా ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. తమిళంలో విజయ్ సేతుపతి, త్రిష నటించి ఘన విజయం సాధించిన చిత్రం '96'కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. '96' చిత్రాన్ని డైరెక్ట్ చేసిన సి.ప్రేమకుమార్ ఈ తెలుగు రీమేక్‌ను కూడా తెరకెక్కించబోతున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. మార్చి నుండి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సినిమాలో నటించబోయే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.

'డిస్కో రాజా'గా మాస్ మహారాజా


రవితేజ

మాస్ మహారాజా రవితేజ మరో పవర్‌ఫుల్ మాస్ అండ్ క్లాస్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ వి.ఐ.ఆనంద్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. రవితేజ ఎనర్జీకి సరిపోయే విధంగా ఈ సినిమాకు 'డిస్కో రాజా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రిపబ్లిక్ డేతో పాటు రవితేజ పుట్టిన రోజు సందర్భంగా సినిమా టైటిల్ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ "రవితేజతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం చాలా ఆనందంగా ఉంది. వినూత్నమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో మా బ్యానర్ ఎల్లప్పుడూ ముందు ఉంటుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వి.ఐ.ఆనంద్ చెప్పిన కథ అద్భుతంగా ఉండడంతో ఓకే చేసి ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నాం. రవితేజ ఇప్పటివరకు టచ్ చేయని జానర్‌లో ఈ సినిమా తెరకెక్కనుంది. ఓ వినూత్నమైన అంశాన్ని ఈ సినిమా కథాంశంగా తీసుకున్నాం. మా బ్యానర్ విలువను మరింత పెంచే విధంగా ఈ చిత్రాన్ని భారీగా నిర్మించబోతున్నాం. హైదరాబాద్‌తో పాటు గోవా, చెన్నై, లడఖ్, మనాలీతో పాటు ఉత్తర భారతదేశంలోని కొన్ని చోట్ల ఈ సినిమాను చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నాం. అటు మాస్ ఇటు క్లాస్‌ను ఆకట్టుకునే రీతిలో ఈ సినిమాకు 'డిస్కో రాజా' అనే టైటిల్‌ను ఖరారు చేశాము. దర్శకుడు వి.ఐ.ఆనంద్‌తో కలిసి టాలీవుడ్‌లో ఉన్న బెస్ట్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. థమన్ స్వరాలు అందించబోతున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ముగ్గురు హీరోయిన్లు ఈ సినిమాలో రవితేజ సరసన నటించనున్నారు. ప్రముఖ నటుడు బాబీ సింహా ఈ సినిమాలో ప్రతి నాయకుడిగా నటించబోతున్నారు. కమేడియన్స్ వెన్నెల కిషోర్, సత్య తదితరులు కీలక పాత్రలను పోషించబోతున్నారు. త్వరలోనే తొలి షెడ్యూల్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం"అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సాయి శ్రీరామ్, ఎడిటర్: నవీన్ నూలి.

మెగా మూవీలో హీరోయిన్లుగా..?


తమన్నా


నయనతార

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా చేస్తున్న 151వ సినిమా 'సైరా...నరసింహారెడ్డి' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా సెట్స్‌లో ఉండగానే మెగాస్టార్ 152వ సినిమా కొణిదెల ప్రొడక్షన్స్‌లోనే ఉంటుందని రామ్‌చరణ్ తెలియజేశారు. వరుస విజయాలతో దూకుడు మీదున్న కొరటాల శివ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని ఆయన ప్రకటించారు. మెగాస్టార్ స్టార్‌డమ్‌కు తగ్గట్టే ఈసారి కథను ఎంచుకున్నారు. వర్తమాన రాజకీయాలు, రైతు సమస్యల నేపథ్యంలో కథాంశం ఉంటుందని తెలిసింది. ప్రస్తుతం చిరంజీవి సరసన నటించే భామల కోసం కొరటాల చాలా సీరియస్‌గా కసరత్తు చేస్తున్నారట. ఇప్పటికే నయనతార, తమన్నా వంటి సీనియర్ భామలతో ఆయన మంతనాలు సాగిస్తున్నారని ప్రచారమవుతోంది. తమన్నా ఈ సినిమాలో నటించేందుకు ఎంతో ఆసక్తిగా ఉంది. అయితే నయనతార మాత్రం కాల్షీట్లను సర్దుబాటు చేయాల్సి ఉందని తెలిసింది. నయన్ ఇప్పటికే చిరు సరసన 'సైరా' చిత్రంలో నటిస్తోంది. అటు తమిళంలోనూ పలు భారీ ప్రాజెక్టులు చేస్తోంది. ఆమె బిజీ కావడంతో కాల్షీట్లను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు బాలీవుడ్ హీరోయిన్‌లతో కూడా రామ్‌చరణ్ టచ్‌లో ఉన్నారట. తమన్నా, నయనతారలు ఫైనల్ కాకుంటే బాలీవుడ్ హీరోయిన్లను తీసుకోవాలని ఆయన భావిస్తున్నారట.


బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్ అగర్వాల్

ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్ అగర్వాల్ జంటగా నటిస్తున్న 'సీత' చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు ఇద్దరు ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్‌తో కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఇక బెల్లంకొండ శ్రీనివాస్‌తో కాజల్ వరుసగా రెండో సినిమా చేస్తుండగా... దర్శకుడు తేజ 'నేనే రాజు నేనే మంత్రి' వంటి సూపర్ హిట్ సినిమా తర్వాత వైవిధ్యమైన కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ సినిమాలో సోనూ సూద్, మన్నారా చోప్రాలు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రానికి శీర్ష రాయ్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్: కనల్ కన్నన్.


4 లెటర్స్' టీజర్‌ను విడుదల చేస్తున్న కె.రాఘవేంద్రరావు. చిత్రంలో ఈశ్వర్, ఆర్.రఘురాజ్ తదితరులు

యువత మనోభావాలకు అద్దంపట్టేలా..

ఓం శ్రీచక్ర క్రియేషన్స్ బ్యానర్ ప్రొడక్షన్ నం.1గా రూపొందుతున్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్లకు అర్థమవుతుందిలే' అన్నది ఉపశీర్షిక. ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యువతీ యువకుల మనోభావాలకు అద్దంపట్టేలా తెరకెక్కిస్తున్న చిత్రమిది. హీరో ఈశ్వర్‌కు ఇది తొలి చిత్రమైనా చక్కగా నటించాడు. నిర్మాత ఉదయ్‌కుమార్, దర్శకుడు రఘురాజ్‌లు ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకోవాలి"అని అన్నారు. చిత్ర నిర్మాతలు దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ "కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రమిది. ఈనెల 30న సినిమా ఆడియోను, ఫిబ్రవరి 2వ వారంలో చిత్రాన్ని విడుదల చేస్తాం"అని తెలిపారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ "ప్రేమ, పెళ్లి విషయాలలో నేటి యువతరం ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా ఉన్నాయని చెప్పే చిత్రమిది. హైదరాబాద్‌లో టాకీ పార్ట్‌ను, బ్యాంకాక్‌లో సాంగ్స్‌ను చిత్రీకరించాం"అని పేర్కొన్నారు. కౌసల్య, అన్నపూర్ణ, సుధ, సత్యకృష్ణ, విద్యుల్లేఖ రామన్, సురేష్, పోసాని కృష్ణమురళి, కృష్ణభగవాన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చిట్టిబాబు, మ్యూజిక్: భీమ్స్ సిసిరోలియో, ఆర్ట్: వర్మ, కొరియోగ్రఫీ: గణేష్, పాటలు: సురేశ్ ఉపాధ్యాయ.

సన్నీ ఐటమ్‌సాంగ్ వివాదం


సన్నీలియాన్

సన్నీలియాన్ అనగానే హాట్ హాట్ పోజులు... ఘాటు ఘాటు వీడియోలు గుర్తుకువస్తాయి. ఇంటర్నెట్‌లో 'మోస్ట్ సెర్చ్ సెలబ్రిటీ'గా ఈ భామ పలు సార్లు నిలిచింది. బాలీవుడ్‌లో పలు శృంగార చిత్రాల్లో నటించిన ఈ భామ క్రేజీ స్టార్‌గా దూసుకుపోతోంది. ఇటీవల ఈ హాట్ బ్యూటీ తనను చీటింగ్ చేసిందని బాలీవుడ్ నిర్మాత భరత్ పటేల్ వాపోతున్నాడు. ఈ భరత్ పటేల్ హిందీలో 'పటేల్‌కి పంజాబీ షాది' అనే సినిమాను నిర్మించాడు. ఈ సినిమాలో ఓ ఐటమ్‌సాంగ్ కోసం సన్నీలియాన్‌తో రూ.40 లక్షలకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నాడు. అందులో రూ.5 లక్షలను అడ్వాన్స్ కూడా ముట్టజెప్పాడట. కానీ సన్నీ మాత్రం తన సినిమాలో స్పెషల్ సాంగ్ చేయలేదని వాపోతున్నాడు. తన అడ్వాన్స్ తిరిగి ఇచ్చేయమని సన్నీని అడిగితే ఆమె పట్టించుకోవడం లేదని భరత్ చెప్పాడు. సన్నీలియాన్ తనను మోసం చేసిందని ఈ నిర్మాత ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాడు. ఈ విషయమై భరత్ పటేల్ కోర్టును ఆశ్రయించాడట. అయితే ఆ పాట కోసం డేట్లు ఇచ్చినా... షూటింగ్ డేట్లను వెనుకకు, ముందుకు మార్చి ఫిల్మ్‌మేకర్స్ సమయాన్ని వృథా చేసుకున్నారని, తన తప్పేమీ లేదని అంటోంది సన్నీలియాన్.

పాడుతూ హంగామా చేసింది


శృతిహాసన్

కొంతకాలం క్రితం వరకు శృతిహాసన్ అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ప్రస్తుతం ఈ భామకు అవకాశాలు తగ్గాయి. అయితే శృతిహాసన్ ప్రస్తుతం సింగింగ్ కెరీర్‌పై దృష్టిపెట్టింది. సింగింగ్ అంటే సినిమాలకు పాడే సింగర్‌గా కాదు. ఇంటర్నేషనల్ రాక్‌స్టార్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని శృతికి చిన్నప్పటి నుంచి ఓ కోరిక ఉంది. అది ఇప్పుడు తీరబోతోంది. శృతిహాసన్ 2016 నుండి సినిమాలలో నటించడం తగ్గించేసింది. బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సలేతో చెట్టాపట్టాలేసుకొని లండన్‌లో ఎంజాయ్ చేస్తోంది. అప్పుడప్పుడు మైఖేల్‌తో ఇండియాలో కూడా దర్శనమిస్తోంది. అయితే శృతి ఊరికే టైమ్‌పాస్ చేసేందుకు లండన్‌లో ఉండడం లేదు. అక్కడ తన సింగింగ్ కెరీర్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా ఈ భామ లండన్‌లో లైవ్ మ్యూజిక్‌కు కేరాఫ్ అడ్రస్‌లాంటి ట్రూబడోర్ కాఫీ షాప్‌లో మొదటిసారి తన సంగీత ప్రదర్శన ఇచ్చింది. నిజంగా రాక్‌స్టార్ లాగా గిటార్ వాయిస్తూ పాట పాడుతూ శృతి హంగామా చేసింది. ఆమె సంగీత ప్రదర్శనకు మంచి స్పందన వచ్చిందట.

ఆ పోస్టుల వల్ల మా చిత్రం నష్టపోయింది


నట్టికుమార్

తాను నిర్మించిన 'ముద్ర' సినిమాను చూడొద్దంటూ హీరో నిఖిల్ సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న పోస్టులను నిర్మాత నట్టికుమార్ తప్పుబట్టారు. నిఖిల్ ఈవిధంగా ప్రవర్తించి తనను అవమానించాడని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో నట్టికుమార్ మాట్లాడుతూ "నిఖిల్ చేస్తున్న ఓ సినిమాకు 'ముద్ర' అనే టైటిల్‌ను పెట్టాలనుకున్నప్పటికీ అది మా దగ్గర ఉండడంతో మరో టైటిల్ కోసం వారు అన్వేషణలో పడ్డారు. అయితే మా 'ముద్ర' సినిమా విషయంలో నిఖిల్ చేసిన పోస్టుల వల్ల మా చిత్రం ఆర్థికంగా నష్టపోయింది. ఆ నష్టాన్ని అతను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. నేను నిర్మించిన 'ముద్ర' సినిమాను ఎలాంటి ప్రచారం లేకుండా ఇటీవల విడుదల చేశాను. మా సినిమా టైటిల్ తెలుగు సినిమా వాణిజ్య మండలిలో నమోదైంది. మా చిత్రంతో ఏదైనా సమస్య ఉండే నిఖిల్ చేస్తున్న సినిమా నిర్మాతలు నాతో మాట్లాడాలి. ఇక మా చిత్రానికి జరిగిన నష్టాన్ని నిర్మాతల మండలి దృష్టికి తీసుకెళ్తాం"అని అన్నారు.

కోలీవుడ్‌లో జోరు చూపిస్తోంది


రాశీఖన్నా

'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ రాశీఖన్నా ఆతర్వాత తెలుగులో కొన్ని మంచి సినిమాలు చేసింది. తన తొలి సినిమాతోనే మంచి హిట్‌ను అందుకుంది ఈ భామ. ఇక వరుణ్‌తేజ్‌తో కలిసి నటించిన 'తొలిప్రేమ' చిత్రం రాశీఖన్నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. గత ఏడాది దిల్‌రాజు బ్యానర్‌లో నితిన్‌కు జోడీగా ఈ భామ నటించిన 'శ్రీనివాస కళ్యాణం' నిరాశపరిచింది. ఇక ప్రస్తుతం రాశీఖన్నా కోలీవుడ్‌లో జోరు చూపిస్తోంది. అక్కడ వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇక 'ఇమైక్కా నోడిగల్' అనే ఓ థ్రిల్లర్ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది రాశీఖన్నా. ఈ సినిమాలో నయనతార కీలక పాత్ర పోషించింది. అధర్వ హీరోగా నటించాడు. ఆతర్వాత అక్కడ వరుసగా ఆఫర్లు దక్కించుకుంటున్న రాశీఖన్నా 'టెంపర్' తమిళ్ రీమేక్‌లో విశాల్ సరసన నటించే ఛాన్స్ కొట్టేసింది. తాజాగా కోలీవుడ్ స్టార్ విజయ్ సేతుపతితో ఆన్‌స్క్రీన్ రొమాన్స్‌కు ఈ భామ సిద్ధమైంది. విజయ్‌చందర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. విజయా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

హైదరాబాద్ జోన్

నెక్, చికెన్ ధరలు రూపాయల్లో	
టోకు గుడ్లు	రూ. 402
రిటైల్ గుడ్లు	రూ. 4.60
ఫారమ్ కోడి	రూ. 79
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 146
స్కిన్‌లెస్	రూ. 167

భారీ నష్టాలు మూటగట్టుకున్న మార్కెట్లు

- నిరాశపరిచిన మారుతి ఫలితాలు
- కుప్పకూలిన జీ గ్రూపు షేర్లు

న్యూఢిల్లీ : గత వారం దేశీయ స్టాక్‌మార్కెట్లకు కలిసి రాలేదనే చెప్పాలి. దేశీయ కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉంటున్న నేపథ్యంలో వారం ప్రారంభంలో రెండు రోజులు లాభాలతో ముగిసిన మార్కెట్లు ఆ తర్వాతినుంచి నష్టాలను చవిచూడడం మొదలైంది. ఆర్థిక మందగమనంపై అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం దేశీయ మార్కెట్లు భారీగానే నష్టాల చవి చూశాయి. అమెరికా, చైనా మధ్య ఆర్థిక వివాదం, బ్రెగ్జిట్‌పై అస్పష్టత, చైనా ఆర్థిక మందగమనం వంటి అంశాలు సూచీలపై ప్రభావం చూపించాయి. ఫలితంగా సెన్సెక్స్156 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 51 పాయింట్లు కోల్పో యింది. వారం చివర్లో గురు, శుక్రవారాల్లో ప్రధాన సూచీలు భారీగా నష్టపోయాయి. శుక్రవారం మీడియా సెక్టార్‌తో పాటుగా ఆటోమొబైల్, మెటల్, రియల్టీ రంగాల షేర్ల పతనం కారణంగా ప్రధాన సూచీలు భారీగా నష్టపోయాయి. ప్రధానంగా శుక్రవారం మిడ్‌సెషన్‌లో జీ ఎంటర్‌టైన్‌మెంట్ కౌంటర్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీనికి తోడు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకి ఫలితాలు నిరాశాజనకంగా ఉండడం, రియల్టీ దిగ్గజం డిఎల్ఎఫ్ సంస్థల్లో పోదాలు లాంటివి అమ్మకాలపై ప్రభావం చూపించాయి. ఫలితంగా సెన్సెక్స్ 170 పాయంట్లు నష్టపోయి 36,025 పాయింట్ల వద్ద ముగియగా, నిఫ్టీ 69 పాయింట్లు నష్టపోయి10.780 పాయింట్ల వద్ద ముగిసింది. మొత్తంమీద గత వారంలో సెన్సెక్స్361, నిఫ్టీ 126 పాయింట్ల చొప్పున నష్టాలు చవి చూశాయి.





రాణించిన ఎల్అండ్‌టి

ఎల్అండ్‌టి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2042 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.1490 కోట్లతో పోలిస్తే ఇది 37 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం 24 శాతం పెరిగి రూ.35,709 కోట్లకు చేరుకుంది. అయితే ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించినప్పటికీ ఆ రోజు కంపెనీ షేరు నష్టపోవడం గమనార్హం.



మారుతీ సుజుకీకి కలిసి రాలేదు

దేశీయ వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకి మరోసారి నిరాశపరిచింది. వరసగా రెండో త్రైమాసికంలోను నికర లాభంలో క్షీణత నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.1,489.3 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,799 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 17.21 శాతం తక్కువ కావడం గమనార్హం. గత అయిదేళ్ల కాలంతో ఒక త్రైమాసికంలో కంపెనీ ఈ స్థాయితో తక్కువ లాభాలు నమోదు చేయడం ఇదే మొదటిసారి. పండగల సీజన్‌లో అమ్మకాలు అంచనాలకన్నా తక్కువ ఉండడం, అధిక ముడివస్తువుల ధరలు, ప్రతికూల విదేశీ మారక ధరలు లాభాలపై ప్రభావం చూపించినట్లు మారుతి సుజుకి తెలిపింది.అయితే మొత్త ఆదాయం 5.41 శాతం వృద్ధితో రూ.20,585.60 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ తెలిపింది.

నిరాశపరిచిన ఇండియన్ బ్యాంక్

ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ నిరాశాజనకమైన ఫలితాలను ప్రకటించింది. మూడో త్రైమాసికంలో బ్యాంక్ రూ.152.26 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన నికర లాభం రూ.303.06 కోట్లతో పోలిస్తే ఇది 50 శాతం తక్కువ. అయితే మొత్త ఆదాయం రూ.4,093.07 కోట్లనుంచి పెరిగి రూ.5.269.10 కోట్లకు పెరిగింది. అయితే మొత్త రుణాల్లో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎలు)6.27 శాతంనుంచి 7.46 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎలు కూడా 3.30 శాతంనుంచి 4.42 శాతానికి పెరిగాయి. దీంతో మొండి బకాయిలకు కేటాయింపులు కూడా పెంచాల్సి వచ్చింది.



మళ్లీ హెచ్–1బి వీసా ప్రీమియం ప్రాసెసింగ్

ప్రకటించిన అమెరికా

వాషింగ్టన్ : హెచ్–1బి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్లు అమెరికా శుక్రవారం ప్రకటించింది.అన్ని కోటాల్లోను వీసా దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్‌ను సోమవారంనుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను పూర్తి చేయడం కోసం అమెరికా గతంలో హెచ్–1 బి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపివేసింది.'2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హెచ్–1 బి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను జనవరి 28నుంచి పునరుద్ధరిస్తున్నాం. మాస్టర్స్ కోటాలో ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తులతో పాటుగా రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఇ) అందిన వారు తమ స్పందనను కూడా జతచేర్చి దరఖాస్తు చేసుకోవాలి' అని యుఎస్‌సిఐఎస్ వెల్లడించింది. ఈ ప్రీమియం ప్రాసెసింగ్‌ద్వారా కంపెనీలు, దరఖాస్తుదారులు వేసిన పిటిషన్లను త్వరగా పరిశీలిస్తారు.15 రోజుల్లో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. ఇందుకోసం అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.అయితే ఇది కేవలం దరఖాస్తుల త్వరగా పరిశీలించడం మాత్రమే. వీసా జారీకి ఉపయోగపడదు. అమెరికా ఏటా 85 వేల హెచ్–1బి వీసాలను జారీ చేస్తోంది. అక్కడి కంపెనీలు ఈ వీసాల ద్వారా విదేశీయులను నియమించుకుంటాయి.హెచ్–1బి వీసాలను పొందే వారిలో ఎక్కువ మంది భారతీయులే కావడం గమనార్హం.అయితే డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటినుంచి ఈ వీసాలో మార్పులు తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. నిబంధనలను కఠినతరం చేసి ప్రతిభావంతులకే అవకాశం ఇవ్వాలని అంటున్నారు. ఈ క్రమంలోనే హెచ్–1బి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపి వేయగా, ఇప్పుడు పునరుద్ధరించారు.

ఎయిరిండియాకు రూ.1500 కోట్లు

వచ్చే వారం విడుదల చేయనున్న కేంద్రం


న్యూఢిల్లీ : నష్టాల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ అయిన ఎయిర్ ఇండియాను ఆదుకునే పథకంలో భాగంగా ప్రభుత్వం వచ్చే వారం రూ.1500 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఎయిర్ ఇండియాకు మూలధనాన్ని సమకూర్చే పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.2,345 కోట్ల అనుబంధ గ్రాంటును ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ మొత్తంలో భాగంగానే వచ్చే వారం రూ.1500 కోట్లు విడుదల చేయనున్నట్లు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కాగా త్వరలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న దృష్ట్యా ఎయిర్ ఇండియాకు మరిన్ని నిధులను మీ శాఖ కోరిందా అని అడగ్గా లేదని ఆ అధికారి చెప్పారు.



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.99
యూరో	80.36
బ్రిటిష్ పౌండ్	93.14
ఆస్ట్రేలియన్ డాలర్	50.44
కెనెడియన్ డాలర్	53.27
సింగపూర్ డాలర్	52.23
స్విస్ ఫ్రాంక్	71.32
చైనీస్ యువాన్	10.48
మలేషియన్ రింగిట్	17.16
న్యూజిలాండ్ డాలర్	48.06
హాంకాంగ్ డాలర్	9.05
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.95
సౌతాఫ్రికన్ రాండ్	5.18

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30920	33069.52	0.1%
ముంబై	31720	33925.13	0%
ఢిల్లీ	31550	33743.32	0%
కోల్‌కతా	31850	34064.17	0.03%
కేరళ	30100	32192.51	0%
బెంగళూరు	30320	32427.81	0.07%
హైదరాబాద్	30920	33069.52	0.1%
గల్ఫ్	136.28	145.75	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42242.00
ముంబై	₹ 42242.00
ఢిల్లీ	₹ 42242.00
కోల్‌కతా	₹ 42242.00
హైదరాబాద్	₹ 42242.00



సదరన్ ట్రావెల్స్

హాలిడే బజార్లకు విశేష స్పందన

- అధిక సంఖ్యలో సందర్శించిన పర్యాటకులు
- అనుకూలమైన టూర్ వివరాలను తెలుసుకున్న ప్రజలు



మన తెలంగాణ / హైదరాబాద్ : సదరన్ ట్రావెల్స్ శనివారం ఏర్పాటు చేసిన హాలిడే బజార్లకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ బజార్లు ఆదివారం ఉదయం పది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి ఎనిమిది సార్లు ''బెస్ట్ డొమెస్టిక్ టూర్ అపరేటర్'' అవార్డును అందుకున్న సదరన్ ట్రావెల్స్‌కు ప్రజల్లో భారీ స్థాయిలో విశ్వసనీయత ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ బజార్లకు ప్రజల నుంచి ఊహించని ఆదరణ లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు ఈ బజార్లను సందర్శించి వివిధ రకాల టూర్ ప్యాకేజీల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త టూర్ ప్యాకేజీలు, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం, నిపుణులతో మాట్లాడడం, బిగ్ క్యాష్ డిస్కౌంట్స్, క్యాస్ బ్యాక్ ఆఫర్లతో పాటు తెలుసుకోవడంతో పాటు ట్రావెల్ డెస్టినేషన్స్‌కు సంబంధించిన వారందరినీ ఒకే చోట కలవడం ఆనందంగా ఉందన్నారు. బజార్ల నిర్వహణ వల్ల చాలా విషయాలను తెలుసుకున్నామని పర్యాటక ప్రియులు తెలిపారు. కుటుంబంతో లేదా ఇతరు స్నేహితులతో కలిసి వెళ్లే టూర్‌కు వెళ్లేందుకు అవనువైన పర్యాటక వివరాలను ఈ సందర్భంగా తెలుసుకున్నారు. సంస్థ ఎండి అలపాటి కృష్ణమోహన్, జాయింట్ ఎండి అలపాటి వెంకట ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో సంస్థ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ టూరిజం రంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతుందన్నారు. పర్యాటకులకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతుందన్నారు. ట్రావెల్స్, టూరిజం రంగంలో ఐదు దశాబ్ధాల అనుభవం కలిగిన సదరన్ సంస్థ దేశంలోనే అగ్రశ్రేణి సంస్థగా పేరుగాంచిందన్నారు. 70వ దశకంలో సదరన్ ట్రావెల్స్‌ను ఆ సంస్థ చైర్మన్ అలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రావెల్స్, టూరిజం రంగంలో ఉత్తమ సేవలను అందిస్తూ సంస్థ పర్యాటకుల నమ్మకాన్ని చూరగొంటుందన్నారు.



మార్కెట్‌ను కొల్లగొట్టిన జియో ఫోన్

- 28 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకున్న ఫీచర్ ఫోన్
- చౌక టారిఫ్‌లతో చాలా మందికి సెకండ్ డివైజ్‌గా మారిన హ్యాండ్‌సెట్

ముంబయి : విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేస్తూ రిలయన్స్ జియో ఫోన్ దేశీయ మార్కెట్లో అద్భుతంగా రాణించింది. 2018లో 28 శాతం హ్యాండ్‌సెట్ మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. గత సంవత్సరం 290 మిలియన్ల జియో ఫోన్లు అమ్ముడయ్యాయి. ఒక భారత బ్రాండ్ అమ్మకాల్లో ముందు వరసలో నిలవడం ఇదే మొదటిసారి. మీడియా కథనాల ప్రకారం 2018లో జియో ఫోన్ 38 శాతం ఫీచర్ ఫోన్ వాటాను సొంతం చేసుకుంది. 2017 చివర్లో అడుగుపెట్టిన జియో ఫోన్ కొత్తకొత్త మార్పులతో మార్కెట్ గతినే మార్చివేసింది. డేటా ధరల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన రిలయన్స్ జియో.. ఇంటర్నెట్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే ఫీచర్ ఫోన్లపై ఆసక్తి కోల్పోతున్న సమయంలో జియో ఫోన్ స్మార్ట్ ఫీచర్ ఫోన్‌గా వచ్చి భారతీయ వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంది. రిలయన్స్ జియో, జియో ఫోన్ కలిసి కాలింగ్ రేట్లను చాలా తక్కువకే అందిస్తుండడంతో చాలా మంది దీన్ని సెకండ్ డివైజ్ చేసుకున్నారు. ఫలితంగా ఈ ఫీచర్‌ఫోన్ మార్కెట్ 2018లో స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కన్నా వేగంగా అభివృద్ధి చెందింది. ' భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్నప్పటికీ ఎక్కువ మంది ప్రజానీకానికి ఫీచర్ ఫోన్లు సరైనవే'నని ఒక విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు. జియో, శామ్‌సంగ్,ఐటెల్, నోకియా, హెచ్‌ఎండి, లావా ఫీచర్‌ఫోన్ మార్కెట్‌లో 72 శాతం వాటాను ఆక్రమించాయి. ఇక స్మార్ట్ ఫోన్ల మార్కెట్‌లో చైనీస్ దిగ్గజం షివోమీ (28శాతం) రారాజుగా వెలగొందుతుండగా, శామ్‌సంగ్ (24 శాతం), వివో (10 శాతం), ఒప్పో(8 శాతం), మైక్రోమ్యాక్స్ (5 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత సంవత్సరం రికార్డులను బద్దలు కొడుతూ 2018లో దేశంలో 135 మిలియన్ల ఫోన్లు అమ్ముడయ్యాయి. చైనా తర్వాత భారత్‌దే అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా ఉంది.

ఆర్థిక సంక్షోభం నిజమే


- ఎవరి సొమ్మూ ఒక్క పైసా ఉంచుకోను
- తొందరపడితే అందరికీ నష్టమే
- ఎస్సెల్ గ్రూపు చైర్మన్ సుభాష్‌చంద్ర వెల్లడి



ముంబయి : ఎస్సెల్ గ్రూపు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందంటూ వస్తున్న వార్తలపై గ్రూపు చైర్మన్ సుభాష్ చంద్ర ఎట్టకేలకు పెదవి విప్పారు. కంపెనీ ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాట నిజమేనని అంగీకరించారు. దీనినుంచి బైటపడేందుకు కీలకమైన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జిఇఇఎల్)లో వాటాలను విక్రయించి నిధులు సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నా.. కొన్ని శక్తులు పడనీయడం లేదని ఆరోపించారు. ఇన్‌ఫ్రా పెట్టుబడులపై ఆశలు పెట్టుకున్నా ఐఎల్ అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం కారణంగా పరిస్థితి అదుపు తప్పిందని, వీడియోకాన్‌కు చెందిన డి2హెచ్ వ్యాపారం కొనుగోలు కూడా కలిసి రాలేదని తెలిపారు.శుక్రవారం దేశీయ స్టాక్‌మార్కెట్లో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు కుప్పకూలిన నేపథ్యంలో రుణదాతలకు రాసిన బహిరంగ లేఖలో సుభాష్ చంద్ర ఈ విషయాలు తెలియజేశారు. రుణదాతలకు క్షమాపణలు చెప్పిన సుభాష్‌చంద్ర జిఇఇఎల్‌లో వాటాల విక్రయం దాకా ఓపిక పట్టాలని కోరారు. అలా కాక తొందరపాటుగా వ్యవహరిస్తే ఇరుపక్షాలు నష్టపోవలసి వస్తుందని హెచ్చరించారు.అయితే మొత్తం అప్పు ఎంత ఉన్నదీ, ఎగవేతలు ఏమయినా జరిగాయాలాంటి విషయాలను ఆయన ప్రస్తావించలేదు. ఐఎల్ అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం తర్వాత రుణాల రోల్‌ఓవర్ కష్టంగా మారిందని, అయినప్పటికీ డిసెంబర్‌వరకు రుణాల చెల్లింపులు సక్రమంగానే జరపగలిగామని వెల్లడించారు.'నా ఉద్దేశాలు మంచివే అయినప్పటికీ బ్యాంకర్లు, ఎస్‌బిఎఫ్‌సిలు, మ్యూచువల్ ఫండ్స్ ఆశించినట్లుగా పని చేయలేకపోయాయని నేను భావిస్తున్నాను. ఇందుకుగాను క్షమాపణలు చెప్తున్నాను.ఎవరిదీ ఒక్క పైసా రుణం ఉంచుకోను. జిఇఇఎల్‌లో వాటాల విక్రయం పూర్తయితే అన్ని అప్పులు తీర్చేయలుగుతాం. అంతవరకు ఓపిక పట్టండి.అలా కాక ఆందోళనతో, అరాచకంగా ప్రవర్తించినట్లయితే దానివల్ల మీరు, మేము ఇద్దరమూ కూడా నష్టపోవలసి వస్తుంది' అని సుభాష్ చంద్ర ఆ లేఖలో స్పష్టం చేశారు. గత ఏడాది జూన్‌నుంచి సమస్యలు వెన్నాడుతున్నాయని,రుణదాతలకు, షేర్‌హోల్డర్లకు గుర్తు తెలియని శక్తులు లేఖలు రాస్తూ గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని తెలిపారు. తనవంతుగా కొన్ని తప్పులు జరిగాయని కూడా ఆయన అంగీకరించారు. ఎస్సెల్ ఇన్‌ఫ్రా కారణంగా నాలుగునుంచి అయిదు వేల కోట్ల రూపాయల దాకా నష్టపోవలసి వచ్చిందన్నారు. అలాగే 2016లో వీడియోకాన్ డి2హెచ్ వ్యాపారం కొనుగోలుతో బోలెడంత నష్టపోయామన్నారు. ఇక కుటుంబ వ్యాపార విభజన సమయంలో గ్రూపు నష్టాన్నంతా తమపై వేసుకోవడం మరో పెద్ద తప్పిదమని సుభాష్ చంద్ర తెలిపారు. డీమానిటైజేషన్ తర్వాత భారీ డిపాజిట్లు చేయడంపై ఎస్ఎఫ్ఐఓ విచారణను ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో ఎస్సెల్ గ్రూపు సంస్థల పేర్లున్నాయన్న వార్తలతో ఆ గ్రూపు కంపెనీల షేర్లు భారీగా పతనమైన విషయం తెలిసిందే. ఫలితంగా జీ గ్రూపు మార్కెట్ విలువ రూ.18,000 కోట్లకు పైగా పడిపోయింది.

మెహుల్ చోక్సీని భారత్‌కు తీసుకువస్తారా?

- ప్రత్యేక విమానంలో కరేబియన్ దీవులకు వెళ్లనున్న ఇడి, సిబిఐ అధికారులు



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాన నిందితులైన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలను స్వదేశానికి రప్పించడానికి భారత దర్యాప్తు సంస్థలు చేయని ప్రయత్నమంటూ లేదు. ఇప్పటికే వీరిపై ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. తాజాగా భారత ప్రభుత్వం మరో మిషన్‌కు సిద్ధమయింది. నిందితుల్లో ఒకరైన మెహుల్ చోక్సీని స్వదేశానికి తీసుకు రావడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ అధికారులు త్వరలోనే ఆయన తలదాచున్న కరేబియన్ దీవులకు వెళ్లనున్నట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తోంది. పిఎన్‌బి కుంభకోణం వెలుగులోకి రావడానికి చాలా రోజుల ముందే నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీని దేశం వదిలిపెట్టి వెళ్లారు. ప్రస్తుతం చోక్సీ వెస్టిండీస్‌లోని ఆంటిగ్వా, బార్బుడా పౌరసత్వం తీసుకున్నారు. ఈ దీవుల్లోని చాలా వాటిలో చెల్లింపుల పౌరసత్వ పథకం అందుబాటులో ఉంది. దీనివల్ల ఇక్కడ పౌరసత్వం తీసుకోవడం చాలా సులభం. పెట్టుబడుల కింద దేశానికి కొంత సొమ్ము చెల్లిస్తే చాలు, పౌరసత్వం లభిస్తుంది. అంతేకాకుండా దీని ద్వారా 132 దేశాలకు వీసాలేకుండా ప్రయాణం చేయవచ్చు. ఈ మార్గంలోనే చోక్సీ అక్కడ పౌరసత్వం సంపాదించారు. అయితే చోక్సీని భారత్‌కు పంపించాలని భారత దర్యాప్తు సంస్థలు ఇప్పటికే ఆంటిగ్వా ప్రభుత్వాన్ని సంప్రదించాయి. ఇందులో భాగంగానే ఇడి, సిబిఐ అధికారులు కొందరు ఎయిరిండియా విమానంలో వెస్టిండీస్ వెళ్లనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. తిరుగు ప్రయాణంలో యూరప్‌లో ఉన్న మోడీని కూడా తీసుకు రావాలని ఆ అధికారులు అనుకుంటున్నట్లు కూడా తెలుస్తోంది. నీరవ్ మోడీ బ్రిటన్‌లో తలదాచుకుని ఉన్నట్లు సమాచారం.

వివో నుంచి డ్యూయల్ డిస్‌ప్లే మొబైల్



న్యూఢిల్లీ : చైనా మొబైల్ తయారీ సంస్థ వివో ఈ సారి మరో అద్భుతమైన ఫోన్‌తో మార్కెట్లోకి వచ్చింది. నెక్స్ డ్యూయల్ డిస్‌ప్లే ఎడిషన్‌లో భాగంగా 'నెక్స్ 2 పేరుతో వచ్చిన ఈ ఫోన్‌లో రెండువైపులా డిస్‌ప్లే ఉంటుంది. ముందు వైపు 6.39 అంగుళాల అల్ట్రా ఫుల్‌వ్యూ అమోలెడ్ డిస్‌ప్లే, రెండో వైపు 5.49 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే ఉంది. ప్రస్తుతం చైనాలో మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఫోన్ ధర భారత కరెన్సీలో దాదాపు రూ. 52 వేలుగా ఉంది. త్వరలోనే భారతీయ మార్కెట్లోనూ విడుదల చేసేందుకు వివో సిద్ధమవుతోంది. గూగుల్ సరికొత్త ఆపరేటింగ్ సిస్టమ్'పై'తో పని చేసే ఈ ఫోన్‌లో 10జిబి ర్యామ్, 128 జిబి ఆన్‌బోర్డ్ మెమరీ ఉన్నాయి. డ్యూయల్ సిమ్, 12ఎంపి +2 ఎంపి,+టిఓఎఫ్3డి కలిగిన ట్రిపుల్ రియర్ కెమెరా ఈ ఫోన్ ప్రత్యేకత. రియర్ కెమెరాతోనే సెల్ఫీలు తీసుకోవచ్చు. ఇన్ డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్ కలిగిన ఈ ఫోన్‌లో 3500 ఎంఎహెచ్ బ్యాటరీని ఉపయోగించారు.

పద్మశ్రీ తిరస్కరించిన నవీన్‌పట్నాయక్ సోదరి



న్యూఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తనకు ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి, న్యూయార్క్‌లో స్థిరపడిన రచయిత్రి గీతా మెహతా తిరస్కరించారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందు ప్రకటించిన ఈ పురస్కారం సందర్భోచితంగా లేదని, ఇది "అపోహలకు" ఆస్కారం ఇచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ అవార్డు తననే కాదు, ప్రభుత్వాన్ని కూడా ఇబ్బందికర పరిస్థితిలోకి నెడుతుందని ఒక ప్రకటనలో ఆమె అభిప్రాయపడ్డారు. "పద్మశ్రీ పురస్కారానికి నేను అర్హురాలినని గుర్తించినందుకు భారత ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. అయితే, సార్వత్రిక ఎన్నికలు జరగనున్న కొద్ది నెలలకు ముందుగా అవార్డును ప్రకటించిన సమయం అపోహలకు దారితీసే అవకాశం ఉన్నందున, అది వ్యక్తిగతంగా నాకు, ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితికి దారితీయవచ్చు. ఈ కారణంగా అవార్డును తిరస్కరిస్తున్నానని చెప్పడానికి చింతిస్తున్నాను" అని గీతా మెహతా తన ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గీతా మెహతా ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ట్విట్టర్ ద్వారా తన సోదరి పేరును ప్రస్తావించకుండా పద్మ అవార్డులకు ఎంపికైన ఇతరులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

పద్మశ్రీ వరించిన తొలి ట్రాన్స్‌జెండర్



న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన ప్రముఖులలో ట్రాన్స్‌జెండర్, కూచిపూడి నాట్యకళాకారిణి నర్తకి నటరాజ్ ఉన్నారు. తమిళనాడులోని మదురైలో జన్మించిన 54 సంవత్సరాల నర్తకి నటరాజ్ పద్మశ్రీకి ఎంపికైన తొలి ట్రాన్స్‌జెండర్ కావడం విశేషం. ఈ ఏడాది పద్మశ్రీ అవార్డులకు ఎంపికైన 94 మందిలో ప్రముఖ తెలుగు సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛెత్రి, చదరంగ రీడాకారిణి ద్రోణవల్లి హారిక, రైతునేస్తం వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఎల్ అండ్ టి చైర్మన్ ఎఎం నాయక్, దివంగత జర్నలిస్ట్ కుల్దీప్ నాయర్, దివంగత బాలీవుడ్ నటుడు కాదర్ ఖాన్, మలయాళ నటుడు మోహన్‌లాల్, క్రికెటర్ గౌతమ్ గంభీర్, కొరియోగ్రాఫర్‌నటుడు ప్రభు దేవా తదితరులు ఉన్నారు.

సోమనాథ్, అంబాజీ ఆలయాలకు సమీపంలో 'వెజ్ జోన్లు'

అహ్మదాబాద్: గుజరాత్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు సోమ్‌నాథ్, అంబాజీ దేవాలయాలకు చుట్టూ 500 మీటర్ల మేరకు 'శాకాహార మండలాలు' (వెజ్ జోన్లు)గా ముఖ్యమంత్రి విజయ్ రుపానీ ప్రకటించారు. శుక్రవారం బనస్కంత జిల్లాలోని పలాన్‌పూర్‌లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ రెండు ఆలయాలకు సమీపంలో చికెన్, మాంసాహారం వంటి నాన్ వెజిటేరియన్ ఆహారం విక్రయించడంపై ఇప్పటి నుంచి నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎంతో కాలంగా పలు మత పరమైన సంస్థలు, స్థానిక నివాసితులు డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దేవాలయాలను హిందువులతోపాటు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు ఎక్కువగా సందర్శిస్తారు.

ఖాళీ మైదానంలో గవర్నర్ ప్రసంగం!

ఐజ్వాల్ : పౌరసత్వం(సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ ఎన్‌జిఓ కోఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త గణతంత్ర వేడుకల బహిష్కరణ పిలుపు కారణంగా మిజోరం గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్ శనివారం ఖాళీ మైదానాన్ని ఉద్దేశించి ప్రసంగించవలసి వచ్చింది. ప్రజలెవరూ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొననకపోవడంతో ఖాళీ మైదానం దర్శనమిచ్చింది. కేవలం మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు మాత్రమే వేడుకలలో పాల్గొన్నారు. పౌర సమాజానికి చెందిన సంఘాలు, విద్యార్థి సంఘాలతో కూడిన ఎన్‌జిఓ సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపునకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిస్పందన లభించింది. ఇతర జిల్లాలలోనైతే ప్రభుత్వ అధికారులు సైతం ఈ వేడుకలను బహిష్కరించారు. సీనియర్ అధికారుల గైర్హాజరీ నేపథ్యంలో డిప్యూటీ కమిషనర్లే త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

మొదటి వరుసలో రాహుల్

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే సందర్భంగా సీట్ల ఏర్పాటులో గత ఏడాది రాహుల్ గాంధీ ఎక్కడ కూచోవాలనే విషయంలో వివాదం రేగిన నేపథ్యంలో ఈసారి కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఈసారి రిపబ్లిక్ వేడుకల్లో మొదటి వరసలో సీటు కేటాయించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పక్కనే రాహుల్‌గాంధీ కూచున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు గులామ్‌నబీ ఆజాద్ రెండో వరసలో రాహుల్‌గాంధీ వెనక కూచున్నారు. తల్లి సోనియాగాంధీ నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌గాంధీకి 2018 రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో ఆరవ వరసలో సీటు కేటాయించడంతో పార్టీ వర్గాలు ఆనాడు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చౌకబారు రాజకీయాలు చేస్తూ ప్రభుత్వం సంప్రదాయాలకు మంగళం పాడిందని దుయ్యబట్టాయి. రిపబ్లిక్ డే వేడుకల్లో తమ అధ్యక్షులు ఎప్పుడూ ముందు వరసలోనే కూచునేవారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

'అగస్టా' కేసులో గౌతమ్ ఖైతాన్ అరెస్టు


న్యూఢిల్లీ: గత యుపిఎ హయాంలో జరిగిన అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందంలో మధ్యవర్తి పాత్ర పోషించిన న్యాయవాది గౌతమ్ ఖైతాన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పిఎంఎల్‌ఎ) కింద ఖైతాన్‌పై ఇడి అభియోగాలు నమోదు చేసింది. ప్రశ్నించే నిమిత్తం శుక్రవారం రాత్రి ఖైతాన్‌ను పిలిపించిన ఇడి అధికారులు ఆయన అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదివరకు ఖైతాన్‌పై ఆదాయం పన్ను శాఖ అభియోగాలు నమోదు చేయగా తాజాగా పిఎంఎల్‌ఎ కింద ఇడి ఆయనపై కేసులు నమోదు చేసింది. మరోవైపు ఢిల్లీ కోర్టు ఖైతాన్‌ను రెండు రోజుల పాటు ఇడి కస్టడీకి ఆదేశించింది.

బిజెపిలో చేరనున్న సర్వేపల్లి మనవడు

బెంగళూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు జి సుబ్రమణ్యం శర్మ కర్నాటక బిజెపిలో చేరనున్నారు. బిజెపి ప్రధాన కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ ఎడ్యూరప్ప సమక్షంలో ఆయన మరి కొద్ది సేపట్లో కాషాయం కండువా కప్పుకోనున్నారు. 44 సంవత్సరాల సుబ్రమణ్యం శర్మ గత ఏడాది జరిగిన కర్నాటక శాసనసభ ఎన్నికల్లో బెంగళూరులోని మల్లేశ్వరం నియోజకవర్గం నుంచి ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలో అసమానత్వాన్ని నిర్మూలించడమే తన ధ్యేయమని ఆయన చెప్పుకుంటున్నారు.

ఆపరేషన్ కమలం ఇంకా కొనసాగుతోంది

మా ఎంఎల్ఎలకు బిజెపి డబ్బు ఎర : కుమారస్వామి




బెంగళూరు: అధికార జనతాదళ్(ఎస్)కు చెందిన ఎమ్మెల్యేలను లోబరుచుకోవడానికి బిజెపి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉందని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ "ఆపరేషన్ కమల ఇంకా కొనసాగుతోంది. మా ఎమ్మెల్యేలలో ఒకరికి బిజెపి డబ్బు ఆశ చూపింది" అని ఆయన ఆరోపించారు. "నిన్న(శుక్రవారం)రాత్రి మా ఎమ్మెల్యేలలో ఒకరికి చాలా భారీ సొమ్ము ముట్టచూపబోయారు. ఆ సొమ్ము ఎంతో చెబితే మీరు ఆశ్చర్యపోతారు. అయితే తనకు ఎటువంటి బహుమతి అవసరం లేదని, ఇలాంటి ప్రయత్నాలు తన వద్ద సాగవని మా ఎమ్మెల్యే కరాఖండీగా వారితో చెప్పేశారు. మా వాళ్లను లోబరుచుకోవడానికి ఇలాంటి ప్రయత్నాలు ఇంకా సాగిస్తూనే ఉన్నారు వాళ్లు" అని కుమారస్వామి చెప్పారు. కాగా, ఈ ఆరోపణలను కర్నాటక అసెంబ్లీలో ప్రతిపక్ష బిజెపి నాయకుడు బిఎస్ ఎడ్యూరప్ప ఖండించారు. ఇవన్నీ నిరాధార ఆరోపణలన్నీ, తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవలసిన బాధ్యత అధికార పక్షాలకు ఉంటుందని ఆయన అన్నారు. కర్నాటకలో ఆపరేషన్ కమల ఏదీ లేదని ఆయ స్పష్టం చేశారు.

ప్రతిభావంతులు.. స్ఫూర్తిప్రదాతలు

పద్మాలకు అరలక్ష మంది దరఖాస్తు





న్యూఢిల్లీ : పద్మ పురస్కారాలు. వివిధ రంగాలలో విశేష ప్రతిభను, విశిష్ట సేవలను అందించిన వారికి బహుకరించే సన్మాన అవార్డులు . 2019 సంవత్సరానికి ప్రకటించిన పద్మ పురస్కారాలలో ఎందరో మహానుభావులు ఉన్నారు. స్ఫూర్తి ప్రదాతలుగా కీర్తి బావుటాలను ఎగురవేశారు.మక్కజొన్న కండెల రైతులు, కంటి కాటరాక్ట్ సర్జన్, కబడ్డీ ఆటగాడు ఈ విధంగా ఎందరో ప్రతిభావంతులు ఈ పద్మ జాబితాలో చోటుచేసుకున్నారు. దేశ 70వ గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో పద్మ శ్రేణి విజేతల పేర్లతో రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పద్మ పురస్కారాలకు తమ అర్హతలను తెలియచేసుకుంటూ 50 వేల వరకూ దరఖాస్తులు వచ్చాయి. వీటిని సుదీర్ఘ ప్రక్రియలో పరిశీలించి, అన్నింటిని క్షుణ్ణంగా లెక్కలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేసినట్లు శనివారం అధికార వర్గాలు ప్రకటన వెలువరించాయి. మొత్తం 112 మంది అత్యంత స్ఫూర్తిదాయక వ్యక్తులకు ఈ ఏటి పద్మ పురస్కారాలను ప్రకటించారు. ప్రతిభనే ప్రాతిపదిక చేసుకోవడమే కాకుండా, వారి సేవలు, సమాజంపై దీని ప్రభావం, ప్రత్యేకించి నిస్వార్థ సేవలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఖరారు చేశారు.

రైతులకు గుర్తింపు

ఈసారి ప్రత్యేకంగా వినూత్న రీతిలో పంటలు పండించిన 12 మంది రైతులకు పద్మ పురస్కారాలు దక్కాయి. తొమ్మిది రాష్ట్రాలకు చెందిన రైతులను వీటికి ఎంపిక చేశారు. ఇందులో పుట్టగొడుగులు, బేబీ కార్న్ పంటలో వినూత్న పుంతలు తొక్కిన కన్వల్ సింగ్ రికార్డు సృష్టించారు. ఆయనకు పద్మ అవార్డు వచ్చింది. ఇక అత్యున్నత స్థాయి క్యారెట్ దిగుబడికి పాటుపడ్డ వల్లభభాయ్ వస్రంభాయ్ మర్వానియాకు, కాలీఫ్లవర్ పంట పండించిన జగదీష్ ప్రసాద్ పరీక్‌కు కూడా పద్మ పంట పండింది. అభ్యుదయ రైతులు భరత్ భూషణ్ త్యాగి,రామ్ శరన్ వర్మ, ఎడ్లపల్లి వెంకటేశ్వర రావులకు ఈ అవార్డులు వచ్చాయి. ఇక పాత సాగు పద్ధతులను పాటిస్తూ , సాంప్రదాయక వంగడాలతో, విత్తనాలతో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్న రైతులలో కమలా పూజ్హరి, రాజ్‌కుమారీ దేవీ , బాబూలాల్ దహియా, హుకుంచంద్ పాటిదార్‌లు తమ పాత మెళకువలతో సరి కొత్త రికార్డులు సృష్టించారు. ఇక పశు సంవర్థక విభాగంలో విజయం సాధించిన సుల్తాన్ సింగ్‌కు చేపల పెంపకపు ఘనతలో, పాడి పంటలలో విజయం సాధించిన నరేంద్ర సింగ్‌కు పద్మ అవార్డులు వచ్చాయి.

14 మంది డాక్టర్లకు పురస్కారాలు

11 రాష్ట్రాలకు చెందిన 14 మంది డాక్టర్లకు వారి పేద ప్రజా సేవలకు గుర్తింపుగా పద్మ అవార్డులు వచ్చాయి.సామాన్యుడి ప్రాణా లను తోడేస్తున్న వ్యాధులను అరికట్టేందుకు వైద్య చికిత్సలతో ముం దుకు వెళ్లుతున్న వారికి ఈ పురస్కారాలు ప్రకటించారు. రేబిస్‌కు చికి త్స కోసం పాటుపడుతున్న ఒమేష్ కుమార్, కణజాల పతన నివారణకు కృషి చేస్తున్న సు దమ్ కాటేకు, కాలిన గాయాలకు సర్జరీలో పే రొందిన రామస్వామి వెంకటస్వామికి, కళ్ల పొరలు ఇతరత్రా నేత్ర జబ్బులను నయంచేసేందుకు పాటుపడుతున్న ప్రతాప్ సిగట్ హర్దియాకు అవార్డులు వచ్చా యి. తక్కువ వ్యయంతో అత్యున్నత ప్రామాణిక వైద్యం కొన్ని సార్లు ఉచిత వైద్య సేవలు అం దించిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ (జార్ఖండ్), స్మితా, రవీంద్ర కొల్హేలకు, తమిళనాడుకు చెందిన ఆర్‌వి రమణికి పద్మ అవార్డులు దక్కాయి. ఇక మారుమూల ప్రాంతాలలో వైద్య సేవలను అందిస్తూ వస్తున్న వారిలో లడక్ వాసి సెరింగ్ నోర్బూ, ఇలియాస్ అలీ (అ సోం), లాతూరుకు చెందిన అశోక్ లక్ష్మ ణ్‌రావు కకడేలకు ఈ గౌరవాలు దక్కాయి. ఇక పలు ప్రఖ్యాత వైద్య విద్యాసంస్థలలో డాక్టర్లుగా ఉన్న వారికి కూడా వైద్య సేవల గుర్తింపుగా అవార్డులు వచ్చాయి. వీరిలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ సందీప్ గులేరియాకు, కోల్‌కతాలోని టాటా వైద్య కేంద్ర డైరెక్టర్ మమ్మెన్ చాందీకి, లక్నోలోని కింగ్ జార్జి మెడికల్ యూనివర్శిటీలో పనిచేసే షాదాబ్ మెహమ్మద్‌కు ఇవి దక్కాయి.

తొమ్మండుగురు ఆటగాళ్లకు గుర్తింపు

తొమ్మిది క్రీడా విభాగాలకు చెందిన తొమ్మండుగురు ప్రముఖ క్రీడాకారులకు ఈ ఏటి పద్మ పురస్కారాలు వచ్చాయి. వీరిలో విలువిద్యలో బొంబాయిల దేవీ లైషరం, బాస్కెట్‌బాల్‌లో ప్రశాంతి సింగ్, చదరంగంలో హారికా ద్రోణవల్లి, క్రికెట్ మెరుపు వీరుడు గౌతమ్ గం భీర్ , ఫుట్‌బాల్ ఆటగాడు సునీల్‌ఛేతన్, కబాడీ మొనగాడు అజయ్ ఠాకూర్, పర్వతారోహణలో బచేంద్రీ పాల్, టెన్నిస్‌లో శరత్ కమల్, కుస్తీలో బజ్‌రంగ్ పూనియాలు ఉన్నారు.

పలువురు సామాజిక నేతలకు అవార్డులు

ఈ ఏడాది పద్మ అవార్డులు దక్కిన వారిలో పలువురు సామాజిక కార్యకర్తలు, సంఘు సేవకు విశేషంగా పాటుపడుతున్న వారు ఉన్నారు. వీరిలో బీహార్‌కు చెందిన హుకుందేవ్ నారాయణ్ యాదవ్, గిరిజన నేత కరియా ముండా, సిక్కు నేత సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా, మహాదళిత మహిళా నేత భగీరథి దేవి వంటి వారు ఉన్నారు. ఇక విదేశాలలోని భారతీయ శ్రేయోభిలాషులకు కూడా పద్మ అవార్డులు ప్రకటించారు. వీరిలో దిజ్బౌతి ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ఒమర్ గుల్లెహ్, దక్షిణాఫ్రికాకు చెందిన జాతి వివక్ష వ్యతిరేక నేత, ప్రస్తుత మంత్రి ప్రవీణ్ గోవర్ధన్ ఉన్నారు. పద్మ అవార్డులకు ఇంతవరకూ ఉన్న అపవాదును మోడీ ప్రభుత్వం తొలిగించి వేసిందని, కేవలం వ్యక్తుల ప్రతిభ, వారి సమున్నత సేవల ప్రాతిపదికనే ప్రకటించిందని పద్మ అవార్డులకు ఇంతవరకూ ఉన్న ప్రభుత్వ అవార్డులు అంతకు మించి ఉన్న పైరవీల పతకాలు అనే నిందనుంచి తప్పించారని, ఇపుడివి పూర్తిగా ప్రజా పురస్కారాలుగా నిజమైన అర్హులకు దక్కాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. తమకు అందిన దరఖాస్తులను సశాస్త్రీయంగా పరిశీలించడం జరిగిందని, అందరి వ్యక్తిగత రికార్డులను పలు దఫాల నిశిత పరిశీలన చేశారని , వాటిలోని నిజానిజాలను వెలికితీసి, నిపుణుల సలహాల మేరకు పద్మ అవార్డులకు విజేతల ఎంపిక జరిగిందని వివరించారు.



కుంభమేళాతో ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశం?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు, సోదరుడు రా హుల్ గాంధీతో కలిసి ప్రియాంక గాంధీ వాద్రా ఫిబ్రవరి 4న ప్రయాగ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో గంగానదిలో పవిత్ర స్నానమాచరించిన తర్వాత రాజకీయరంగప్రవేశం చేయనున్నట్లు సమాచారం. అదే రోజు ఆమెతూర్పుఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ప్రియాంక లక్నోలో రాహుల్‌తో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. వచ్చే నెల 4న 'మౌని అమవాస్య' రెండవ 'షాహిస్నాన్' సందర్భంగా రాహుల్, ప్రియాంకలు పవిత్ర స్నానమాచరించాలనుకుంటున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఒక వేళ అప్పుడు వీలు కాకపోతే వచ్చే నెల 10న బసంత పంచమి, 'మూడో 'షాహి స్నాన్ సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాహుల్, ప్రియాంకలు కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించడం ఇదే తొలిసారి.



దక్షిణాఫ్రికా అధ్యక్షుడితో మన్మోహన్, రాహుల్ భేటీ

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో సమావేశమైన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల గురించి చర్చించారు. 70వ గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, తమ దేశంలో పర్యటించాలని రాహుల్‌ను ఆహ్వానించారు. రమఫోసా ఆహ్వానాన్ని రాహుల్ ఆమోదించినట్లు సమావేశంలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్‌నేత ఆనంద్ శర్మ తెలిపారు. వర్ణ వివక్షకు వ్యతిరేక పోరాటంలో భారత్ పోషించిన పాత్రను రమఫోసా ప్రశంసించారన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నట్లు సోదర పార్టీలు పునరుద్ఘాటించాయని శర్మ తెలిపారు. ఇరు పార్టీల మధ్య శతాబ్దాలుగా చారిత్రక సంబంధాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ చర్చల్లో రమఫోసా, రాహుల్‌లు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించినట్లు సీనియర్ కాంగ్రెస్ నేత తెలిపారు.

షట్‌డౌన్‌కు మూడు వారాల విరామం

దిగొచ్చిన ట్రంప్... సిబ్బంది జీతాలకు ఓకే



వాషింగ్టన్ : అమెరికాలో షట్‌డౌన్ ఎత్తివేతపై దేశాధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ రాజీకి వచ్చారు. మూడు వారాల పాటు ప్రభుత్వ కార్యకలాపాలకు వీలు కల్పించే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. మెక్సికో వాల్ నిర్మాణానికి తాను అడిగిన నిధులు రానప్పటికీ ఆర్థిక స్తంభనను ఎత్తివేస్తానని ట్రంప్ ఇప్పుడు ప్రకటించారు. అయితే షట్‌డౌన్ ఎత్తివేత తాత్కాలికం అని స్పష్టం చేశారు. అమెరికా – మెక్సికో మధ్య వాల్ నిర్మాణానికి తాను కోరుకున్న నిధుల మంజురు జరగాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే ఈ నిధులకు ఆమోదంతో నిమిత్తం లేకుండా షట్‌డౌన్‌ను తొలిగించి వేస్తామని తెలిపారు. దీనితో దేశంలో గత 35 రోజులుగా నెలకొని ఉన్న అత్యంత క్లిష్టమైన ఇంతకు ముందెన్నడూ లేని స్థాయి షట్‌డౌన్‌కు ముగింపు పలికినట్లు అయింది. వాల్ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్ల నిధులు కావాలని ట్రంప్ కోరుతున్నారు. అయితే దీనికి ప్రతిపక్ష డెమొక్రాట్లు వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ షట్‌డౌన్ చర్యకు ట్రంప్ పాల్పడ్డారు. అంతకాకుండా పలు సార్లు తన డిమాండ్ తీర్చకపోతే దేశంలో ఎమర్జెన్సీ విధిస్తానని హెచ్చరిస్తూ వస్తున్నారు. అయితే ప్రస్తుత పట్టింపు దశలో ఆర్థిక గడ్డు స్థితి నుంచి గట్టెక్కడం కుదరదని భావించిన ట్రంప్ ఇప్పుడు రాజీ మార్గాన్ని పాటించారు. వచ్చే నెల 15వ తేదీ వరకూ షట్‌డౌన్‌ను ఎత్తివేసేందుకు సంబంధించిన ఒప్పందానికి ట్రంప్, ప్రతిపక్ష నేతలు అంగీకారం తెలిపారు. మూడు వారాల పాటు ప్రభుత్వ ప్రధాన కార్యకలాపాలకు, ప్రత్యేకించి వివిధ ప్రభుత్వ శాఖలకు నిధుల మంజూరీకి ఈ చర్య దోహదం చేస్తుంది. ఫిబ్రవరి 15వ తేదీలోగా చట్టసభల ప్రతినిధులు ఇమ్మిగ్రేషన్‌పై సరైన విధంగా ఏకాభిప్రాయానికి వచ్చేందుకు యత్నించాల్సి ఉంటుంది. శుక్రవారం జరిగిన సెనెట్, ప్రతినిధుల సభలో ట్రంప్ తాత్కాలిక షట్‌డౌన్ విరమణ సూత్రానికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. ఆ తరువాత రోజ్ గార్డెన్ నుంచి ట్రంప్ ప్రసంగించారు. హౌస్ సెనెట్ సభ్యులతో తాను త్వరలోనే సంప్రదింపులు జరుపుతానని, ఈ దశలో హోం లాండ్ సెక్యూరిటీ విభాగానికి పూర్తి స్థాయి నిధుల మంజూరిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతానికి అంతా పక్షపాత ధోరణిని పక్కన పెడుతున్నట్లుగా భావిస్తున్నట్లు, నెలరోజులకు పైగా జరిగిన నిర్మాణాత్మక చర్చలు మంతనాలు తరువాత అధికార, ప్రతిపక్షాలు సవ్యమైన దిశకు వచ్చినట్లుగా ఆశిస్తున్నానని చెప్పారు.

వైసిపి కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన వైఎస్ జగన్



మన తెలంగాణ/హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో 70వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో రాజ్యసభ ఎంపి విజయసాయిరెడ్డి, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచే శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

గని ఆనకట్ట కూలి 300 మంది గల్లంతు

బ్రెజిల్‌లో ఘోర దుర్ఘటన • తొమ్మిది మృతదేహాలు వెలికితీత






బ్రుమడిన్హో : బ్రెజిల్‌లో ఆనకట్ట కూలిన దుర్ఘటనలో గల్లంతు అయిన వారి సంఖ్య 300కు చేరుకుంది. దీనితో దేశంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇప్పటికీ సహాయక బృందాల వారు తొమ్మిది మృతదేహాలను వెలికి తీశాయి. దక్షిణ బ్రెజిల్‌లో ఒక గని వద్ద ఉన్న ఆనకట్ట ఉన్నట్లుండి కొట్టుకు పోయింది. విపత్తు సంభవించిన కొద్ది గంటల్లోపే ఈ ప్రాంతంలో తొమ్మిదికి పైగా మృతదేహాలను కనుగొన్నారు. బేలో హారిజోంటో నగరం సమీపంలోని ఇనుప గని వద్ద ఉన్న వాడకంలో లేని వంతెన కూలింది. ఇది కూలి భారీ స్థాయిలో కింద బురదతో కూడిన వరదను సృష్టించింది. ఈ బురద వరదలు సమీపంలోని కార్మికుల నివాసిత భవనంలోకి ప్రవేశించాయి. దీనితో ఈ భవనంలోని కార్మికులు గల్లంతు అయినట్లు వెల్లవైంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదిగా నిర్ధారణ అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మినాస్ గెరియాస్ రాష్ట్రంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద స్థలికి సమీపంలోనే గని కార్యాలయ భవనం ఉండటంతో అందులోని వారు ఈ ఆనకట్ట కూలడంతో చిక్కుపడ్డారని వెల్లడైంది. బ్రెజిల్ గనుల దిగ్గజం వాలే నిర్వహణలో ఇక్కడి గనులు ఉన్నాయి.

ఆస్ట్రేలియా ఓపెన్ క్వీన్ ఒసాకా

ఫైనల్లో ఓడిన క్విటోవా



ట్రోఫీతో ఒసాకా

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను జపాన్ సంచలనం, నాలుగో సీడ్ నవోమి ఒసాకా సొంతం చేసుకుంది. శనివారం నువ్వానేనా అన్నట్టు సాగిన ఫైనల్లో ఒసాకా 7–6(7/2), 5–7, 6–4 తేడాతో 8వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. ఒసాకాకు ఇది వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. కిందటి ఏడాది జరిగిన చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లోనూ ఒసాకా ట్రోఫీని గెలుచుకుంది. ఈ ఏడాది జరిగిన తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని కూడా గెలుచుకుని చరిత్ర సృష్టించింది. హేమాహేమీ క్రీడాకారిణిలు పోటీపడ్డ ఈ టోర్నీలో ఒసాకా అసాధారణ ఆటతో ట్రోఫీని గెలిచి చరిత్రను తిరగ రాసింది. ఈ విజయంతో ఆసియా ఖ్యాతిని ప్రపంచానికి చాటింది. ఇక, మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించాలని భావించిన క్విటోవాకు నిరాశే మిగిలింది. ఫైనల్‌కు చేరే క్రమంలో ఎన్నో స్ఫూర్తిదాయక విజయాలు సాధించిన క్విటోవా తుది పోరులో మాత్రం చతికిల పడింది. చివరి వరకు ఒసాకాకు గట్టి పోటీ ఇచ్చినా టైటిల్ మాత్రం గెలవలేక పోయింది.

హోరీహోరీ..

ఇక, ఊహించినట్టే తుది సమరం ప్రారంభం నుంచే నువ్వానేనా అన్నట్టు సాగింది. ఒసాకా, క్విటోవా ప్రతి పాయింట్ కోసం నువ్వానేనా అన్నట్టు పోరాడారు. ఇద్దరు పట్టు వీడకుండా పోరాడడంతో పోరు యుద్ధాన్ని తలపించింది. ఇద్దరు కూడా చూడచక్కని షాట్లతో కనువిందు చేశారు. ఒక దశలో క్విటోవా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే ఒత్తిడిని సయితం తట్టుకుంటూ ఆటను కొనసాగించిన ఒసాకా సెట్‌ను టైబ్రేకర్ వరకు తీసుకెళ్లడంలో సఫలమైంది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడంలో సఫలమైన ఒసాకా సెట్‌ను సాధించింది. రెండో సెట్‌లో కూడా పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. ఇటు ఒసాకా, అటు క్విటోవా అసాధారణ పోరాట పటిమను కనబరిచారు. దీంతో ఆధిక్యం తరచు చేతులు మారుతూ వచ్చింది. కానీ, చివరి దశలో పుంజుకున్న క్విటోవా టైబ్రేకర్‌లో సెట్‌ను దక్కించుకుంది. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో కూడా పోరు హోరాహోరీగానే సాగింది. అయితే ఈసారి ఒసాకా ఆధిపత్యం



చెలాయించింది. ఒత్తిడిలో ఆడిన క్విటోవా వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ఒసాకా పెద్దగా కష్టపడకుండానే సెట్‌ను గెలిచి విజేతగా అవతరించింది. కాగా, ఫైనల్లో ఒసాకా ఏకంగా 9 ఏస్‌లను సంధించగా, క్విటోవా ఐదు ఏస్‌లను మాత్రమే సంధించింది. కాగా ఈ విజయంతో ఒసాకా మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది.



దిగ్గజాల తుది పోరు నేడే

మరోవైపు పురుషుల సింగిల్స్ తుది పోరు ఆదివారం జరుగనుంది. ఈ సమరంలో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా), రెండో సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ తలపడుతున్నారు. కిందటి ఏడాది అసాధారణ ఆటతో రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలను సొంతం చేసుకున్న సెర్బియా యోధుడు జకోవిచ్ హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేశాడు. మరోవైపు స్పెయిన్ దిగ్గజం కూడా తన ఖాతాలో మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను జత చేసుకోవాలని తహతహలాడుతున్నాడు. ఇద్దరు కూడా భీకర ఫామ్‌లో ఉండడంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయం. ఇద్దరు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో ఎవరికి విజయం దక్కుతుందో ముందే ఊహించడం చాలా కష్టం. ఇద్దరు కూడా ప్రపంచ టెన్నిస్‌లో ఎదురులేని శక్తులుగా కొనసాగుతున్నారు. ఇద్దరు సయితం గాయాలను జయించి తిరిగి విజయపథంలో ప్రయాణిస్తున్నారు. ఇరువురికి ఈ టైటిల్ చాలా కీలకంగా మారింది. ఇందులో గెలిచి కొత్త సీజన్‌ను ఘనంగా ప్రారంభించాలని ఇద్దరు తహతహలాడుతున్నారు. కాగా, దిగ్గజాల తుది సమరం కోసం అభిమానులు కూడా ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నారు.



శనివారం ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ర్యాంప్‌పై హొయలు ఒలికిస్తున్న భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా

ఫైనల్లో సైనా



జకార్తా: భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ప్రతిష్టాత్మకమైన ఇండోనేషియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్లో సైనా 18–21, 21–12, 12–18తో చైనా క్రీడాకారిణి, ఏడో సీడ్ హి బింగ్‌జియావోను ఓడించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో సైనా చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రారంభం నుంచే పోరు ఉత్కంఠభరితంగా సాగింది. తొలి సెట్‌లో బింగ్‌జియావో జోరు కొనసాగించింది. సైనా కూడా గట్టి పోటీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. బింగ్‌జియావో చూడచక్కని షాట్లతో సైనాను ఒత్తిడికి గురి చేసింది. ఒత్తిడిలో సైనా వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో బింగ్‌జియావో సఫలమైంది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ తొలి సెట్‌ను దక్కించుకుంది. కానీ, రెండో సెట్‌లో భారత స్టార్ సైనా పుంజుకుంది. ప్రారంభం నుంచే ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించింది. పొరపాట్లకు తావివ్వకుండా ఆడిన సైనా లక్ష్యం దిశగా అడుగులు వేసింది. సైనా దూకుడుగా ఆడడంతో బింగ్‌జియావో ఏదశలోనూ గట్టి పోటీ ఇవ్వలేక పోయింది. చివరి వరకు జోరును కొనసాగించిన సైనా సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఇటు సైనా అటు బింగ్‌జియావో సర్వం ఒడ్డారు. దీంతో ప్రతిపాయింట్ కోసం హోరాహోరీ తప్పలేదు. అంతేగాక ఇద్దరు పట్టువీడకుండా ఆడడంతో తరచు ఆధిక్యం చేతులు మారుతూ వచ్చింది. కానీ, కీలక సమయంలో బింగ్‌జియావో ఒత్తిడికి గురైంది. ఇదే క్రమంలో వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సైనా సఫలమైంది. చివరి వరకు నిలకడగా ఆడుతూ సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. కాగా కరోలినా మారిన్ (స్పెయిన్), చెన్ యూఫి(చైనా) మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో సైనా ఫైనల్లో తలపడుతుంది. ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

జోష్ తగ్గని భారత్



చెలరేగిన కుల్దీప్ | రాణించిన రోహిత్, ధావన్ | మెరిసిన ధోని, రాయుడు | రెండో వన్డేలోనూ కోహ్లి సేన గెలుపు

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. భారత్ మరోసారి సమష్టిగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్, బౌలింగ్‌లో స్పిన్నర్లు రాణించడంతో టీమిండియా వరుసగా రెండో వన్డేలోనూ జయకేతనం ఎగుర వేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. తర్వాత భారీ లక్ష్యంతో ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 334 పరుగులకే కుప్పకూలింది. కుల్దీప్ నాలుగు, చాహల్ రెండు వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో రాణించిన రోహిత్ శర్మకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే సోమవారం జరుగుతుంది.

శుభారంభం..

టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు శుభారంభం అందించారు. ఇద్దరు కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. ఒకవైపు జాగ్రత్తగా ఆడుతూనే చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. ఈ జోడీని విడగొట్టేందుకు కివీస్ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అద్భుత సమన్వయంతో ఆడిన రోహిత్, ధావన్‌లు తొలి వికెట్‌కు వంద పరుగుల భాగస్వామ్యాన్ని జత చేశారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ధావన్ 67 బంతుల్లో 9 ఫోర్లతో 66 పరుగులు చేసి ఔటయ్యాడు. అప్పటికే రోహిత్‌తో కలిసి మొదటి వికెట్‌కు రికార్డు స్థాయిలో 154 పరుగులు జోడించాడు. కొద్ది సేపటికే రోహిత్ శర్మ కూడా వెనుదిరిగాడు. అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచిన రోహిత్ 96 బంతుల్లో 9 ఫోర్లు, మరో మూడు భారీ సిక్సర్లతో 87 పరుగులు చేసి ఔటయ్యాడు.

ధోని మెరుపులు

తర్వాత వచ్చిన అంబటి రాయుడు, మహేంద్ర సింగ్ ధోనిలు అద్భుతంగా ఆడారు. ఆస్ట్రేలియా సిరీస్‌లో వరుసగా మూడు అర్ధ సెంచరీలు సాధించిన ధోని ఈసారి కూడా అదే జోరును కొనసాగించాడు. ధోని, రాయుడులు కివీస్ బౌలర్లను హడలెత్తిస్తూ స్కోరును పరిగెత్తించారు. రాయుడు ధాటిగా ఆడుతూ స్కోరు వేగాన్ని పెంచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రాయుడు 45 బంతుల్లో ఐదు ఫోర్లతో 43 పరుగులు చేశాడు. మరోవైపు ధాటిగా ఆడిన ధోని 33 బంతుల్లోనే ఐదు ఫోర్లు, మరో సిక్సర్‌తో 48 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కేదార్ జాదవ్ కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. 10 బంతుల్లోనే మూడు బౌండరీలు, ఒక సిక్స్‌తో 22 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో భారత్ స్కోరు 324 పరుగులకు చేరింది. కివీస్ బౌలర్లలో ఫెర్గ్యూసన్ పది ఓవర్లలో ఏకంగా 81 పరుగులు సమర్పించుకోవడం విశేషం.

ప్రారంభం నుంచే..

తర్వాత భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశ పరిచాడు. రెండు ఫోర్లతో 15 పరుగులు మాత్రమే చేసి భువనేశ్వర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. చాహల్ బౌండరీ వద్ద అద్భుత క్యాచ్ పట్టాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విలియమ్సన్ భారత బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. అయితే అది తాత్కాలికమే అయ్యింది. 11 బంతుల్లో రెండు సిక్స్‌లు, మరో ఫోర్‌తో 20 పరుగులు చేసిన విలియమ్సన్‌ను షమీ అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు.

బ్రేస్‌వెల్ ఒంటరి పోరాటం

మరోవైపు ఓపెనర్ మన్రో మూడు ఫోర్లు, సిక్స్‌తో 31 పరుగులు చేసి చాహల్ చేతికి చిక్కాడు. సీనియర్ ఆటగాడు రాస్ టైలర్ 22 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు వికెట్ కీపర్ లాథమ్ 34 పరుగులు సాధించాడు. గ్రాండోమ్ 28 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఒంటరి పోరాటం చేసిన బ్రేస్‌వెల్ 46 బంతుల్లో మూడు సిక్సర్లు, మరో ఐదు ఫోర్లతో 57 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో కుల్దీప్ నాలుగు, చాహల్, భువనేశ్వర్ రెండేసి వికెట్లు తీశారు.



స్కోరుబోర్డు:

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) గ్రాండోమ్ (బి) ఫెర్గ్యూసన్ 87, శిఖర్ ధావన్ (సి) లాథమ్ (బి) బౌల్ట్ 66, విరాట్ కోహ్లి (సి) ఐష్ సోధి (బి) బౌల్ట్ 43, అంబటి రాయుడు (సి) అండ్ (బి) ఫెర్గ్యూసన్ 47, మహేంద్ర సింగ్ ధోని నాటౌట్ 48, కేదార్ జాదవ్ నాటౌట్ 22, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 50 ఓవర్లలో 324/4.
బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 10–0–61–2, బ్రేస్‌వెల్ 10–0–59–0, ఫెర్గ్యూసన్ 10–0–81–2, ఐష్ సోధి 10–0–43–0, గ్రాండోమ్ 8–0–62–0, కొలిన్ మన్రో 2–0–17–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: మార్టిన్ గుప్టిల్ (సి) చాహల్ (బి) భువనేశ్వర్ 15, కొలిన్ మన్రో ఎల్బీ–బి చాహల్ 31, కేన్ విలియమ్సన్ (బి) షమీ 20, రాస్ టైలర్ (స్టంప్డ్) ధోని (బి) కేదార్ 22, టామ్ లాథమ్ ఎల్బీ–బి కుల్దీప్ 34, నికోలస్ (సి) షమీ (బి) కుల్దీప్ 28, గ్రాండోమ్ (సి) రాయుడు (బి) కుల్దీప్ 3, బ్రేస్‌వెల్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 57, ఐష్ సోధి (బి) కుల్దీప్ 0, ఫెర్గ్యూసన్ (సి) శంకర్ (బి) చాహల్ 12, ట్రెంట్ బౌల్ట్ నాటౌట్ 10, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 40.2 ఓవర్లలో 234 ఆలౌట్.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 7–1–42–2, మహ్మద్ షమీ 5–0–43–1, విజయ్ శంకర్ 2–0–17–0, చాహల్ 9.2–0–52–2, కేదార్ జాదవ్ 6–0–35–1, కుల్దీప్ యాదవ్ 10–0–45–4.



ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ విజయం

తొలి టెస్టులో శ్రీలంక చిత్తు

బ్రిస్బేన్: శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆసీస్ ఈ మ్యాచ్‌ను మూడు రోజుల్లోనే కైవసం చేసుకోవడం గమనార్హం. 17/1 ఓవర్ నైట్ స్కోరుతో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయింది. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి విలవిలలాడుతూ 139 పరుగులకే కుప్పకూలింది. దీంతో లంకకు అవమానకర రీతిలో ఓటమి తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచిన బ్యాట్స్‌మెన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేక పోయారు. జట్టులో ఇద్దరు మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. ఓపెనర్‌గా దిగిన తిరిమన్నే 32 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండో అత్యధిక స్కోరు 25 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో లభించాయి. ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్ అద్భుతంగా రాణించాడు. చెలరేగి బౌలింగ్ చేసిన కమిన్స్ 23 పరుగులకే ఆరు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో కూడా కమిన్స్ నాలుగు వికెట్లు పడగొట్టిన విషయం తెలిసిందే.

సౌతాఫ్రికా గెలుపు

సెంచూరియన్: పాకిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. ఓపెనర్ ఇమాముల్ హక్ (101) సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. బాబర్ ఆజమ్ (69), మహ్మద్ హఫీజ్ (52) తమవంతు పాత్ర పోషించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 33 ఓవర్లల రెండు వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రీజా హెండ్రిక్స్ 8ఫోర్లు, రెండు సిక్స్‌లతో 83 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ డుప్లెసిస్ 40 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఈ సమయంలో వర్షం రావడంతో ఆటను నిలిపి వేశారు.

ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర రాజకీయాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే రైతు సంఘం నాయకులు గుర్రం యాదగిరి రెడ్డి పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారంకు ఆయన అభినందనలు తెలిపారు. రైతుల అభివృద్ధికి పోచారం విశేష కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండో హరిత విప్లవానికి పోచారం వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడే బీజం పడిందన్నారు. వ్యవసాయంలో పరిశోధనలకు ఊతమిచ్చే విధంగా కొత్త పుంతలు తొక్కించారన్నారు.

సైనిక పాటవం... సంస్కృతీ ప్రతీక

70 ఏళ్ల గణతంత్ర జాతికి ఖ్యాతిదాయక కవాతు





వాయుదళం నుంచి 144 మంది వీరులు

వాయుదళ పాటవాన్ని ప్రతిబింబించే రీతిలో ఎయిర్ ఫోర్స్ శకటం సాగింది. ఈ దళంలో 144 మంది వాయుదళ వివిధ స్థాయిల వారు పాల్గొన్నారు. స్వదేశీ పరిజ్ఞానం దిశలో భారతీయ వైమానిక దళం ఇతివృత్తంతో వాయుదళ శకటం సాగింది. ఇక గగనతలంలో రుద్రా రూపకల్పన అందరిని అబ్బురపర్చింది. వి ఆకారంలో వాయుదళ హెలికాప్టర్లు నింగిలో చక్కర్లు కొట్టడం , తరువాత హెర్క్యులస్ రూపంతో తారసిల్లడంతో వాయుదళం బాహుబలి సత్తాను చాటుకుంది.



న్యూఢిల్లీ : భారతదేశ ఘనమైన చరిత్ర, వైవిధ్య సంస్కృతి ప్రతీకలు, సైనిక పాటవ ప్రదర్శనల నేపథ్యంలో ఆసేతు హిమాచలం శనివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. దేశ రాజధాని ఢిల్లీలో రాజ్‌పథ్ వద్ద వేలాది మంది ప్రజలు చలిని ధిక్కరిస్తూ జాతీయ ఉత్సవ సంబరాన్ని తిలకించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహా సైనిక కవాతును ఆద్యంతం ప్రముఖులు, ఆబాల గోపాలం ఆసక్తితో తిలకించారు. దేశం స్వాతంత్ర్య పతాకం దక్కించుకుని, సర్వసత్తాకం అయిన వేళకు తార్కాణంగా గణతంత్రం వేడుకలు జరిగాయి. దేశ త్రివిధ సైనిక దళాల అధిపతి , రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలుత దేశ అత్యున్నత ధైర్య సాహస పతాకం అశోక్ చక్రను లాన్స్ నాయక్ నజీర్ అహ్మ వనీకి బహుకరించిన తరువాత రిపబ్లిక్ డే పరేడ్ ఆరంభం అయింది. ఈ సారి దేశ గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిధిగా దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రామఫోసా హాజరయ్యారు. విదేశీ రాయబారులు, పలు దేశాలకు చెందిన ప్రముఖులు, దేశ రాజకీయ పార్టీల నేతలు, సైనిక ఉన్నతాధికారులు ఈ గంటన్నర కవాతును ఆసక్తితో తిలకించారు. సైనిక పాటవం కళ్ల ముందు కదలాడుతూ ఉంటే జనం కేరింతలు కొట్టారు, వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్కృతి సౌరభాలు, సోయగాలను ప్రతిఫలించే శకటాలు ముందుకు కదులుతూ ఉంటే చప్పట్లు కొట్టారు. 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 22 శకటాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు చెందిన ఆరు శకటాలు సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈసారి అత్యంత ప్రధానంగా మహాత్మా గాంధీ జీవిత ఘట్టాలను ప్రముఖ రీతిలో తెలియచేస్తూ మహాత్మా గాంధీ జీవితం, ఆశయాల ఇతివృత్తంతో సాంస్కృతిక కవాతు సాగింది. దక్షిణాఫ్రికాతో మహాత్మా గాంధీకి ఉన్న పోరాట అనుబంధం, ఈ ఏడాదే గాంధీజి 150వ జయంతి ఉత్సవాలకు రంగం సిద్ధం అయిన దశలో దక్షిణాఫ్రికా నేతనే ఈ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా రావడం విశేషంగా మారింది.ఈసారి అశోక్ చక్ర పురస్కారం దక్కించుకున్న లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీకి ప్రత్యేకత ఉంది. తొలుత ఉగ్రవాది అయిన వనీ తరువాత సైన్యంలో చేరి నవంబర్‌లో ఉగ్రవాదులతో పోరులో ప్రాణాలు అర్పించాడు. ఆ వీరుడి భార్య మహజబీన్, తల్లి రజాబనోలకు ఈ పురస్కారం రాష్ట్రపతి చేతుల మీదుగా అందించారు. ప్రధాని నరేంద్ర మోడీ తొలుత స్థానిక ఇండియా గేట్ వద్ద అమర్ జవాన్ జ్యోతి నుంచి అమరజవాన్లకు నివాళి ఘటించారు, వారి బలిదానానికి జాతి సంస్మరణకు ప్రతీకగా సాగే కార్యక్రమంలో పాల్గొన్నారు. స్మారక స్థలి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు. ఆ తరువాత రిపబ్లిక్ డే కవాతు జరిగింది. గణతంత్ర ఉత్సవాల సాంప్రదాయాల ప్రకారం రాష్ట్రపతి జాతీయ త్రివర్ణ పతాకం ఎగురవేసిన తరువాత జాతీయ గీతాలాపన అనంతరం 21 గన్ శాల్యూట్ ప్రక్రియ జరిగింది. ఆ తరువాత కవాతులోని సైనిక దళాల సైనిక గౌరవ వందనాన్ని రాష్ట్రపతి స్వీకరించారు.

నేషనల్ ఆర్మీ ప్రముఖుల హాజరు

ఈసారి పెరేడ్‌లో అప్పటి ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఎ) ప్రముఖులు పర్మానంద్ , లల్తీ రామ్ , హీరా సింగ్, భగ్మల్‌లు వీరంతా 90 ఏళ్ల పై ప్రాయంలో ఉన్న వారు కవాతు సందర్భంగా ప్రముఖంగా హాజరు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి సైనిక పాటవ ప్రదర్శనలో అమెరికాకు చెందిన హోవిట్జర్లు, ప్రధాన రణ క్షేత్ర శకటం టి 90, స్వదేశీ నిర్మిత ఆకాశ్ యుద్ధ వ్యవస్థలు తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. ఆహుతులలో విశిష్ట అతిధి రామఫోసా పక్కనే ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ దేశ వివిధ రాజకీయ పార్టీల నేతలు, కేడర్ల వారిగా సైనికాధికారులు తమ స్థానాలలో ఆసీనులయ్యారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కవాతు ఇతర కార్యక్రమాలు ఎటువంటి అవాంఛనీయతలు లేకుండా జరిగాయి.

26 మంది పురస్కార బాలల హాజరు

అసాధారణ ప్రతిభ కనబర్చి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను పొందిన 26 మంది బాలలు ఈ సారి రిపబ్లిక్ డేకు ప్రత్యేకంగా హాజరు అయ్యారు. వీరు కవాతును ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. మద్రాసు రెజిమెంట్, రాజ్‌పుతానా రైఫిల్స్, సిక్కు రెజిమెంట్, గూర్ఖా దళం వారు సైనిక కవాతులో ప్రత్యేకతను చాటుకున్నారు.

'అశోక చక్ర' అందుకున్న నజీర్ కుటుంబీకులు

కశ్మీర్‌లోని షోపియాన్‌లో ఉగ్రవాదులతో పోరాడి అశువులు బాసిన లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్‌వానికి భారతదేశపు అత్యున్నత సైనిక పురస్కారం అశోక్‌చక్ర లభించింది. ఒకప్పుడు ఉగ్రవాదిగా ఉన్న నజీర్ వాని ఈ అవార్డు లభించిన మొదటి కశ్మీరీ. శనివారం దేశ రాజధానిలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవాల్లో వని భార్య, ఆయన తల్లి నజీర్ తరపున రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి ఈ అవార్డును స్వీకరించారు. జమ్ము – కశ్మీర్‌లో కుల్గాం జిల్లా చెకి అషుంజీకి చెందిన 38 ఏళ్ల నజీర్ అహ్మద్ వని నవంబర్ 25న షోపియాన్‌లో బట్గండ్ సమీపంలో ఉన్న హీరాపూర్ గ్రామంలో ఆరుగురు ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సాహసోపేతంగా పోరాడి చివరికి మృత్యువాత పడ్డారు. ఉగ్రవాదుల బుల్లెట్లు తగిలి తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన లష్కర్ ఎ తయిబాకు చెందిన జిల్లా కమాండర్, మరో ఉగ్రవాదిని హతమార్చారు. తలలో బుల్లెట్లు ఉన్నప్పటికీ, మరణించడానికి ముందు తీవ్రంగా పోరాడి మరో ఉగ్రవాదిని గాయపరిచారు.





అమర జవాన్ జ్యోతి వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రధాని మోడీ

నారీ శక్తి

ఈసారి గణతంత్ర వేడుకల్లో మహిళాశక్తి ప్రత్యేక ఆకర్షణగా మారింది. వేడుకల్లో పెరేడ్‌లు నిర్వహించిన నౌకా, సైనిక దళాలకు, సిగ్నల్స్ దళానికి మహిళాధికారులే సారథ్యం వహించడం విశేషం. రిపబ్లిక్ వేడుకల్లో అనేక అంశాల్లో 'మొదటిసారి' గౌరవాన్ని దక్కించుకున్నారు. 'ఫస్ట్' మార్కులు కొట్టేశారు.

- అందరూ పురుషులే ఉన్న సైనిక సర్వీస్ దళానికి లెఫ్టినెంట్ భావనా కస్తూరి నాయకత్వం వహించారు. రిపబ్లిక్ డే పెరేడ్‌లో పురుషుల దళానికి సారథ్యం వహించిన మొదటి మహిళాధికారి కస్తూరి.
- సుదీర్ఘ చరిత్ర ఉన్న పారామిలిటరీ దళం అస్సాం రైఫిల్స్. అందరూ స్త్రీలే ఉన్న అస్సాం రైఫిల్స్ పారామిలిటరీ బృందం రిపబ్లిక్ వేడుకల్లో మొదటిసారి పాల్గొన్నది. ఈ బృందానికి మేజర్ ఖుష్బూ కన్వర్ నాయకత్వం వహించారు.
- కె..9 వజ్రా, ఎం 777 హోవిట్జర్స్ ఈ ఏడాది మొదటిసారి రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొన్నాయి. డిఆర్‌డిఓ ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే మీడియం రేంజ్ క్షిపణిని ప్రదర్శించింది.
- సిగ్నల్స్ దళానికి చెందిన కెప్టెన్ శిఖా దేర్ డెవిల్స్ బృందంతో కలిసి చేసిన సాహస విన్యాసాలు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాయి.
- రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొన్న అనేక బృందాలకు మహిళలు సారథ్యం వహించడం ఇదే మొదటిసారి. ట్రాన్స్‌పోర్టబుల్ శాటిలైట్ టెర్మినల్ దళాన్ని కెప్టెన్ భావనా సయాల్ లీడ్ చేశారు. నావికాదళ కాంటిన్‌జెంట్‌కు లెఫ్టినెంట్ కమాండర్ అంబికా సుధాకరన్ సారథ్యం వహించారు.
- రాష్ట్రాలవారీగా ప్రదర్శించిన శకటాల్లో అస్సాం శకటం ఆకట్టుకుంది. జనాదరణ పొందిన భూపేన్ హజారికా పాటను ప్రదర్శించారు.
- జలియన్ వాలాబాగ్ మారణకాండ జరిగి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా పంజాబ్ శకటం 1919 నాటి దురంతాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించింది.
- సైనిక వైమానిక దళం అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్స్ వెపన్ సిస్టం రుద్ర, రెండు ఎఎల్‌హెచ్ లు ధ్రువ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.
- మహాత్మాగాంధీ 150వ జయంతి ఆధారంగా ఈసారి పెరేడ్‌కు రూపకల్పన జరిగింది.





పసుపు, నారింజ రంగు టర్బన్ ధరించిన మోడీ

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంప్రదాయబద్ధమైన రంగురంగుల టర్బన్‌లు ధరించడం ఇష్టమన్న సంగతి శనివారంనాటి రిపబ్లిక్ దినోత్సవాల్లో మరోసారి వెల్లడైంది. ఆయన పసుపు..నారింజ రంగుతో ఎర్రటి కుచ్చు ఉన్న టర్బన్ ధరించి రిపబ్లిక్ దినోత్సవాలకు హాజరయ్యారు. సంప్రయాయసిద్ధమైన కుర్తా పైజమా, నెహ్రూ మార్కు జాకెట్ ధరించిన మోడీ ...రిపబ్లిక్ డే పెరేడ్‌కు హాజరయ్యే ముందు అమర్ జవాన్ జ్యోతి దగ్గర అమరవీరులకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవాల్లో ప్రధాని ఇలాంటి టర్బన్‌లు ధరించడం ఆయవాయితీ. ఆయన తలపాగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రధానమంత్రి ఒక్కో సంవత్సరం ఒక్కో రంగు టర్బన్‌లతో ఆయా దినోత్సవాల్లో పాల్గొంటున్నారు.



రామఫోసా రెండోవాడు..

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా 70వ గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెల్సన్ మండేలాతో సహా గత కొన్ని దశాబ్దాలుగా భారత గణతంత్ర దినోత్సవానికి ఎంపిక చేసిన ప్రపంచ నాయకులు ప్రతి ఏటా హాజరవుతున్నారు. రిపబ్లిక్ వేడుకలకు హాజరైన దక్షిణాఫ్రికా అధ్యక్షుల్లో రామఫోసా రెండోవారు. 24 సంవత్సరాల క్రితం నెల్సన్ మండేలా ఈ వేడుకలకు హాజరయ్యారు. సతీమణి డాక్టర్ ఎపోమోట్సెపే, తన మంత్రులు, సీనియర్ అధికారుల బృందంతో వచ్చిన రామఫోసా రాజ్‌పథ్‌లో 90 నిముషాలపాటు నేత్రపర్వంగా జరిగిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్ని వీక్షించారు.



ఎట్ హోం సందర్భంగా రాష్ట్రపతికి నమస్కరిస్తున్న ప్రధాని మోడీ, స్పీకర్ సుమిత్రా మహాజన్

దేశభక్తిని రగిలించిన గన్ శాల్యూట్

రిపబ్లిక్ డే సందర్భంగా రాజధానిలోని రాజ్‌పథ్‌లో కన్నులపండువగా జరిగిన వేడుకలో జాతీయగీతం వినిపిస్తుంటే...సైనిక దళం 21సార్లు తుపాకులు పేల్చి చేసిన వందనం అక్కడ హాజరైన ప్రతి ఒక్కరిలో దేశభక్తిని ఆవిర్భవింపచేసింది. 2281 ఫీల్డ్ రెజిమెంట్‌కు చెందిన ఏడు ఫిరంగుల దళం జాతీయ గీతంతో ప్రారంభించి, అది పూర్తయ్యేవరకూ గన్ శాల్యూట్ చేసింది. జాతీయ గీతం ఆలాపన కాలవ్యవధిని అనుసరించి, సరిగ్గా సమయపాలన చేస్తూ క్రమబద్ధంగా 21 సార్లు గన్ శాల్యూట్ నిర్వహించారు. ఒక్కొక్క గన్‌కు ముగ్గురు సిబ్బంది ఉన్నారు. సరిగ్గా జాతీయగీతంతో సమన్వయం చేస్తూ గన్ శాల్యూట్ జరపడానికి ప్రత్యేకమైన గడియారాలు వాడారు.



గాంధీజీ ఇతివృత్త శకటాలు

పంజాబ్‌కు చెందిన శకటం జలియన్ వాలాబాగ్ జ్ఞాపకాలను తలపించే శకటాన్ని, మహారాష్ట్ర శకటం క్విట్ ఇండియా ఘట్టాన్ని ప్రదర్శించింది. అండమాన్ జైలులో గాంధీజీ తోటి ఖైదీలతో ఉన్నప్పటి అంశాలతో అండమాన్ నికోబార్ శకటం సాగింది. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామీణ స్వరాజ్యం గురించి తెలిపే ప్రదర్శన అసోం శకటంలో కళ్లకు కట్టి చూపారు. గుజరాత్ శకటం దండి యాత్రను కళ్ల ముందుంచింది.



Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666